www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ మృతి

రష్యా సైన్యంలో సహాయకుడిగా చేరిన అఫ్సాన్ మృత్యువాత



హైదరాబాద్ సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన హైదరాబాద్ యువకుడు మహ్మద్ అఫ్సాన్(30) మరణించాడు. దళారుల మాయమాటలు నమ్మిన అఫ్సాన్ రష్యా సైన్యంలో సహాయకుడిగా చేరాడు. ఉక్రెయిన్ సరిహద్దులో రష్యా సైన్యంతో కలిసి పని చేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. నాంపల్లిలోని బజార్‌ఘాట్ ప్రాంతానికి చెందిన అఫ్సాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అఫ్సాన్ మరణించాడని, అతని మృతదేహాన్ని స్వదేశానికి పంపేందుకు ప్రయత్నిస్తున్నామని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ప్రకటించింది. అఫ్సాన్ కుటుంబసభ్యులతో మాట్లాడామని

మిగతా 14వ పేజీలో...

గురువారం | 7-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 322 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 1.21 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 1.04 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా. 4.40-6.06; దుర్ముహూర్తం: ఉ. 10.29-11.16; అమృతఘడియలు: ఉ. 7.09-8.37; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 6.20 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మా ప్రభుత్వాన్ని టచ్ చేస్తే..

మానవ బాంబులే

అగ్ని కణికలైతరు.. ఎవడూ మిగలడు.. ఆషామాషీగా వచ్చినోళ్లం కాదు

పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం.. 90 రోజుల్లోనే పలు పథకాలను తీసుకొచ్చాం

పాలమూరుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తాం.. కాంగ్రెస్‌తోనే ఎస్సీల వర్గీకరణ

మోదీని దేశ ప్రధానిగా గౌరవించా.. రాష్ట్రానికి నిధులివ్వకపోతే చాకిరేవు పెడతా

నేను, మంత్రులూ సెలవుల్లేకుండా పని చేస్తున్నాం.. ప్రజాదీవెన సభలో రేవంత్

ఎమ్మెల్సీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి పేరు ప్రకటించిన సీఎం.. కాంగ్రెస్‌లోకి కోనేరు కోనప్ప



ప్రజాదీవెన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

మహబూబ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువకాలం ఉండదంటూ విమర్శిస్తున్న వారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ మైదానంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' సభలో ప్రసంగిస్తూ ఈ అంశంపై సీఎం నిప్పులు చెరిగారు. 'ఎవడన్న టచ్ చేసి చూడండి. మా పాలమూరు బిడ్డలు అగ్ని కణికలైతరు.. మానవ బాంబులైతరు.. ఎవడన్న మిగుల్తడేమో నేను చూస్త. అనుకుంటన్నరేమో, తమాషా చేస్తున్నరేమో.. వాన్నీ వీన్నీ సందులల్ల సక్కలగుల వెట్టి

మిగతా 13వ పేజీలో...

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం!

రిజర్వాయర్లు అడుగంటుతున్నాయి

రైతులకు అండగా ఉంటాం

ఎండాకాలంలో తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు

రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రైతునేస్తం

వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



పాలమూరు ప్రజాదీవెన సభకు భారీగా హాజరైన ప్రజలు



గ్రూప్-1 మెయిన్స్ అక్టోబరు 21 నుంచి

గ్రూప్-1 ప్రిలిమినరీ జూన్ 9న

గ్రూప్-2 ఆగస్టు 7, 8 తేదీల్లో

గ్రూప్-3 నవంబరు 17, 18న

షెడ్యూల్ ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ పోస్టుల భర్తీకి వరుసగా పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్ణయించింది. పరీక్షల తేదీలను బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది చివరి నాటికి అన్ని పరీక్షలు పూర్తయ్యేలా షెడ్యూల్ ఖరారు చేసింది. దీని ప్రకారం.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు అక్టోబరు 21 నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 7 పేపర్లు ఉండే ఈ పరీక్షలు వారం పాటు కొనసాగుతాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న నిర్వహించాలని ఇంతకుముందే నిర్ణయించిన విషయం తెలిసిందే. సుమారు 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో రోజుకు రెండు (ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొకటి) చొప్పున మొత్తం నాలుగు పేపర్లు ఉంటాయి. గ్రూప్-3 పరీక్షలు (మొత్తం మూడు పేపర్లు) నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. గ్రూప్-3లో మొత్తం 1,388 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇలా ఈ ఏడాది చివరి నాటికి గ్రూప్ పోస్టుల భర్తీకి పరీక్షలు పూర్తి చేయడంతో పాటు ఫలితాలు కూడా ప్రకటించాలని భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే పరీక్షల షెడ్యూల్ ప్రకటించారు.

గ్రూప్ పరీక్షల వివరాలు..

పరీక్ష	పోస్టులు	పేపర్లు
గ్రూప్-1 (ప్రిలిమనరీ)	563	1
గ్రూప్-2	783	4
గ్రూప్-1 (మెయిన్స్)	563	7
గ్రూప్-3	1,388	3





రేవంత్‌ను చరిత్ర క్షమించదు

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని.. మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు

తెలంగాణ సోయిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం దౌర్భాగ్యం: కేటీఆర్

3

రేవంత్ పాలనలో ఏముంది?

బీజేపీకి ప్రేమలేఖలు తప్ప ఏం చేశారు?

ఏం చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలి?

3

మోదీ ఆశీర్వాదం కోసమే రేవంత్ తాపత్రయం

మళ్లీ మోదీయే ప్రధాని అని చెప్పకనే చెప్పారు

తెలంగాణ ప్రజలను, రాహుల్‌ను మోసం చేశారు

ప్రతిపక్ష నేత సరైన సమయంలో జవాబిస్తారు

మా ఎంపీలను బీజేపీ లాగేసుకుంటోంది

ప్రజాపాలనలో జర్నలిస్టులకు స్వేచ్ఛ ఏదీ?: హరీశ్

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ ధర్నాలు

పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని డిమాండ్

జిల్లాకేంద్రాల్లో, మున్సిపల్ ఆఫీసుల ఎదుట నిరసనలు

హామీ ఇచ్చి మాట మారుస్తారా?: బీఆర్‌ఎస్ నేతల ఫైర్



పొత్తుపొడుపు!

బీజేపీ పిలుపుపై నేడు ఢిల్లీకి చంద్రబాబు

ఒకట్రెండు రోజుల్లోనే ఏపీలో సీట్ల సర్దుబాటు ఖరారు

పవన్‌కూ హస్తిన పిలుపు!

2

బీజేపీ గెలవగలిగే సీట్లే ఇవ్వాలని బాబుకు టీడీపీ నేతల సూచన

రాజమండ్రి, ఏలూరు, రాజంపేట సహా 5 సీట్లు కోరుతున్న కమలనాథులు

11 అసెంబ్లీ స్థానాలు కూడా..

బాబుతో అవగాహన కుదిరితే రేపో, ఎల్లుండో అభ్యర్థుల ఖరారు?

ఎన్డీయేలో టీడీపీ చేరిక కూడా..

తాగునీటికి కష్టమే!

హైదరాబాద్ వాసులకు మే నెలలో కటకట తప్పదా?

ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించండి

తాగునీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచండి

అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

ఐతే ఎల్లంపల్లిలో ప్రస్తుతం ఉన్నవే 10 టీఎంసీలు

4 టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే లిఫ్టింగ్‌కు చాన్స్

కడెం ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ తరలించే వీలు

అంటే ఎల్లంపల్లి నుంచి తరలించగలిగేది 7 టీఎంసీలే

ఇవి రెండు నెలల అవసరాలకే సరిపోతాయి



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హైదరాబాద్ సిటీ, గోదావరిఖని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ వాసులకు మున్ముందు మరింతగా నీటి కష్టాలు చుట్టుముట్టనున్నాయా? మార్చి, ఏప్రిల్‌లో ఎలాగో అలా నెట్టుకొచ్చినా.. మండు వేసవి అయిన మే, జూన్ నెలల్లో దాహార్తి తప్పదా? ఎల్లంపల్లి ప్రాజెక్టులో గత పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా నీటి నిల్వలు భారీగా పడిపోవడం, హైదరాబాద్ తాగు నీటి అవసరాల్లో 40శాతం మేర ఆ ప్రాజెక్టు నుంచే వస్తుండటం.. ఆ ప్రాజెక్టు నుంచి నీళ్లను ఇతర ప్రాంతాల్లోని తాగు నీటి అవసరాలకూ తరలిస్తుండటం.. నగరానికి కృష్ణా నుంచీ వచ్చే నీళ్లూ తగ్గనుండటంతో హైదరాబాద్‌కు మున్ముందు తాగునీటి కష్టాలు చుట్టుముట్టనున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని

మిగతా 12వ పేజీలో...

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో అడుగంటిన భూగర్భ జలాలు

పంట నష్టం రూ.180 కోట్ల దాకా

బోర్లు తవ్విస్తున్నా చుక్కనీరు లేదు

12

చెరువులు నింపితే భూగర్భజలాలు పైకొస్తాయనే ఆశ

సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

గొంతెండుతున్న బెంగళూరు

రిజర్వాయర్లలో అడుగంటిన నీరు

ట్యాంకర్లకు భారీగా వసూళ్లు

2

మా ఇంటి బోర్ కూడా ఎండింది: డీకే

జోరుగా ధరణి స్పెషల్ డ్రైవ్

పెండింగ్ దరఖాస్తులపై లోతుగా రికార్డుల పరిశీలన

అన్నీ బాగుంటేనే ధరణి దరఖాస్తులకు అనుమతులు

భూమి అమ్మినా మ్యుటేషన్ కాని చోట ఇద్దరికీ పిలుపు

ఉన్న సిబ్బంది వందల్లో.. దరఖాస్తులు పెద్ద సంఖ్యలో!

గడువులోపు పరిష్కారం కష్టమేనంటున్న అధికారులు

ధరణి

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి మార్చి 1 నుంచి ప్రభుత్వం చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో పరిశీలన లోతుగా కొనసాగుతోంది. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు అన్ని రికార్డులనూ రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. దొరికిన చోట.. 1952-54 నాటి భూరికార్డులను సైతం ముందు పెట్టుకొని పొరపాటు ఎక్కడ జరిగిందో ఆరా తీస్తున్నారు. రెవెన్యూ రికార్డులకు ప్రామాణికంగా భావించే ఖాస్రా పహాణీ, చేసాలా, సేత్వార్ రికార్డులు, పాత పహాణీలు, ఆన్‌లైన్‌లోని ధరణి రికార్డులను పరిశీలించి.. దరఖాస్తులను అనుమతించాలా? వద్దా? అనే నివేదికలను తయారుచేసే పనిలో స్పెషల్ డ్రైవ్ బృందాలు ఉన్నాయి. ఇప్పటికే పలు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించినట్లు సమాచారం. ధరణి రాక ముందు కొందరు భూములు అమ్మగా.. కొన్నవారు వాటిని సకాలంలో మ్యుటేషన్

మిగతా 14వ పేజీలో...



13

4.50 లక్షల 'ఇందిరమ్మ ఇళ్లు'

400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా నిర్మాణం

ఒక్కో ఇంటికి 5 లక్షల సాయం

తొలి విడతలో స్థలం ఉన్నవారికే

11న పథకం: పొంగులేటి

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



కోల్‌కతాలో నదీగర్భ మెట్రో రైల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

సందేశ్‌ఖాలీతో టీఎంసీ ఖాళీ!

ఈ తుఫాన్ బెంగాల్ అంతటా ఆవరిస్తుంది

నారీశక్తితో ఆ పార్టీ పతనం ఖాయం: ప్రధాని

రాష్ట్రంలో పేద మహిళలపై అఘాయిత్యాలు

నేరగాళ్లకే మమత సర్కారు రక్షణ

అందుకే హైకోర్టు, సుప్రీంలో ఎదురుదెబ్బలు

అయినా దోషులను అరెస్టు చేయని వైనం

బారాసాత్ ర్యాలీలో ప్రధాని మోదీ ధ్వజం

కోల్‌కతాలో నదీగర్భ మెట్రోకు శ్రీకారం

బారాసాత్, మార్చి 6: నారీశక్తితో బెంగాల్లోని మమతా బెనర్జీ సారథ్యంలోని పాలక టీఎంసీ పతనం ఖాయమని ప్రధాని మోదీ అన్నారు. నదీతీర ద్వీపం సందేశ్‌ఖాలీలో ఆ పార్టీ నేతల అఘాయిత్యాలు రాష్ట్రంలో, దేశంలో మహిళలను ఆగ్రహోదగ్రులను చేసిందని.. బెంగాల్‌వ్యాప్తంగా ఆవరించిన ఈ తుఫాన్ ధాటికి టీఎంసీ అంతరిస్తుందని స్పష్టం చేశారు. బుధవారం ఆయన కోల్‌కతాలో హుగ్లీ నదీగర్భంలో నిర్మించిన మెట్రో రైలును జెండా ఊపి

మిగతా 2వ పేజీలో...

పెళ్లయిన 5 రోజులకే

అనంత లోకాలకు..



14

పెళ్లి రిసెప్షన్‌లో వధూవరులు బాలకిరణ్, కావ్య, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వధూవరులు సహా ఐదుగురి దుర్మరణం

తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

కారులోని నవ దంపతులు, వరుడి తల్లిదండ్రులు, డ్రైవర్ మృతి

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఘోరం

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

గ్రో ఔట్ ఫామ్ పేరుతో రూ.కోటి స్వాహా

ప్రస్తుతం అక్కడున్నది ముళ్ల కంపలే

'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా' అన్నారు

గతంలో ఉన్న ఉత్పత్తినీ తగ్గించేశారు

కొత్త వంగడాల విత్తనాల ఉత్పత్తే లేదు

కార్పొరేషన్ ఎండీ, సర్టిఫికేషన్ పదవుల్లో తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న కేశవులు

ఈ కాలంలో 28 విదేశీ పర్యటనలు

ఇస్తాకాంగ్రెస్ నిర్వహణలోనూ గోల్‌మాల్!

ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఆర్థిక పనులు

ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో ఒకరి ఉద్యోగం

TSSDC

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీడ్ కార్పొరేషన్‌లో అవినీతి సిత్రాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గడిచిన తొమ్మిదేళ్లలో ఈ సంస్థలో లక్షల రూపాయలు హాంఫట్ అయ్యాయి. గ్రో ఔట్ ఫామ్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన చెరో రూ.50 లక్షలు.. మొత్తం రూ.కోటి హాంఫట్ అయినా పట్టించుకునే నాథుడు లేడు. అంతేకాదు.. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారుస్తామని గత ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...

కెఫేలో బాంబు సూత్రధారి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నజరానా

- ఎన్ఐఏ ప్రకటన


అనుమానితుడు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫేలో బాంబు పేలుడు సూత్రధారి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించింది. ఈ మేరకు బుధవారం అనుమానితుడి ఫొటోను ఎన్ఐఏ 'ఎక్స్'లో షేర్ చేసింది. సూత్రధారి గురించి తెలిపిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని పేర్కొంది. మార్చి 1న నగరంలోని రామేశ్వరం కెఫేలో టైమర్‌తో కూడిన బాంబు పేలుడులో 10 మంది గాయపడిన విషయం తెలిసిందే. 30-35 ఏళ్ల వ్యక్తి టిఫిన్‌కు టోకెన్ తీసుకుని వాష్‌బేసిన్ వద్ద బ్యాగును వదిలి వెళ్లిన కాసేపటికి పేలుడు సంభవించింది. కేసు నమోదు చేసిన ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈవీలతోనే ఎక్కువ కాలుష్యం..!

- 'ఎమిషన్ అనలిటిక్స్' తాజా అధ్యయనంలో గుర్తింపు

న్యూఢిల్లీ, మార్చి 6: ఇటీవల కాలంలో వాయు కాలుష్యంపై అందరికీ అవగాహన పెరుగుతోంది. పెట్రోల్, డీజిల్ వాహనాలు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని.. చాలామంది విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే.. పెట్రోల్, డీజిల్ వాహనాలకంటే ఎలక్ట్రిక్ వాహనాలే (ఈవీ) పర్యావరణానికి ఎక్కువ హాని చేస్తాయని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఉద్గారాల డేటాను విశ్లేషించే ఎమిషన్ అనలిటిక్స్ అనే సంస్థ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో.. ఈవీలలోని బ్రేకులు, టైర్లు 1850 రెట్లు ఎక్కువ కణ కాలుష్యాన్ని విడుదల చేస్తున్నట్టు తేలింది. ఎలక్ట్రిక్, శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాల బ్రేకులు, టైర్ల నుంచి ఉత్పత్తయ్యే కణ కాలుష్యం సమస్యపై చేసిన ఈ అధ్యయన వివరాలను వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ప్రచురించారు. శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాలతో పోలిస్తే.. ఎలక్ట్రిక్ వాహనాలు వాటి అధిక బరువు కారణంగా బ్రేకులు, టైర్ల నుంచి ఎక్కువ ధూళి కణాలను గాలిలోకి విడుదల చేయగలవని పరిశోధకులు కనుగొన్నారు. ఇది ఇతర వాహనాలతో పోలిస్తే 1850 రెట్లు అధికంగా ఉంటుందని పేర్కొన్నారు.

బెట్టింగ్, జూదాన్ని ప్రోత్సహించొద్దు: సీసీపీఏ

న్యూఢిల్లీ, మార్చి 6: బెట్టింగ్, జూదానికి సంబంధించి ప్రకటనలు పెరుగుతుండటంపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ(సీసీపీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి వాటిని ప్రోత్సహించవద్దని సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు బుధవారం హెచ్చరికలు జారీ చేసింది. వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రకారం వివిధ చట్టాల కింద నిషేధించిన ప్రకటనలు, ప్రచారం, చట్ట విరుద్ధ కార్యకలాపాలను నిషేధించాలని సూచించింది. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్-1867 ప్రకారం బెట్టింగ్, జూదం పూర్తిగా నిషిద్ధమని, దేశవ్యాప్తంగా మెజారిటీ ప్రాంతాల్లో వీటిని చట్టవిరుద్ధంగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌పై ప్రచారం చేయడం, ప్రకటనలో పాల్గొనడాన్ని చట్ట విరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొనడంతో సమానంగా పరిగణిస్తామని హెచ్చరించింది.

భారత్‌తో మరో ఒప్పందానికి మాల్దీవులు గుడ్‌బై

మాలె, మార్చి 6: హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించే విషయంలో భారత్‌తో ఒప్పందాన్ని పునరుద్ధరించబోమని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ప్రకటించారు. సొంతంగానే హైడ్రోగ్రాఫిక్ సర్వేలు చేపట్టేందుకు అవసరమైన యంత్రపరికరాలు, సౌకర్యాలు సమకూర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మాల్దీవుల ప్రత్యేక ఆర్థిక మండలి(ఈఈజడ్) ప్రాంతం చాలా విశాలంగా ఉన్నప్పటికీ దానిపై నియంత్రణ కోసం మాల్దీవుల జలాల్లో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఈనెలలో ఏర్పాటు చేసేందుకు తమ దేశం ప్రయత్నిస్తోందని ముయిజ్జు చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు చైనా నుంచి ఉచితంగా సైనిక సాయం పొందడానికి ఇరుదేశాల మధ్య రక్షణ ఒప్పందం కుదిరిన కొన్ని రోజులకే ముయిజ్జు ఈ ప్రకటన చేయడం గమనార్హం.

అమెరికా అధ్యక్ష రేసులోంచి నిక్కీ హేలి ఔట్!

వాషింగ్టన్, మార్చి 6: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో దిగేందుకు పోటీపడుతున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలి మంగళవారం జరిగిన 15 రాష్ట్రాల ప్రైమరీల్లో బాగా వెనుకబడ్డారు. దీంతో.. అధ్యక్ష అభ్యర్థిత్వం, ప్రచారం నుంచి వైదొలగుతున్నట్లు బుధవారం ప్రకటించారు. ఆదివారం కొలంబియాలో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ఆమె విజయం సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం 15 రాష్ట్రాల్లో ప్రైమరీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమె కేవలం వెర్మాంట్‌లో విజయం సాధించారు. మిగతా చోట్ల ట్రంప్ పైచేయి సాధించారు.

బహిరంగ సభల్లో మాటలు జాగ్రత్త

- రాహుల్ గాంధీని సూచించిన ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 6: బహిరంగ సభల్లో మాటలను చాలా జాగ్రత్తగా ఉపయోగించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఎన్నికల సంఘం సూచించింది. ప్రధాని మోదీని 'పనౌతి' (దుశ్శకునం), 'జేబ్ కత్రా' (జేబు దొంగ) అంటూ విమర్శించిన నేపథ్యంలో ఈ సూచన చేసింది. స్టార్ కాంపెయినర్లు, రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచార సభల్లో ఎలా మాట్లాడాలో సలహాలు ఇస్తూ ఈ నెల ఒకటో తేదీన ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది. వీటిని ఉల్లంఘిస్తే కేవలం మందలింపుతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గత ఏడాది నవంబరులో చేసిన ఈ వ్యాఖ్యలు సరైనవి కావంటూ ఆయనకు అంతకుముందు నోటీసు జారీ చేసింది కూడా. కాగా లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ తన సిటింగ్ స్థానమైన వయనాడ్‌తో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథి నుంచి కూడా మళ్లీ బరిలో నిలవబోతున్నారు. అలాగే ప్రియాంకా గాంధీ పార్టీకి కంచుకోట అయిన యూపీలోని రాయబరేలి నుంచి తొలిసారి పోటీకి దిగుతున్నారు. ఈ విషయాన్ని యూపీ కాంగ్రెస్ నేత ప్రదీప్ సింఘాల్ బుధవారం వెల్లడించారు.

టీకా వీరుడు!



- 217 సార్లు కొవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్న జర్మన్ వృద్ధుడు
- అయినా ఆయన రోగనిరోధక వ్యవస్థ భేష్: పరిశోధకులు

మ్యూనిక్, మార్చి 6: కరోనా భయంతో చాలా మంది రెండు డోసులు టీకా వేయించుకున్నారు! భయం ఎక్కువైనవారు మూడో డోసు టీకా కూడా తీసుకున్నారు! కానీ.. జర్మనీకి చెందిన 62 ఏళ్ల వృద్ధుడు 29 నెలల వ్యవధిలో ఏకంగా 217 సార్లు కరోనా టీకా వేయించుకున్నాడు. ఆయన గురించి స్థానిక పేపర్లలో వచ్చిన వార్తలను చూసి జర్మనీ, ఆస్ట్రియా పరిశోధకులు కొందరు ఆశ్చర్యపోయారు.అది నిజమో కాదో తెల్సుకునేందుకు దర్యాప్తు చేయగా.. 9 నెలల వ్యవధిలో ఆయన 130సార్లు వేయించుకున్నట్టు రికార్డుల్లో నమోదైంది. తాను నిజంగానే 217సార్లు వ్యక్తిగత కారణాలతో వ్యాక్సిన్ వేయించుకున్నానని ఆయన చెబుతున్నాడు. ఇన్నిసార్లు టీకా వేయించుకున్న ఆయన రోగనిరోధక వ్యవస్థపై పరిశోధకులు పరిశీలన చేశారు. ఆయన ఆరోగ్యం, రోగనిరోధక వ్యవస్థ భేషుగ్గా ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. ఆయన శరీరం కరోనా మహమ్మారికి మరింత మెరుగ్గా యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుండడం చూసి నివ్వెరపోయారు. ఎందుకంటే.. టీకా అంటే ఒక వైరస్‌లోని కొంతభాగాన్ని శరీరంలోకి పంపించి, రోగనిరోధక వ్యవస్థను అప్రమత్తం చేయడం. తద్వారా ఆ వైరస్ ఎప్పుడైనా మనకు సోకితే.. అప్పటికే దాన్ని గుర్తించి సిద్ధంగా ఉన్న మన ఇమ్యూనిటీ ఆ వైరస్‌పై దాడి చేసి చంపేస్తుంది. కానీ అదే టీకాను పదేపదే వేస్తే రోగనిరోధక వ్యవస్థలోని టి-సెల్స్ అలసిపోతాయి. ఫలితంగా.. నిజమైన వైరస్ మన శరీరంలోకి ప్రవేశించినప్పుడు దాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన 'ప్రో-ఇన్‌ఫ్లమేటరీ మెసెంజర్ సబ్‌స్టాన్సెస్'ను చాలా తక్కువగా ఉత్పత్తి చేస్తాయి. దీంతో వైరస్‌ను ఎదుర్కోలేక రోగనిరోధకవ్యవస్థ చేతులెత్తేస్తుంది. కానీ.. జర్మన్ వృద్ధుడి విషయంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోందని, మూడు డోసులు వేయించుకున్నవారి కంటే కూడా ఎక్కువగా ఆయన శరీరంలో కరోనాకు యాంటీబాడీలు ఉత్పత్తి అవుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. ఆయన్ను పరీక్షించే క్రమంలో వారే మరోసారి టీకా వేసి మరీ ఆయన శరీరంలో టి-సెల్స్ స్థాయిలను పరిశీలించగా.. ఆ టీకాలకు సదరు వృద్ధుడి శరీరం భేషుగ్గా స్పందిస్తున్నట్టు తేలింది.

లోకం తీరు



సందేశ్‌ఖాలీతో టీఎంసీ ఖాళీ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. అనంతరం బారాసాత్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మమత సర్కారు తీరుపై విరుచుకుపడ్డారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై అఘాయిత్యాలు సిగ్గుచేటన్నారు. అక్కడి మహిళలపై టీఎంసీ నేత షాజహాన్ షేక్, ఆయన అనుచరుల లైంగిక వేధింపులు, భూకబ్జాలను ప్రస్తావిస్తూ.. బాధిత మహిళల పక్షాన నిలవకుండా నేరగాళ్లకే మమత సర్కారు దన్నుగా ఉందని ధ్వజమెత్తారు. 'టీఎంసీ నేతలు పేద దళిత, గిరిజన మహిళలు, సోదరీమణులపై అత్యాచారాలు సాగిస్తున్నారు. ఇది చూసి బెంగాల్, భారత మహిళలు రగిలిపోతున్నారు. ఈ తుఫాను బెంగాల్ మొత్తం ఆవరించి టీఎంసీని భూస్థాపితం చేస్తుంది' అని హెచ్చరించారు. 'ఒకప్పుడు మహిళల సాధికారతకు బెంగాల్ దిక్సూచిగా నిలిచింది.. ఇప్పుడు టీఎంసీ పాలనలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. సందేశ్‌ఖాలీలో జరిగిన ఘటనలు సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. కానీ మహిళల దుఃఖం టీఎంసీ ప్రభుత్వానికి పట్టదు. పైగా నేరగాళ్లను కాపాడుతోంది. కోర్టులు జోక్యం చేసుకున్నా.. నిందితుల అరెస్టును అడ్డుకుంటోంది. అందుకే మొదట కలకత్తా హైకోర్టులో, తర్వాత సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బలు తగిలాయి' అని చెప్పారు. మహిళల రక్షణకు కేంద్రం హెల్ప్‌లైన్ ప్రారంభించిందని.. అత్యాచార నేరాలకు మరణశిక్ష విధించే సెక్షన్లు తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ హెల్ప్‌లైన్ బెంగాల్లో అమలు కాకుండా మమత సర్కారు అడ్డుకుందన్నారు. ప్రజలు విపక్ష 'ఇండియా' కూటమిని తిరస్కరించి బీజేపీకి ఓటువేయాలని పిలుపిచ్చారు. తనకు కుటుంబం లేదని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను మోదీ మరోసారి ప్రస్తావించారు. 140 కోట్ల మంది భారతీయులు తన కుటుంబమేన్నారు. 'ఎన్డీఏ వరుసగా మూడోసారి కూడా అధికారంలోకి రావడం ఖాయమని గ్రహించి.. నాపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. కుటుంబ రాజకీయాలు, బంధుప్రీతికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాననే దూషిస్తున్నారు' అని తెలిపారు. బెంగాల్ అభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని.. కోల్‌కతా మెట్రో ప్రారంభోత్సవమే దీనికి నిదర్శనమని తెలిపారు.


మెట్రో రైలు ప్రారంభోత్సవం అనంతరం అందులో ప్రయాణిస్తున్న మోదీ

బాధిత మహిళలతో భేటీ

బారాసాత్ పరిధిలోని సందేశ్‌ఖాలీలో షాజహాన్, ఆయన అనుచరుల దురాగతాలకు బలైన ఐదుగురు బాధిత మహిళలతో మోదీ భేటీ అయ్యారు. వారిని దుర్గామాతలుగా అభివర్ణించారు. వారికి న్యాయం జరిగేలా చేస్తామని, రక్షణ కల్పిస్తామని హామీఇచ్చారు. కాగా.. సందేశ్‌ఖాలీ నుంచి ప్రధాని సభకు వందల సంఖ్యలో మహిళలు బస్సుల్లో తరలివచ్చారు. అయితే భద్రతా ప్రొటోకాల్ పేరుతో పోలీసులు వారిని పలుచోట్ల అడ్డుకున్నారు. దీనిపై బీజేపీ నేతలతో కలిసి బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసుల ఆటంకాలతో ఆలస్యంగా సభాస్థలికి చేరుకున్నారు. ఈ కారణంగా సభ ముగిశాక పై ఐదుగురు బాధిత మహిళలతో మోదీ భేటీ అయ్యారు. ఆయన పాదాలకు వారు నమస్కరించారు. 'మా బాధలను ఓ తండ్రిలా ఆయన ఓపిగ్గా విన్నారు. మాపై అఘాయిత్యాలకు పాల్పడినవారి పేర్లు ఆయనకు చెప్పాం. ఆందోళన చెందవద్దని.. నేరగాళ్లపై మా పోరాటాన్ని గౌరవిస్తున్నానని చెప్పారు. రాష్ట్ర యంత్రాంగంపై మాకు విశ్వాసం లేదని.. కేంద్రం త్వరగా మాకు న్యాయం చేయాలని అభ్యర్థించాం' అని ఓ మహిళ మీడియాకు తెలిపారు.

దేశంలోనే తొలి నదీగర్భ మెట్రో

దేశంలోనే తొలి నదీగర్భ సొరంగ మెట్రోరైలు మార్గాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. కోల్‌కతాలో హుగ్లీ నది అడుగున నిర్మించిన మెట్రో రైలు మార్గాన్ని బుధవారం ప్రారంభించిన ఆయన.. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి ఎస్ప్లనడే నుంచి హౌరా వరకు.. తిరిగి అక్కడి నుంచి ఎస్ప్లనడేకు మెట్రో రైలులో ప్రయాణించారు. సీఎం మమత ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. తూర్పు-పశ్చిమ కారిడార్‌లో భాగంగా 4.8 కిలోమీటర్ల పొడవున ఈ రైలు సొరంగ మార్గాన్ని రూ.4,960 కోట్లతో నిర్మించినట్టు అధికారులు తెలిపారు. ఈ మెట్రో కారిడార్ పనులను 2009లో ప్రారంభించారు. ఈ రైలు మార్గం మొత్తం పొడవు 16.6 కిలోమీటర్లు. అందులో సుమారు 10.8 కిలోమీటర్లు భూగర్భంలోనే ఉంటుంది. దేశంలోనే అత్యంత లోతైన మెట్రోస్టేషన్ కూడా దీనిలోనే ఉంది. భూవికి సుమారు 32 మీటర్ల అడుగున హౌరా మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. తొలి 2 కిలోమీటర్ల దూరానికి రూ.5 చార్జీగా నిర్ణయించారు. గరిష్ఠ చార్జీ రూ.50. కాగా.. ఎస్ప్లనడే మెట్రో స్టేషన్ నుంచి బెంగాల్‌లోని మరికొన్ని రైల్వే ప్రాజెక్టులను, దేశంలోని వివిధ నగరాల్లోని మెట్రో ప్రాజెక్టులను కూడా ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులన్నిటి విలువ సుమారు రూ.15,400 కోట్లు..

ఇస్రో.. టార్గెట్ 25

- చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలు
- వ్యోమగామిని పంపడమే లక్ష్యం
- ఇస్రో చైర్మన్ సోమనాథ్

విజయవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష ప్రయోగ సంస్థ (ఇస్రో) చేపట్టాల్సిన ప్రయోగాలకు సంబంధించి 25 ఏళ్ల కాలానికి దార్శనిక పత్రాన్ని రూపొందించామని ఆ సంస్థ చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలు చేయాలని, జాబిల్లిపైకి భారత వ్యోమగామిని పంపాలని ఈ పత్రంలో పొందుపరిచామని చెప్పారు. దీంతో పాటు శుక్రుడు, అంగారకుడుపై కూడా ప్రయోగాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం జరిగిన డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవంలో సోమనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టర్ పిన్నమనేని, సీతాదేవి ఫౌండేషన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయం వెనుక కొన్ని తరాల కృషి ఉందని.. ఆ ఫలితాన్ని తాము అనుభవిస్తున్నామని వెల్లడించారు. ఇస్రోలో అనేక మంది గొప్ప శాస్త్రవేత్తలు పనిచేశారని, వాళ్లే తనకు గురువులు, మార్గదర్శకులు అని చెప్పారు. ఇస్రోలో తాను తొలుత ఎస్ఎల్వీ, ఆ తర్వాత పీఎస్ఎల్వీ, ఎల్ఎస్ఎం ప్రాజెక్టుల్లో పనిచేశానని, ఈ మూడు ప్రాజెక్టుల్లో కలిగిన అవగాహన, స్ఫూర్తి, కృషి చంద్రయాన్-3 విజయవంతం కావడానికి కారణమయ్యాయని చెప్పారు.చంద్రుడిపై నీటి జాడలను ప్రపంచంలో తొలిసారిగా కనుగొన్నది మనమేనని స్పష్టం చేశారు. తాను ఎల్వీఎం-3 ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్నప్పుడు రాకెట్‌ను డిజైన్ చేశానని చెప్పారు.

గొంతెండుతున్న బెంగళూరు

రిజర్వాయర్లలో అడుగంటిన నీరు.. అధిక ధర వసూలు చేస్తున్న ట్యాంకర్ల నిర్వాహకులు

- వాహనాలు కడగడం, స్విమ్మింగ్ పూల్ కార్యకలాపాలపై నిషేధం
- డిస్పోజబుల్ ప్లేట్లు వినియోగానికి సూచన
- మా ఇంటి బోర్‌వెల్ కూడా ఎండిపోయింది: డీకే



బెంగళూరు, మార్చి 6: కర్ణాటక రాజధాని బెంగళూరులో నీటి కొరత తీవ్రస్థాయికి చేరింది. రిజర్వాయర్లలో నీరు అడుగంటడమే దీనికి కారణం. బోర్‌వెల్‌లు కూడా ఎండిపోతున్నాయి. మరోవైపు నీటి ట్యాంకర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా ఉన్న నివాసితుల సంక్షేమ సంఘాలు వాహనాలను కడగడంపైనా, స్విమ్మింగ్‌పూల్ కార్యకలాపాలపైనా పూర్తిస్థాయి నిషేధం విధించాయి. చేతులు, ముఖం శుభ్రం చేసుకోడానికి డిస్పోజబుల్ వస్తువులు, తడి గుడ్డలు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని దక్షిణ బెంగళూరులోని ఒక ప్రముఖ అపార్ట్‌మెంట్‌లోని నివాసితుల సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. వాటర్ ట్యాంకర్లపై ఆర్టీవో, బీడబ్ల్యూఎస్ఎస్‌బీ(బెంగళూరు నీటి సరఫరా-సీవేజ్ బోర్డు) దాడులు నిర్వహించిన అనంతరం నీటి సరఫరాలో ఏర్పడిన అవాంతరాల గురించి అపార్ట్‌మెంట్లలోని నివాసితుల సంక్షేమసంఘాలు కొద్ది రోజుల క్రితమే నివాసితులకు తెలియజేశాయి. పరిస్థితి దిగజారడంతో నీటి వృథాను నివారించేందుకు డిస్పోజబుల్ ప్లేట్లు, ఐటమ్స్ వినియోగాన్ని పరిశీలించాలని నివాసితులకు సూచించామని ప్రెస్టీజ్ ఫాల్కన్ సిటీ(పీఎఫ్‌సీ) అపార్ట్‌మెంట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వసంత్ కుమార్ తెలిపారు. నీటి వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకే ఈ ఆలోచన చేశామన్నారు. నీళ్ల ట్యాంకర్లకూ కొరత ఏర్పడినందున ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని ఒక నివాసితుల సంక్షేమ సంఘం నీటి దుర్వినియోగాన్ని నివారించేందుకు భద్రతా సిబ్బందిని కూడా నియమించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గత కొన్ని రోజులుగా బీడబ్ల్యూఎస్ఎస్‌బీ నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు చేతిపంపులపై ఆధారపడుతున్నారు. చేతిపంపుల్లోనూ నీరు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించని కుటుంబాల నుంచి అదనంగా రూ.5 వేలు వసూలు చేస్తామని ఓ ప్రాంతంలోని నివాసితుల సంక్షేమ సంఘం హెచ్చరించింది. బెంగళూరులోని అనేక ప్రాంతాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, తన ఇంటి వద్ద ఉన్న బోర్‌వెల్ కూడా ఎండిపోయిందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేకదాటు రిజర్వాయర్ ప్రాజెక్టుకు ఇప్పటికైనా కేంద్రం ఆమోదం తెలపాలని కోరారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బెంగళూరుకు తగినంత నీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. 'కొన్ని నీళ్ల ట్యాంకర్ల నిర్వాహకులు రూ.600 వసూలు చేస్తుండగా, మరికొన్ని ట్యాంకర్ల నిర్వాహకులు రూ.3,000 వసూలు చేస్తున్నారు. అందుకే ధరను ప్రామాణీకరించేందుకు ట్యాంకర్ల నిర్వాహకులంతా అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఆదేశించాం. ట్యాంకర్లు ప్రయాణించిన దూరాన్ని బట్టి అధికారులే ధర నిర్ణయిస్తారు' అని డీకే తెలిపారు. రామనగర, హోసకోట, చెన్నపట్న, మగది తదితర పట్టణాల నుంచి ట్యాంకర్ల ద్వారా బెంగళూరుకు నీటిని తరలించాలని నిర్ణయించామన్నారు.

భారతదేశం కళలకు పుట్టినిల్లు

సంగీత నాటక అకాడమీ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి


రాష్ట్రపతి ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రాజారెడ్డి, చిత్రంలో రాధారెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 6 (ఫిబ్రవరి): భారతదేశం కళలకు పుట్టినిల్లు అని, కళలు సామాజిక ప్రయోజనానికి ఎంతో దోహదపడతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆమె 2022, 23 సంవత్సరాలకు సంబంధించి సంగీత నాటక అకాడమీ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాలుగా కళలను ప్రోత్సహిస్తున్న అకాడమీని ఆమె అభినందించారు. కళాకారులు కళలతో ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. తెలంగాణకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు రాధా రెడ్డి- రాజారెడ్డి దంపతులకు ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌ను ముర్ము అందజేశారు. ఈఫెలోషిప్‌లో భాగంగా వారికి రూ.3 లక్షల నగదు పురస్కారం అందజేశారు. సంగీతం, నృత్యం, రంగస్థలం, సంప్రదాయ, జానపద, గిరిజన సంగీత, నృత్య కళల్లో మొత్తం 92 మందికి సంగీత నాటక అకాడమీ అవార్డులు వచ్చాయి. మరో 80 మంది యువకళాకారులకు 2022, 23 సంవత్సరాలకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలు దక్కాయి.

రూ.108 కోట్ల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం

- నాటు పడవలో శ్రీలంకకు తరలించే యత్నం.. ముగ్గురి అరెస్టు

చెన్నై, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాటుపడవలో శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న రూ.108 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను కేంద్ర రెవెన్యూ దర్యాప్తు విభాగం, సముద్రతీర భద్రతాదళం సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సంఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. రామేశ్వరం సమీపం ధనుష్కోడి వద్ద మాదక ద్రవ్యాలు స్మగ్లింగ్ అవుతున్నట్లు రహస్య సమాచారం అందటంతో కేంద్ర రెవెన్యూ దర్యాప్తు విభాగం అధికారులు, కోస్ట్‌గార్డ్ అధికారులు కోస్ట్‌గార్డ్ గస్తీ నౌకలో వెళ్లి నడి సముద్రంలో వేగంగా వెళుతున్న నాటుపడవను చుట్టుముట్టారు. ఆ పడవలో తనిఖీ జరిపి మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. పడవలో ప్రయాణిస్తున్న రాబిన్‌సన్ (32) సహా మరో ఇద్దరిని అరెస్టు చేశారు.

బీజేపీ పిలుపు.. నేడు ఢిల్లీకి బాబు

- ఒకట్రెండు రోజుల్లోనే సీట్ల సర్దుబాటు ఖరారు
- పవన్‌కూ అందిన పిలుపు!

అమరావతి/న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ.. బీజేపీ మధ్య పొత్తు పొడిచింది. టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరనుంది. సీట్ల సర్దుబాటుపై చర్చించే నిమిత్తం టీడీపీ అధినేత చంద్రబాబును గురువారం ఢిల్లీ రావాలని బీజేపీ కేంద్ర నాయకత్వం ఆహ్వానించింది. ఢిల్లీ వర్గాలు బుధవారం ఆయనకు ఫోన్ చేసి రావాలని కోరినట్లు సమాచారం. గురువారం ఆయన ఢిల్లీ వెళ్తున్నట్లు టీడీపీ వర్గాలు ధ్రువీకరించాయి. బీజేపీ పెద్దల పిలుపుతో ఆయన హస్తిన వెళ్లడం గత నెల రోజుల్లో ఇది రెండోసారి. గత నెల 7న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆహ్వానంతో ఆయన ఢిల్లీ వెళ్లారు. ఎన్డీయేలో చేరాలని షా కోరడంతో ఆయన అంగీకరించారు. కానీ దీనిపై అధికారిక ప్రకటన చేయకుండా రెండు పార్టీలు గుంభనంగా వ్యవహరించాయి. ఇప్పుడు సీట్ల సర్దుబాటు కుదిరిన తర్వాత ప్రకటిస్తారని అంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తున్న చంద్రబాబు.. రాత్రి బీజేపీ అగ్ర నేతలతో మంతనాలు జరుపుతారు. అవసరమైతే శుక్రవారం కూడా అక్కడే ఉండే అవకాశం ఉంది. ఒకట్రెండు రోజుల్లో రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు పూర్తవుతుందని అంటున్నారు. ఈ భేటీకి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కూడా బీజేపీ పెద్దలు ఆహ్వానించినట్లు తెలిసింది. అయితే ఆయన వెళ్లడం లేదని.. సీట్ల సర్దుబాటు టీడీపీ, బీజేపీ మధ్యే జరగాల్సి ఉండడంతో ఇప్పుడక్కడ తన అవసరం లేదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.

5 లోక్‌సభ, 13 అసెంబ్లీ సీట్లు అడుగుతున్న బీజేపీ?

పొత్తులో భాగంగా బీజేపీకి ఎన్ని సీట్లు లభిస్తాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. గత ఎన్నికల్లో ఆంధ్రలో ఆ పార్టీకి ఒక శాతంలోపే ఓట్లు లభించాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ బలానికి మించి సీట్లు ఇస్తే.. తర్వాత గెలవలేకపోతే మధ్యలో వైసీపీ లాభపడుతుందని టీడీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా బీజేపీకి టీడీపీ 13 అసెంబ్లీ సీట్లు ఇవ్వగా.. ఆ పార్టీ అభ్యర్థులు నాలుగు చోట్లే గెలవగలిగారు. ఈసారి విజయావకాశాలు కలిగిన అభ్యర్థులు ఉన్నచోటే బీజేపీకి సీట్లు ఇవ్వాలని టీడీపీ యోచిస్తోంది. బీజేపీ కోరుతున్న సీట్లలో ఆ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలపై టీడీపీ నాయకత్వం సర్వే కూడా చేయించింది. ఆ ఫలితాలు కొందరికి అనుకూలంగా, ఇంకొందరికి ప్రతికూలంగా వచ్చాయి. 3 అసెంబ్లీ సీట్లు, 3 లోక్‌సభ సీట్లు బీజేపీకివ్వాలని కొందరు టీడీపీ ముఖ్య నేతలు చంద్రబాబు వద్ద ప్రతిపాదించారు. వారు ప్రతిపాదించిన లోక్‌సభ స్థానాల్లో నరసాపురం, తిరుపతి (ఎస్సీ), అరకు (ఎస్టీ) ఉన్నాయి. అయితే బీజేపీ నాయకులు ఐదు లోక్‌సభ సీట్లు.. నరసాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు, రాజంపేట, తిరుపతి కోరుతున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల్లో ఐదు ఎంపీ సీట్లు ఉంటే అందులో నాలుగు పొత్తులో బీజేపీకి, జనసేన (కాకినాడ)కు వెళ్తాయని, తమకు ఒకటి (అమలాపురం-ఎస్సీ) మాత్రమే దక్కుతుందని.. ఇది తమకు అంగీకారం కాదని టీడీపీ నాయకుడొకరు స్పష్టం చేశారు. రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలో ముస్లింల సంఖ్యాబలం బాగా అధికమని.. అక్కడ బీజేపీకి విజయావకాశాలు తక్కువని.. పైగా తమ అసెంబ్లీ అభ్యర్థులకు కూడా ఇబ్బంది అని రాయలసీమ టీడీపీ నేతలు వాదిస్తున్నారు. అలాగే బీజేపీకి ఐదు అసెంబ్లీ సీట్లు ఇవ్వొచ్చని వినవస్తోంది. అయితే ఆ పార్టీ 11 అసెంబ్లీ స్థానాలు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఆయా సీట్లు ఆశిస్తున్న బీజేపీ నేతలు పొత్తు దిశగా తమ అధినాయకత్వం వద్ద గట్టి లాబీయింగ్ చేస్తున్నారు. తమ వాదనకు అనుకూలంగా కొన్ని నివేదికలు కూడా సమర్పించారు. దీంతో సీట్ల పంపిణీ ఎలా ఉంటుందన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇక సీట్ల సర్దుబాటు ఖరారయ్యాక ఢిల్లీ పెద్దలు ఎన్డీయేలో టీడీపీ చేరికను లాంఛనంగా ప్రకటిస్తారని తెలుస్తోంది. జనసేన ఇప్పటికే అందులో భాగస్వామిగా ఉంది.

ఏపీ బీజేపీ నేతలతో ఢిల్లీ పెద్దల చర్చలు

టీడీపీతో పొత్తుపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం ఢిల్లీలో రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో బీజేపీ పోటీ చేసే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలపై గురువారం చంద్రబాబుతో జరిపే చర్చల్లో అవగాహనకు వస్తే.. శుక్ర, శనివారాల్లో జరిగే బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో పొత్తుతో పాటు అభ్యర్థులను కూడా ఖరారు చేసే అవకాశముందని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇటీవల పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌జీ సమక్షంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పొత్తుపై చర్చించి వేర్వేరు ప్రతిపాదనలు సమర్పించగా.. బుధవారం వాటిపై షా, నడ్డా చర్చలు జరిపినట్లు తెలిసింది.

మైలవరం వసంతకే!

- దేవినేని ఉమతో అచ్చెన్న చర్చలు
- పి.గన్నవరంలో పోటీ నుంచి వైదొలగిన మహాసేన రాజేశ్

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం టీడీపీ టికెట్ వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కే ఖరారైంది. ఆయన కొద్ది రోజుల కిందట వైసీపీకి రాజీనామా చేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన్ను అక్కడే అభ్యర్థిగా నిలపాలని నాయకత్వం నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న దేవినేని ఉమాతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ఇక్కడ కేంద్ర కార్యాలయంలో చర్చించారు. 'సర్వేల ఆధారంగా ఈ నిర్ణయం జరిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న ఈ నిర్ణయానికి సహకరించాలని పార్టీ అధినేత తరఫున కోరుతున్నాం' అని చెప్పారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని దేవినేని ఆయనతో అన్నారు. ప్రత్యామ్నాయంగా పెనమలూరు సీటును ఆయన ఆశిస్తున్నారు. దానిపై ఇంకా నిర్ణయం జరగలేదు. కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం సీటుకు దళిత నేత మహాసేన రాజేశ్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో పోటీ నుంచి వైదొలగాలని ఆయన నిర్ణయించుకున్నారు. దీంతో చంద్రబాబు అక్కడి పరిస్థితులపై రాజేశ్‌తో, పార్టీ నేతలతో చర్చించారు. కీలకమైన ఎన్నికల సమయంలో తన వల్ల పార్టీ ఆత్మరక్షణలో పడడం సరికాదని, తానే వైదొలగాలని భావిస్తున్నానని రాజేశ్ ఆయనతో చెప్పారు. ఆయనకు ఎదురైన సమస్యపై చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయనకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.

మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం స్థానిక కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గురువారం విచారణ జరపనున్నారు.

రేవంత్ పాలనలో ఏముంది?

బీజేపీకి ప్రేమలేఖలు రాయడం తప్ప ఏం చేశారు?



- ఏం చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలి?
- మోదీ ఆశీర్వాదం కోసమే రేవంత్ తాపత్రయం
- మళ్లీ మోదీయే ప్రధాని అని చెప్పకనే చెప్పారు
- మా ఎంపీలను బీజేపీ లాగేసుకుంటోంది
- ప్రజాపాలనలో జర్నలిస్టులకు స్వేచ్ఛ ఏదీ?: హరీశ్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలో వైట్ పేపర్, బ్లాక్ పేపర్ అంటూ బీజేపీకి ప్రేమలేఖలు రాయడం తప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఆశీర్వాదం కన్నా.. మోదీ ఆశీర్వాదం కోసం రేవంత్ తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యే అవకాశమే ఉంటే రేవంత్‌రెడ్డి.. మోదీని ఎందుకు పొగుడుతున్నారని ప్రశ్నించారు. మోదీ మళ్లీ ప్రధాని అవుతారని రేవంత్ వ్యాఖ్యల ద్వారా తెలుస్తోందని, దేశంలో కాంగ్రెస్ పార్టీ గెలవదని ఆయన చెప్పకనే చెప్పారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. గుజరాత్ మోడల్ అంటే అణిచివేత, ఫెయిల్యూర్ అని ఓవైపు రాహుల్‌గాంధీ అంటుంటే.. మరోవైపు గుజరాత్ మోడల్ కావాలని రేవంత్‌రెడ్డి అంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలనే కాకుండా.. రాహుల్‌గాంధీని కూడా రేవంత్‌రెడ్డి మోసం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. డిసెంబరు 9న రైతు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారని, కనీసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా జరపలేదని ధ్వజమెత్తారు. రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున ఇస్తామన్న బోనస్‌ను ఈ యాసంగికైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీల్లో 13 హామీలు..

రాష్ట్రంలో 60 వేలకు పైగా సీఎంఆర్ఎఫ్ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. రూ.4 వేల పింఛన్ హామీ నెరవేర్చక పోగా, రూ.2 వేలు కూడా నెలనెలా ఇవ్వడం లేదన్నారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలు ఉన్నాయని, అవన్నీ అమలయ్యేది ఎప్పుడని, మహిళలను మహాలక్ష్మలను చేసేది ఎప్పుడని ప్రశ్నించారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పి.. ఇప్పుడు రక్తం పిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టడంతోనే రాష్ట్రంలో కరువొచ్చిందని, ట్యాంకర్ల ద్వారా వరి పంటకు నీళ్లు పోయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్‌కు ఆరోగ్యం బాగాలేదన్న విషయం తెలిసి కూడా రేవంత్‌రెడ్డి ప్రతిపక్షనేత లేరంటూ వ్యాఖ్యానిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం స్థాయి వ్యక్తికి ఇది తగదన్నారు. సరైన సమయంలో కేసీఆర్ సమాధానం చెబుతారని తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీలను బీజేపీ లాగేసుకొంటోందని, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తమను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీతో కలిసి పనిచేసే ఆలోచన తమకు లేదన్నారు.

ప్రజాపాలనలో జర్నలిస్టులకు స్వేచ్ఛ ఏదీ?

కాంగ్రెస్ నేతలు చెప్పుకొంటున్న ప్రజాపాలనలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని హరీశ్‌రావు అన్నారు. సీఎం కార్యాలయానికి వెళ్లే విలేకరుల పెన్నులు, ఫోన్లు గుంజుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇది నిరంకుశత్వం కాదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో జర్నలిస్టులు సచివాలయంలో అన్ని ఫ్లోర్లలో స్వేచ్ఛగా తిరిగేవారని, ప్రస్తుతం స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. గతంలో నిధుల దుర్వినియోగమని చెప్పినవారే ఇప్పుడు ఆరుగురు పీఆర్వోలను ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు.



రేవంత్‌ను చరిత్ర క్షమించదు

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని.. మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు : కేటీఆర్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఘాటైన విమర్శలు చేశారు. తెలంగాణ సోయి లేని, గౌరవం అంతకన్నా లేని వ్యక్తి సీఎం కావడం రాష్ట్ర ప్రజల ఖర్మ అని అన్నారు. మోదీ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసిన రేవంత్‌ను చరిత్ర ఎన్నటికీ క్షమించదని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. "తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నేడు పాతాళంలో పాతిపెట్టేస్తోంది. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని పాలించడం మన దౌర్భాగ్యం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. గోల్‌మాల్ గుజరాత్ మోడల్‌కు, బంగారు తెలంగాణ మోడల్‌తో పోలిక ఎక్కడిదన్నారు. గంగా జమునా తెహజీబ్ మోడల్ కన్నా.. మతం పేరిట చిచ్చు పెట్టే గోద్రా అల్లర్ల మోడల్ ఎలా నచ్చిందని ప్రశ్నించారు. "నిన్నటి దాకా గుజరాత్ మోడల్‌పై నిప్పులు! ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే గొప్పనా? ఇదేం నీతి? ఇదేం రీతి? పలు రాష్ట్రాలు మెచ్చిన, యావత్ దేశానికే నచ్చిన తెలంగాణ నమూనాను నమో ముందు కించపరుస్తావా? నమ్మి ఓటేసిన వారిపై ఎందుకీ నయవంచన? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా? నాడు ఉద్యమకారులపై రైఫిల్ ఎత్తావ్. ఇప్పుడు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే తెలంగాణ ఊరుకోదు" అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాగా, ప్రతిపక్ష నేత లేరంటూ.. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద అన్నారు. "సమయం వచ్చినప్పుడు మా నేత తప్పకుండా వస్తారు. కేసీఆర్ వచ్చారంటే.. నువ్ కుర్చీలోనుంచి ఎగిరిపోతావ్" అని వ్యాఖ్యానించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో వివేకానంద మీడియాతో మాట్లాడారు. సీఎం కుర్చీ కాపాడుకునే ప్రయత్నం తప్ప.. ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టడంలేదన్నారు.



నల్లగొండ ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ధర్నాలు

- పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని డిమాండ్
- జిల్లా కేంద్రాల్లో, మున్సిపల్ ఆఫీసుల ఎదుట ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళనలు చేపట్టింది. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపల్, తహసిల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించింది. అనంతరం అధికారులను వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా అమలు చేసే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బల్దియా కేంద్ర కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తూ.. దరఖాస్తుదారులు రుసుము చెల్లించవద్దని.. తాము అధికారంలోకి వచ్చాక ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాట మార్చి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో 25 లక్షల కుటుంబాలపై ఆర్థికభారం మోపి రూ.20 వేల కోట్ల దోపిడీకి యత్నిస్తోందని విమర్శించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలిపి, బైఠాయించాయి. నిజామాబాద్ జిల్లా బాల్కొండలో నిర్వహించిన ధర్నాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాల్లో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాల కిషన్, సుంకె రవి శంకర్ పాల్గొన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు నిర్వహించాయి.

బీఆర్ఎస్ నిరసన.. పసుపు నీటితో కాంగ్రెస్ శుద్ధి

హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించాయి. ఉచిత ఎల్ఆర్ఎస్ హామీని అధికార పార్టీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. ఆ తర్వాత ప్రభుత్వంలో ఉన్నప్పుడు పథకాన్ని ప్రకటించి రూ.వేల కోట్లు కాజేసిన బీఆర్ఎస్ నిరసనతో బల్దియా ప్రాంగణం అపవిత్రమైందంటూ పసుపు నీళ్లతో కాంగ్రెస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారు.

'టానిక్'లో మూడో రోజు సోదాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36లోని 'టానిక్ ఎ-4 ఎలైట్ వైన్ షాపులో మూడో రోజు(బుధవారం) కూడా జీఎస్టీ అధికారుల సోదాలు కొనసాగాయి. దీనికి అనుబంధంగా ఉన్న మరో 11 'క్యూ బై టానిక్' వైన్ షాపుల్లోనూ తనిఖీలు జరిగాయి. అధికారులు ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన మద్యం రేట్ల కంటే ఎక్కువ ధరకు మద్యాన్ని విక్రయిస్తున్నారా? ఎమ్మార్పీ ఉల్లంఘనలున్నాయా? అనే దానిపై దృష్టి సారించారు. వ్యాట్ చెల్లించిన మద్యాన్ని విక్రయిస్తున్నారా? లేక వ్యాట్ లేని మద్యాన్ని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకున్నారా? అని పరిశీలించారు. టానిక్ నుంచి అనుబంధ షాపులకు ఎంత మేర మద్యాన్ని తరలించారు? దాని విలువ ఎంత? తదితర వివరాలను సేకరించినట్లు తెలిసింది.

అరెస్టు చేసేందుకు వెళ్తే.. హైడ్రామా!

- భూఆక్రమణ కేసులో భూపాలపల్లి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్
- అరెస్టు చేసేందుకు ఇంటికి పోలీసులు
- తలుపులు లాక్ చేసుకున్న హరిబాబు..
- బీఆర్ఎస్ కార్యకర్తల రాకతో కళ్లుగప్పి అజ్ఞాతంలోకి..


పోలీసుల కళ్లు గప్పి బైక్‌పై వెళ్తున్న హరిబాబు

భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూఆక్రమణ కేసులో భూపాలపల్లి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును అరెస్టు చేయడానికి పోలీసులు చేసిన ప్రయత్నం హైడ్రామాకు తెరలేపింది. బీఆర్ఎస్‌కు చెందిన ఆయన మంజూర్‌నగర్‌లోని చెరువును ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టారని రామలింగమూర్తి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. అయితే హరిబాబు అందుబాటులో లేకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ అయింది. గురువారం కొత్తగా మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో హరిబాబు రెడ్డికాలనీలోని తన ఇంటికి చేరుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు.. ఆయన్ను అరెస్టు చేయడానికి బుధవారం తెల్లవారుజామునే అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన ఆయన లోపలి నుంచి తలుపులకు గడియ పెట్టుకొని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే హరిబాబు ఓ వీడియోను విడుదల చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో కోరం లేకుండా చేయడానికే తనపై తప్పుడు కేసులు బనాయించి కాంగ్రెస్ నేతలు పోలీసులతో అరెస్టు చేయించే యత్నాలు చేస్తున్నారని అందులో ఆరోపించారు. హరిబాబు వీడియోను చూసిన ఆయన అనుచరులు, కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు కాస్త వెనక్కి తగ్గారు. ఇదే అదనుగా భావించిన హరిబాబు మధ్యాహ్నం పోలీసుల కళ్లు గప్పి తన అనుచరుడి బైక్‌పై వెనక కూర్చొని భూపాలపల్లి నుంచి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్తారు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



యాదాద్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక్కరేనని, అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రులను ఎదుర్కొనే సత్తా లేకనే శాసనసభ సమావేశాలకు గైర్హాజరవుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మాదిరిగా తాము ఎమ్మెల్యేలను చేర్చుకోవాలనుకుంటే ఆ పార్టీలో నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారన్నారు. భువనగిరిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పూర్తిగా దిగజారిపోయిందని, ఆ పార్టీకి చెందిన ముగ్గురు సిటింగ్ ఎంపీలు బీజేపీలో చేరారని, ఎన్నికల అనంతరం హరీశ్‌రావు కూడా బీజేపీలోకి చేరేందుకు సంప్రదింపులు జరపుతున్నారని తెలిపారు. బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాళ్లు పట్టుకునే పరిస్థితికి బీఆర్ఎస్ దిగజారిందని విమర్శించారు. కృష్ణా జలాలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణంలో అవినీతిపైనా విచారణ జరిపిస్తామన్నారు. రాహుల్‌గాంధీ నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి పోటీ చేసినా వారణాసిలో మోదీ కంటే అధిక మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. రాయిగిరి వద్ద రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ విషయంలో సమీక్షించి రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాకిస్థాన్‌లో మారని దృశ్యం

ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు నెలరోజులకు పాకిస్థాన్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వాన్ని చూసినవారికి ఇంతకీ అక్కడ ఏం మారిందన్న అనుమానం కలిగేవుంటుంది. గతంలో ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెదించేసి, ఎన్నికలు జరిగేంతవరకూ దేశాన్ని ఏడాదిన్నరపాటు ఏలినవారే ఇప్పుడు మళ్ళీ అధికారంలోకి వచ్చి కూర్చున్నారు. నవాజ్‌షరీఫ్ పార్టీ, భుట్టోల పార్టీ రోజుల తరబడి చర్చోప చర్చలు జరిపి, ఎట్టకేలకు ఒక అవగాహనకు రావడంతో అధికశాతం ప్రజలు కోరుకున్న ఇమ్రాన్ ఖాన్ పార్టీని అధికారానికి దూరం పెట్టడంలో సైన్యం పైచేయి సాధించింది. గతంలో తాను ప్రతిష్ఠించిన ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వచ్చినందున ఇకమీదట కూడా తెరవెనుకనుంచి సైన్యమే చక్రం తిప్పుతుందని అర్థం.

ప్రధాని కావాలనుకున్న నవాజ్ షరీఫ్ మళ్ళీ తన సోదరుడినే అధికారంలో కూచోబెట్టి తాను పక్కకు తప్పుకున్నారు. కేంద్రంలో ఈ రెండుపార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, పంజాబ్‌కు నవాజ్ షరీఫ్ కుమార్తె ముఖ్యమంత్రి, సింధ్‌లో పీపీపీ, ఇమ్రాన్‌ఖాన్ పార్టీనుంచి స్వతంత్రులుగా గెలిచివచ్చినవారు ఖైబర్‌పఖ్తుంక్వా ప్రావిన్సులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇమ్రాన్ సన్నిహితుడి స్థానంలో బెనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్షుడు కాబోతూండటం, ఇమ్రాన్ విషయంలో సానుకూలంగా ఉండే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిటైర్‌కావడం వంటివి అధికారపక్షానికి, సైన్యానికి శుభ పరిణామాలు. అధికారంనుంచి దించడం, మళ్ళీ రాకుండా అడ్డుకోవడమన్న లక్ష్యాలు నెరవేరినంత మాత్రాన ఇమ్రాన్ విషయంలో సైన్యం ఇకముందు ఉదాసీనంగా వ్యవహరించే అవకాశమైతే లేదు. సైన్యం మీద ఆయన చేసిన పోరాటం అసామాన్యమైనది. దాని మద్దతు లేకుండా రాజకీయక్షేత్రంలో నెగ్గుకు రావడం కష్టమన్న భావనను ఆయన తుడిపేశారు. ప్రజల్లో సైన్యం పరువు ప్రతిష్ఠలను దిగజార్చారు. ఎన్నికల ప్రక్రియ యావత్తూ ఎంత లోపభూయిష్టంగా జరిగినా, ఎన్నికలకు ముందు, తరువాత ఆయనకు వ్యతిరేకంగా ఎన్ని నిర్ణయాలు జరిగినా, ప్రజల్లో ఆయనకు విశేష ఆదరణ ఉన్నదని ఫలితాలు రుజువుచేశాయి. సైనికస్థావరాలపై ఆయన పార్టీ కార్యకర్తలు, అభిమానులు గత ఏడాది మేనెలలో చేసిన దాడులను చూపుతూ ఆయనను దేశవ్యతిరేకిగా చిత్రీకరించే ప్రయత్నాలు కూడా విఫలమైనాయి. సైన్యానికి వ్యతిరేకంగా వీధుల్లో నిలబడి పోరాడుతున్న యోధుడిగా ఇమ్రాన్‌ను ప్రజలు అభిమానించారు, ఆదరించారు. సైన్యంతో చేతులు కలిపిన పార్టీలకు ప్రజామోదంతో పాటు, విశ్వసనీయత కూడా లేదని ఈ ఫలితాలు తేల్చేసినందువల్లనే, ఇమ్రాన్ కంటే ముందు సైన్యంమీద వీరంగం వేసి, ఇప్పుడు సాగిలబడి, అధికారంలోకి రావాలనుకున్న నవాజ్ షరీఫ్ ప్రధాని కాకుండా జాగ్రత్తపడ్డారు, సైన్యానికి నమ్మినబంటులాగా వ్యవహరించే సోదరుడిని కూచోబెట్టారు.

వివిధ కారణాలతో కొత్తప్రభుత్వం ఎక్కువకాలం నిలబడదన్న వాదనలను అటుంచితే, ప్రస్తుతానికి సైన్యం తాను అనుకున్నది సాధించగలిగింది. కొత్త ప్రభుత్వానికి ఆర్థికం నుంచి అంతర్జాతీయ సంబంధాల వరకూ చాలా సమస్యలు పోగుబడివున్నాయి. అఫ్ఘానిస్థాన్‌నుంచి ఉగ్రవాదం ముప్పు, ఇరాన్‌తో దెబ్బతిన్న దౌత్యసంబంధాల సమస్య ఉండనే ఉన్నాయి. భారీగా అప్పులు ఇచ్చిన ఐఎంఎఫ్‌ను మెప్పించాలంటే ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయాలి, ప్రజలను మరింతగా పీల్చిపిప్పిచేయాలి. నవాజ్ షరీఫ్ మళ్ళీ అధికారంలోకి వస్తే భారతదేశంతో పాకిస్థాన్ వ్యవహారశైలిలో మార్పువస్తుందని చాలా విశ్లేషణలు జరిగాయి. గతంలో మోదీ–నవాజ్ బంధం, ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ దేశాన్ని సైన్యం ప్రమాదంలో పడవేస్తున్నదంటూ షరీఫ్ చేసిన వ్యాఖ్యలు తెలిసినవే. 2019లో పుల్వామాదాడి, దానికి ప్రతీకారంగా భారత్ జరిపిన బాలాకోట్ దాడులతో ఉభయదేశాల సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని మోదీ రద్దుచేయడంతో వాతావరణం మరింత గట్టిపడింది. కశ్మీరీలను పాలస్తీనియన్లతో పోల్చడం సహా షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలమీద భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉంది. ఇకపై కూడా సైన్యం మనోగతానికి భిన్నంగా వ్యవహరించగలిగే శక్తి ప్రభుత్వానికి ఉండదు కనుక, ఇరుదేశాల సంబంధాల్లో చెప్పుకోగదగ్గ మార్పువచ్చే అవకాశాలైతే లేవు. గతంలో కంటే మరింత అస్థిరమైన పరిస్థితుల్లో, అనేకానేక సమస్యల్లో పాకిస్థాన్ ఉన్నది కనుక దాని వైఖరి ఇంకొంత బిగుసుకుపోయే అవకాశాలే మెండు. భారతదేశం ఎప్పటిలాగానే సరిహద్దు ఉగ్రవాదం నుంచి అంతర్జాతీయవేదికలమీద పోరాటం వరకూ దానితో వ్యవహరిస్తూ పోవాల్సిందే.

మనుగడకే గురిపెడుతున్న మానసిక యుద్ధం

ఊదరగొట్టుట అనే ప్రాపగాండాకు అనుబంధ ఫలితాలు అనే సైడ్ ఎఫెక్ట్ కూడా ఉంటాయి. జనంలో భయభక్తులను పెంచుకోవడానికి నాయకుడు ఇంద్రుడు చంద్రుడు వీరుడు శూరుడు అని ప్రచారం చేస్తారు. అట్లా చేయగా చేయగా, నిజమే కాబోలు అని ప్రతినాయకుడు అనుకుంటాడు, అంతేకాదు, నిజంగా తాను అరివీర భయంకరుణ్ణేమో అని ప్రచార నాయకుడు కూడా నమ్మడం మొదలుపెడతాడు. ఇతరుల మీద కమ్మే మాయపొర ఎంతో కొంత తమని కూడా మత్తులో ముంచుతుంది.

నరేంద్రమోదీ, ఆయన పార్టీ వారు సామాన్యులు కాదు. ఉత్సాహం, వ్యూహం, ముందుజాగ్రత్త అన్నీ తగుపాళ్లలో ఉన్న మేధాబృందం వారికి ఉన్నది. తమ లక్ష్యసాధన గురించి జాగరూకత ఎంత ఉన్నప్పటికీ, రేపు కూడా తమదే అధికారం, పరమాధికారం అన్న బేఖాతరుదర్పం కూడా వారిలో తరచు పొడుచుకు వస్తోంది. పొగరుగా కనిపించే ఆ ధీమా కూడా వారి చేతిలో ఒక రాజకీయ పాచికే!

మొన్న ఆదివారం నాడు కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎన్నికలకు ముందు అదే చివరి సమావేశం. మంత్రులు ఎన్నికల ప్రచారాల్లో ఎట్లా ఉండాలి, ఏమేమి జనాలకు చెప్పాలి వంటి సుద్దులు ప్రధానమంత్రి తన సహచరులకు చెప్పారు. అది సరే. మరోసారి అధికారంలోకి వచ్చాక మొదటి వందరోజుల కాలంలో ఏమి చేయాలో మోదీ చర్చించారట. తన ప్రభుత్వమే వస్తుందని, తాను ప్రధాని అవుతానని అనుకోవడం ఓకే. సంభావ్యత అధికంగా ఉన్న విషయం అది. కానీ, ఈ మంత్రివర్గమే ఉండకపోవచ్చు కదా? అయినా, ప్రస్తుతం ఇంత హడావిడి నడుస్తుండగా, నూతన ప్రభుత్వమూ నూరురోజులూ అన్న మేధోమథన కార్యక్రమం ఎందుకు? వికసిత భారతాన్ని సాధించాలనే లక్ష్యం ప్రధాన మంత్రిని ఆత్రుత పెడుతోంది అనుకుందాం, అందుకు సమయం సందర్భం చూసుకోనక్కరలేదా? నిజంగా, ఆ అంశం గురించి చర్చించడంలో పెద్ద విశేషం ఏమీ లేదు. అట్లా చర్చించినట్టు బయటకు చెప్పుకోవడంలోనే అసలు కిటుకు ఉన్నది. విశ్వసనీయవర్గాల ద్వారా బయటకు పొక్కిన ఆ రహస్యం ద్వారా ప్రతిపక్షాలు ఏమి అనుకోవాలంటే, మోదీ గారు గెలవడమే కాదు, మరో హయాం పాలన కూడా ఆరంభించారు, భవిష్యత్తు వర్తమానంలోకి చొచ్చుకు వచ్చేసింది, అని. ఇక ప్రజలు ఏమి అనుకోవాలంటే, చూశారా, మోదీ ఎప్పుడూ దేశ వికాసం కోసమే ఆలోచిస్తారు, ఆయన ప్రత్యర్థులే రాజకీయాలు చేస్తున్నారు, అని.

ప్రతిపక్షాల మీద మానసికయుద్ధంలో మోదీ బ్రహ్మాస్త్ర ప్రయోగం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే మొదలయింది. సాధారణంగా, ఇటువంటి బడ్జెట్‌లు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతాయి. చాలాసార్లు, ప్రభుత్వాలకు తామే మళ్లీ గెలుస్తామన్న నమ్మకం నూటికి నూరుపాళ్లు ఉండదు. అందుకని, ఎన్నికల ప్రయోజనాల కోసం బడ్జెట్‌లో యథేచ్ఛగా వరాలు, వాగ్దానాలు గుప్పిస్తారు. తాము తిరిగి అధికారంలోకి వస్తే అవన్నీ అమలుచేస్తామన్న వాగ్దానం ఆ బడ్జెట్ ఇస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏ మాత్రం 'జనాకర్షణ' లేని విధంగా రూపొందించింది. తామే తిరిగి అధికారంలోకి వస్తామని అనుకుంటున్నారు కాబట్టి, అమలు చేయగలమా లేదా అన్న విచికిత్స వారి మీద పని చేసింది. ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది.



ఉత్సాహంతో పరుగులు తీస్తున్న బీజేపీని ప్రమాదరహితం చేసుకోవాలంటే, బీఆర్ఎస్ ఉనికి కూడా కొనసాగేట్టు కాంగ్రెస్ ప్రయత్నించాలి. బీజేపీకి మళ్లే బీఆర్ఎస్ ఓట్లను కొంతమేరకైనా నిరోధించగలగాలి. అట్లా కాక, తన గురిని బీఆర్ఎస్ మీద మాత్రమే సంధిస్తే, బీజేపీకి అదనపు బలం సమకూరుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రంలో కూడా బలం పెరిగితే పర్యవసానాలు ఏమిటో రాష్ట్ర కాంగ్రెస్‌కు తెలియవా?

మైండ్ గేమ్స్‌లో మైమరపు పనికిరాదు. ఆత్మరక్షణలో ఆదమరపూ కూడదు.

తెలంగాణలో కూడా అదే మానసిక యుద్ధ తంత్రం నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ అంటుంది. ఆరునెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్ అంటుంది. బీజేపీ బీఆర్ఎస్ కలిసే ఉన్నాయని అసెంబ్లీ ఎన్నికల నాటి పాతపాటే కాంగ్రెస్ పాడుతుంది. ఎన్నికల ప్రచారానికి ఏవో వివాదాంశాలు అవసరం అవుతాయి. కానీ, తెలంగాణలో ఉన్న ప్రస్తుత వాతావరణం, ప్రభుత్వాల, పార్టీల మనుగడలనే చర్చలోకి తెచ్చింది. జాతీయ రాజకీయ సమరంలో తలపడుతున్న రెండు జాతీయపార్టీలు, మొన్నటిదాకా పదేళ్ల అధికారంలో, మరో పదమూడేళ్ల ఉద్యమంలో ఉన్న ప్రాంతీయపార్టీ, తమ తమ శక్తియుక్తులన్నిటిని ఉపయోగించి, ఎన్నికల గండాన్ని దాటడానికి ప్రయత్నిస్తున్నాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

నిజానికి, ఈ ఎన్నికలు బీజేపీకి గండం కావు. ఈ ఎన్నికల ఫలితాల వల్ల కొత్తగా ఏ నష్టమూ పొందనిది బీజేపీ ఒక్కటే. ప్రస్తుతం ఉన్న స్థానాలను నిలుపుకున్నా చాలు. కాంగ్రెస్ అనుకూలత నేపథ్యంలో కూడా తన బలాన్ని కాపాడుకున్నట్టు అవుతుంది. అదనంగా స్థానాలు గెలుచుకుంటే, పురోగమిస్తున్నట్టు లెక్క. సగానికి పైగా గెలిస్తే, ఆపైన తిరుగుండదు. ఉన్న సీట్లకు తగ్గితే కూడా, అర్థం చేసుకోదగ్గ పరిణామమే తప్ప, పెద్ద పతనం కాదు. కాబట్టి, బీజేపీ ఒక సౌకర్యవంతమైన స్థితినుంచి పోరాటంలోకి దిగుతోంది. దాని ప్రయత్నం అంతా మెరుగుదల కోసమే. ఆ మెరుగుదల వస్తే, రాష్ట్ర రాజకీయాలను కూడా మలుపుతిప్పగలిగిన పరిణామాలకు అవకాశం ఉంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి అట్లా లేదు. వాటికి జీవన్మరణ సమస్య. అసెంబ్లీ విజయానికి తగినట్టు, అంతకు మించి విజయాలు రాకపోతే, రేవంత్ రెడ్డికి అధిష్ఠానం దగ్గర రేటింగ్ తగ్గవచ్చు, లేదా, ఇంటిపోరు అధికం కావచ్చు. తమకు మంచి గెలుపు రావడం ఒక్కటే సరిపోదు, బీఆర్ఎస్‌కు అనూహ్యమైన విజయాలు ఏమీ రావు కానీ, బీజేపీకి అదనపు బలం సమకూరకూడదు. కాంగ్రెస్ పది గెలిచి, తక్కినవి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం దక్కించుకుంటే ఓకె. అట్లా కాకపోతే, అదనపు గెలుపులతో బీజేపీలోకి వలసలు పెరిగిపోతాయి. కొందరు నిబద్ధులు ఉన్న మాట నిజమే కానీ, బీఆర్ఎస్ శాసనసభ్యులు అనేకులు తమకు ఉన్నచోట భవిష్యత్తు లేదన్న చింతలో పడిపోయారు. వారికి సహజంగానే బీజేపీ ఒక ఆకర్షణీయ గమ్యంగా కనిపిస్తుంది. ఇక అప్పుడు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు అనుమతించాలన్న తాత్విక ప్రశ్న బీజేపీ డిల్లీ పెద్దలలో తలెత్తవచ్చు.

బీఆర్ఎస్‌ది ప్రస్తుతానికి దయనీయ పరిస్థితే. లోక్‌సభ ఎన్నికలలో ప్రచారాంశమే లేని పార్టీ ఇది. కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అయినా, బీజేపీకి వేయడానికి అయినా ఓటరుకు తగిన కారణాలున్నాయి. మరి బీఆర్ఎస్ ఎంపీలు డిల్లీకి పోయి ఏమి సాధిస్తారు? అట్లాగని, ఎన్నికలను వదులుకోలేరు. మొన్నటి ఎన్నికలలో బలం చూపిన చోట్ల అయినా, ఎంపీలను గెలిపించుకోవాలి. లేకపోతే, ఎమ్మెల్యేల బలగాన్ని నిలుపుకోవడం కష్టం. కానీ, గత పదేళ్ల దాని పరిపాలనా కాలాన్నే కాంగ్రెస్ వివాదాస్పదం చేస్తున్నది. ఇంకా నాలుగున్నరేండ్ల కాలం ఎడారిలాగా కనబడుతుంటే, పార్టీ మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి కూడా బీఆర్ఎస్ వేట ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

బీజేపీ మీద కాకుండా, రేవంత్ రెడ్డి తన అస్త్రాలన్నిటినీ బీఆర్ఎస్ మీద ఎందుకు గురిపెడుతున్నట్టు? బీఆర్ఎస్ లక్ష్యం కూడా రేవంత్ మాత్రమే ఎందుకు అవుతున్నారు? బీఆర్ఎస్ నుంచి సిద్ధంగా ఉన్న వలసలను కాంగ్రెస్ ఎందుకు ఆపుతున్నది? అదనపు బలాన్ని సమకూర్చుకుని, ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లకుండా, దిగువశ్రేణి నేతల వలసలతోనే ఎందుకు తృప్తి చెందుతున్నట్టు? ఎన్నికల తరువాత బలం పెంచుకుందామనుకుంటున్నారేమో కానీ, అప్పటికి బీఆర్ఎస్ శిబిరంలో ఎవరైనా మిగులుతారా? ప్రధానమంత్రి పర్యటనలో రేవంత్ వ్యవహరించిన తీరు కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా? తెలంగాణ అస్తిత్వ స్పృహ రేవంత్‌లో కనిపించడం లేదన్న విమర్శ బీఆర్ఎస్ తిరిగి ఉద్యమ ఉద్వేగాలను ఆశ్రయించనున్నట్టు సూచిస్తోందా? మోదీ చెప్పిన సర్జికల్ స్ట్రయిక్ అంతరార్థమేమిటి? ఇంతకీ, లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో ప్రధాన పోటీ ఏ రెండు పార్టీల మధ్య? ఇవన్నీ తెలంగాణ రాజకీయ రంగాన్ని కుదిపివేస్తున్న ప్రశ్నలు.

ప్రజల ఆధ్యాత్మికతను సంతృప్తిపరచడం ద్వారా ఎన్నికలను గెలవబోతున్నప్పుడు, భౌతిక అవసరాల గురించిన పెద్ద పట్టింపు అవసరం లేదన్న నిశ్చింతా బీజేపీ వారికి ఉంది. తరువాతి పదవీకాలం కూడా తమదే అని జాతీయ అధికారపక్షం తమ ప్రత్యర్థులకు తేల్చిచెప్పింది. మీకేమీ తాయిలాలు ఇవ్వకపోయినా సరే, మీరు మమ్మల్ని గెలిపించడం కంటె మరేమీ చేయలేరు అని కూడా ప్రజలకు చెప్పింది.

తమ పార్టీ మిగులుతుందా లేదా అన్న ఆందోళనలో ఒక పార్టీ, తమ ప్రభుత్వానికి గండం ఉండేమోనన్న భయంలో మరో పార్టీ సతమతమవుతున్నాయి. ఆ కలవరాన్ని మరింతగా పెంచిపోషిస్తూ బీజేపీ తమాషా చూస్తున్నది. ప్రతిపక్షాల మధ్య ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చి, పబ్బం గడుపుకోవాలని కేసీఆర్ ప్రయత్నించారు. అందుకే పనిగట్టుకుని బీజేపీ బలం పెంచి, ఆ బలానికి తానే భయపడే స్థితికి వచ్చారు. స్వయంగా బీజేపీయే తనను తాను తగ్గించుకుని, యుద్ధంనుంచి తప్పుకున్నది కాబట్టి, కాంగ్రెస్‌కు లాభం కలిగింది. ఉత్సాహంతో పరుగులు తీస్తున్న బీజేపీని ప్రమాదరహితం చేసుకోవాలంటే, బీఆర్ఎస్ ఉనికి కూడా కొనసాగేట్టు కాంగ్రెస్ ప్రయత్నించాలి. బీజేపీకి మళ్లే బీఆర్ఎస్ ఓట్లను కొంతమేరకైనా నిరోధించగలగాలి. అట్లా కాక, తన గురిని బీఆర్ఎస్ మీద మాత్రమే సంధిస్తే, బీజేపీకి అదనపు బలం సమకూరుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి రాష్ట్రంలో కూడా బలం పెరిగితే పర్యవసానాలు ఏమిటో రాష్ట్ర కాంగ్రెస్‌కు తెలియవా?

మైండ్ గేమ్స్‌లో మైమరపు పనికిరాదు. ఆత్మరక్షణలో ఆదమరపూ కూడదు.

పౌరహక్కుల సంఘం 50 ఏళ్ళ ముగింపు సభలు

1970వ దశకం తొలినాళ్ళల్లో శ్రీకాకుళం రైతాంగ పోరాటాలపై ఆనాటి జలగం వెంగళరావు ప్రభుత్వం అమలు చేసిన క్రూర నిర్బంధానికి వ్యతిరేకంగా విప్లవ రాజకీయ అభిమానులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కలసి తెలుగునాట ఒక హక్కుల ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆ కృషిలో భాగంగా 1973 డిసెంబరు 28న గుంటూరులో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఆంధ్ర ప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ – ఏపీసీఎల్‌సీ) ఆవిర్భవించింది. ఆ తరువాత 1974 మార్చి 2న హైదరాబాద్‌లో శ్రీశ్రీ అధ్యక్షుడుగా పత్తిపాటి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా ఒక నిర్మాణ రూపాన్ని సంతరించుకున్నది. సంస్థ ఆవిర్భవించిన తొలినాళ్ళలో రాజ్యహింసకు వ్యతిరేకంగా మాత్రమే పనిచేసినా తనదంతర కాలంలో కార్యరంగాన్ని విస్తృతపరచుకుని సమాజంలో వివిధ ఆధిపత్య వ్యవస్థల మూలంగా జరుగుతున్న హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థగా ఎదిగింది. అణచివేత ఏ రూపంలో ఉన్నా దాన్ని వ్యతిరేకించే పౌరహక్కుల సంఘం ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతానికి నిబద్ధం కాకుండా విశాలమైన ప్రజాతంత్ర విలువల ప్రాతిపదికన స్వతంత్ర అవగాహనను, అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ప్రజాతంత్ర స్రవంతిలో బాధిత ప్రజల పక్షాన గళాన్ని వినిపిస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ), పౌర హక్కుల సంఘంగా పేరు మార్చుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలుగా ఏర్పడి, రెండు తెలుగు రాష్ట్రాల్లో తన కార్యాచరణను కొనసాగిస్తున్నది.

పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభలు మార్చి 9, 10 తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతాయి. తొలిరోజు మొదటి సెషన్ ఉదయం 10.30 నుండి 1.30 గం.ల వరకు జరుగుతుంది. మాడభూషి శ్రీధర్ ఆహ్వానం పలుకుతారు, ప్రొ. హరగోపాల్ ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం 'నిర్బంధ చట్టాలు – న్యాయ వ్యవస్థ' అంశంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి, 'దేశవ్యాప్త హక్కుల పరిస్థితి'పై హర్షమందర్ ప్రసంగిస్తారు. రెండవ సెషన్‌లో 'మతం – రాజ్యాంగం – పౌరహక్కులు' అంశంపై అర్ఫాఖానుం షేర్వానీ (వైర్), 'పత్రికా స్వేచ్ఛ – నిర్బంధం' అంశంపై కె. శ్రీనివాస్ (ఆంధ్ర జ్యోతి), 'విద్య– కాషాయీకరణ' అంశంపై ప్రొ. మధు ప్రసాద్ (ఢిల్లీ యూనివర్శిటీ) ప్రసంగిస్తారు. మలిరోజు కార్యక్రమంలో 'పౌరహక్కుల సంఘం 50 వసంతాల పయనం' అంశంపై క్రాంతి చైతన్య, 'ఆదివాసీ చట్టాలు – సాయుధీకరణ' అంశంపై ప్రొ. నందినీ సుందర్, 'కాషాయీకరణ – దళితులపై దాడులు' అంశంపై ప్రొ. సత్యపాల్ (ఆంధ్ర యూనివర్శిటీ) ప్రసంగిస్తారు. రెండవ సెషన్‌లో 'కార్పొరేటీకరణ – ఆదివాసీ మహిళలపై ప్రభావం' అంశంపై ప్రొ. మాధురి, 'కార్పొరేటీకరణ – కార్మిక హక్కుల విధ్వంసం' అంశంపై పి. ప్రసాద్ (ఐఎఫ్‌టియు), 'కార్పొరేటీకరణ – రైతాంగ హక్కుల విధ్వంసం' అంశంపై కన్నెగంటి రవి ప్రసంగిస్తారు.

– ప్రొ. గడ్డం లక్ష్మణ్, నక్కా నారాయణరావు
(అధ్యక్ష కార్యదర్శులు, తెలంగాణ)

– వేడంగి చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్
(అధ్యక్ష కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్)

ఛలో బొల్లేపల్లి!

బీసీలు, ఈబీసీలకు అసెంబ్లీలోను, పార్లమెంటులోను రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో గత ఏడాది డిసెంబరు 12న నవ సంఘర్షణ సమితి (ఎన్ఎస్ఎస్) ప్రారంభమైంది. ఇదే లక్ష్యంతో ఈ సంస్థ దేశవ్యాప్తంగా ప్రముఖ జాతీయ నాయకుల జన్మస్థలాల్లో నిరాహార దీక్షలను చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రావి నారాయణరెడ్డి జన్మస్థలం బొల్లేపల్లి (భోనగిరి మండలం, తెలంగాణ)లో మార్చి 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల దాకా నిరాహార దీక్ష జరుగుతుంది. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి పేరు మీద వంద ఎకరాల స్థలంలో యూనివర్సిటీని స్థాపించాలని, రావి నారాయణరెడ్డి పేరును ఏదో ఒక జిల్లాకు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– పంజాల జైహింద్ గౌడ్

హిందీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలకు కావలసిన విద్యార్హులకు సంబంధించి తెలంగాణ విద్యాశాఖ 2023 సెప్టెంబర్ 5న జీఓ 25ను విడుదల చేసింది. ఇందులో హిందీ ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యార్హతలలో హిందీ కోర్సులను పేర్కొనకపోవడం వల్ల వేలాది హిందీ పండిత అభ్యర్థులు డీఎస్సీ రాయడానికి అవకాశం కోల్పోతున్నారు. గతంలో ప్రభుత్వమే హిందీ పండిత శిక్షణకు విద్వాన్, ప్రవీణ, ఇతర కోర్సులను అర్హతగా పేర్కొన్నది. ఇప్పుడు వారిని అనర్హులుగా పేర్కొనడంతో వేలాది హిందీ అభ్యర్థులకు ఆ జీఓ శాపంగా మారింది. కాబట్టి 2014–15 బ్యాచ్ వరకు ప్రభుత్వం పేర్కొన్న విద్యార్హతల ప్రకారం పండిత శిక్షణ పూర్తి చేసిన వారందరినీ డీఎస్సీ రాయడానికి అర్హులుగా ప్రకటించి వారికి న్యాయం చేయాలి.

– జాకీర్ పాషా
అధ్యక్షులు, హిందీ భాషా సేవా సమితి, మహబూబ్‌నగర్

కులగణన తీర్మానంతో రుజువైన కాంగ్రెస్ నిబద్ధత!

ప్రజాస్వామ్యంలో సమానత్వాన్ని రాజకీయ భాగస్వామ్యంతోనే కొలుస్తారు. అంటే పాలనలో భాగం. అది ఎంత జనాభాకు అంత వాటా కింద కేటాయిస్తేనే సాధ్యం. దానికే శ్రీకారం చుట్టింది తెలంగాణ పాలక పార్టీ కాంగ్రెస్. రాష్ట్ర అసెంబ్లీలో ఫిబ్రవరి 16న సమగ్ర కులగనన చేయబోతున్నట్టు తీర్మానించి చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది.

దొడ్డు లెక్కల ప్రకారం రాష్ట్రం 50 శాతం బీసీలు ఉంటే మిగిలిన 50 మిగిలిన అన్ని సామాజిక వర్గాలు ఉన్నాయని అంచనా! కానీ ఆ పద్ధతిలో ఇప్పటివరకు వారికి పాలనలో భాగం కానీ, పాలనాధికారం కానీ రాలేదు. ఇప్పుడు కులగణన చేపట్టి, లెక్కలు తీసి, ఎంత జనాభాకు అంత వాటా వచ్చేట్టు చేయగలిగితే, రానున్న కాలంలో రాజకీయాల్లో బీసీలకు న్యాయం జరుగుతుంది.

భారత ప్రధాని తను బీసీ సామాజిక వర్గానికి చెందినవాడినని క్లెయిమ్ చేసుకుంటూ పాలనా బాధ్యతల విషయంలో బీసీలకు ప్రాధాన్యం ఉండాలనే తన కాంక్షను చాలా సార్లు ప్రత్యక్షంగా పరోక్షంగా వెల్లడిస్తూనే వచ్చారు. కానీ ఇలాంటి కార్యాచరణకు ముందుకు రాలేదు. ప్రధాని నాయకత్వంలోని బీజేపీకి మద్దతు పలికేవాళ్లలో సింహభాగం బీసీ సామాజిక వర్గీయులే! ఒక బీసీ ప్రధాని దేశంలో అత్యధిక జనాభాగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి రాజకీయ సాధికారతను సాధించిపెడతారన్న ఆశతోనే వారు బీజేపీ పక్షాన నిలుస్తున్నారు. నిజానికి ప్రధాని ఉపన్యాసాలు విన్న రాజకీయ స్పృహ ఉన్న వాళ్ళంతా ఆయన బీసీలకు రాజకీయ సాధికారత సాధించిపెట్టడం తథ్యమనే నమ్మారు ఇన్నాళ్లూ! అంతెందుకు, గత ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే మీదా వాళ్లు ఆశలు పెట్టుకున్నారు. కానీ అది ఆ పార్టీ ఓట్ల అంచనా కోసం, గెలుపు వ్యూహంలో భాగంగా చేసుకున్న సర్వే అని జనాలకు ఆలస్యంగా అర్థమైంది.



వెనకబడిన తరగతులు, ఎస్సీ ఎస్టీల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అభ్యున్నతికి తీసుకోవలసిన చర్యలు, చేపట్టాల్సిన ప్రణాళికలకు పునాది సమగ్ర కులగణన సర్వే! ఇది లేక ఎన్ని మాటలు చెప్పినా అవి గాల్లో తేలుతాయే తప్ప ఆయా వర్గాలకు ఫలాలను అందిచలేవు. దీన్ని గ్రహించే దేశ వ్యాప్తంగా కులగణన జరగాలని రాహుల్ గాంధీ అన్నారు. ఆ నిర్మాణాత్మక ఆలోచనకు నేడు తెలంగాణలో బీజం పడింది. రాహుల్ గాంధీ మాటను ఆదేశంగా తీసుకుని రాష్ట్రంలో ఆ సర్వే గురించి సీనియర్ మంత్రుల ఆధ్వర్యంలో, శాసనసభ అఖిలపక్ష ఏకాభిప్రాయంతో ఓ తీర్మానం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం ఈ తీర్మానాన్ని అధికారికంగా అసెంబ్లీలో ఇప్పుడు ప్రకటించారు కానీ, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచే ఆచరణను మొదలు పెట్టారు. అందులో భాగంగానే 26 స్థానాల్లో బీసీలకు టికెట్లు ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకపక్షం కానీ, ప్రతిపక్షం కానీ తెలంగాణ ప్రాంతానికి చెందిన బీసీలకు ఇన్ని టికెట్లు ఇచ్చింది ఎన్నడూ లేదు! అంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అత్యధిక టికెట్ల కేటాయింపుతోనే రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించిందని చెప్పొచ్చు. ఈ 26 స్థానాల్లోని కొన్ని చోట్ల ఏళ్లుగా ఇతర కులాలకు చెందిన నేతలు పాగా వేసుకుని ఉన్నప్పటికీ ఆ నేతలను ఒప్పించి ఆ స్థానాల్లోకి బలహీన వర్గాల నేతలను తీసుకొచ్చారు. అంతేకాదు, అధికారంలోకి వచ్చాక ఎస్సీ ఎస్టీ బీసీలకు మంత్రివర్గంలోనూ చోటు కల్పించారు. వారికి ప్రస్తుతం స్పీకర్, డిప్యూటీ సీఎం, నాలుగు మంత్రి పదవులతో ప్రాధాన్యం కలిగిన పోర్ట్‌ఫోలియోలు అప్పగించారు. ఎవరి జోక్యం లేకుండా వారు స్వతంత్రంగా పనిచేసుకునేలా అవకాశం ఇచ్చారు. శాసనసభలో కొన్ని కమ్యూనిటీలకు స్థానం లేదని గ్రహించి వారికీ సముచిత స్థానం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

అలాగే పార్టీలో ఎన్ఎస్‌యుఐ నుండి పని చేసిన పొన్నం ప్రభాకర్‌కు మంత్రిగా; మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరు వెంకట్‌లకు ఎమ్మెల్సీలుగా; అనిల్ కుమార్ యాదవ్, వంశీచంద్‌రెడ్డిలకు ఎంపీలుగా అవకాశం కల్పించి పార్టీలో ఎన్ఎస్‌యూఐ నుండి నిబద్ధతతో పనిచేసిన వారిని మరచిపోమని, వారి కృషిని గుర్తించి పాలనా బాధ్యతల్లో భాగస్వామ్యం కల్పిస్తామని చాటారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఒకేసారి ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులుగా పనిచేసిన అయిదుగురినీ ప్రజాప్రతినిధులుగా చేయడం పార్టీ కార్యకర్తల్లోనే కాదు సమాజంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆశావాహ దృక్పథాన్ని కలిగిస్తోంది.

ప్రతిపక్షాల గోబెల్ ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారు. రేవంత్ రెడ్డి స్థితప్రజ్ఞతను గ్రహిస్తున్నారు. చాకచక్యంగా పరిస్థితులను దిద్దుకొస్తున్న తీరు చూసి అబ్బురపడుతున్నారు. అందుకే- హామీలు, మేనిఫెస్టో వాగ్దానాలు ఎక్కడికి పోవని, మూడు నెలలు కాకపోతే ఆరు నెలలు, ఆరు నెలలు కాకపోతే ఏడాదిలో అన్నీ తీరుతాయని అనుకుంటున్నారు. ఇన్‌స్టంట్ రిజల్ట్స్ పట్ల కన్నా దీర్ఘకాలిక ఫలితాలు సుస్థిర అభివృద్ధి కోసమే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. దానికి శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సమగ్ర కులగణన తీర్మానాన్నే సాక్ష్యంగా పరిగణిస్తున్నారు.

■ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
(మాజీ ప్రధాన సమాచార కమిషనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్)

ఓబీసీ ముఖ్యమంత్రులు ఎందుకు లేరు?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు గడిచినా బీసీ వర్గాల నుంచి ముఖ్యమంత్రులు లేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీల నుంచి ఒక ముఖ్యమంత్రి వచ్చారు. కానీ 52శాతం ఉన్న ఓబీసీ జనాభాకు మాత్రం ఆ అవకాశం దక్కలేదు. ఈ రోజు దేశంలో ఏపీ, తెలంగాణ మినహా దాదాపు అన్ని రాష్ట్రాలు ఓబీసీ ముఖ్యమంత్రులను చూశాయి. ప్రస్తుతం ఏడు ప్రధాన రాష్ట్రాల్లో ఓబీసీ ముఖ్యమంత్రులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీ వర్గాల నుంచి ముఖ్యమంత్రి రాకపోవడానికి అనేక కారణాలున్నాయి.

ఓబీసీలు జనాభాలో 52 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. అందుకే ముఖ్యమంత్రి పదవి కోసం తమ డిమాండును నొక్కి చెప్పేందుకు వారికి గొంతు లేకుండా పోయింది. వారి జనాభాకి తగిన వాటా దక్కడం లేదు. అంతేగాక వారు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల సంఖ్యకు, వారి జనాభాకు ఎటువంటి సంబంధం లేదు.

ఆలాగే ఓబీసీలలో ఐక్యత, ఓబీసీ స్పృహ లేకపోవడం మరో కారణం. ఓబీసీలలో 136 కులాలు ఉన్నాయి. వీటిని సాంప్రదాయ వ్యవసాయ కులాలు, వ్యవసాయ కులాలపై ఆధారపడిన కులాలు, వృత్తి కులాలు, సేవా కులాలు, సంచార, అర్థ సంచార (ఆశ్రిత) కులాలుగా విభజించారు. ఈ కులాలు చాలావరకు కడు పేదరికంలో ఉన్నాయి. ఈ కులాలలో నుంచి ఇప్పటి వరకు ఒక సభ్యుడు కూడా అసెంబ్లీ గడప తొక్కలేదు. కొన్ని సంఖ్యాపరంగా పెద్ద, ప్రముఖ కులాలు ఓబీసీల్లో ఉన్నాయి. అయితే అక్కడ కూడా 75శాతం కంటే ఎక్కువ జనాభా దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. గత 76 ఏళ్ళల్లో ఓబీసీ కులాల్లో కొత్తగా మధ్యతరగతి వ్యక్తులు పుట్టుకొచ్చారు. వారు తమ స్వంత కమ్యూనిటీ పేద ప్రజలకు ఉద్దేశించిన చాలా ప్రయోజనాలకు గండి కొడుతున్నారు. అనైక్యత, అధిక నిరక్షరాస్యత, కడు పేదరికం, విభిన్న సామాజిక – ఆర్థిక నేపథ్యాల కారణంగా ఓబీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారు. ఓబీసీల మధ్య ఐక్యత లేకపోవడంతో అగ్రవర్ణ కులాల రాజకీయ నాయకులు వారిని ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు.

ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం కూడా బీసీలకు వ్యతిరేకంగానే పని చేసింది. ముఖ్యంగా తెలుగుదేశం, బీఆర్ఎస్ పార్టీల హయాంలో అగ్రవర్ణాల నాయకత్వంలో కొనసాగిన సుదీర్ఘ పాలన ఓబీసీ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసింది. ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం 1983 నుంచి 1989 వరకు, 1994 నుంచి 2004 వరకు (మొత్తం పదహారేళ్ళు) తరువాత బీఆర్ఎస్ 2014 నుంచి 2024 వరకు (మొత్తం పదేళ్ళు) పాలించాయి. ఇవి కుటుంబ ఆధారిత పార్టీలు కాబట్టి, వారి కుటుంబ సభ్యులను దాటి మరొకరు ముఖ్యమంత్రి కావడం అసాధ్యం. కొందరు ఓబీసీ నాయకులు స్థాపించి నడిపిన పార్టీలు ఎటువంటి ప్రభావం చూపలేక అనతికాలంలోనే కనుమరుగయ్యాయి.

అలాగే 1990 నుంచి రాజకీయాలలో '3ఎం'లు మూడు ప్రధాన శక్తులుగా పని చేశాయి: మనీ, మజిల్, మీడియా (డబ్బు, కండబలం, ప్రచార సాధనాలు). ఎన్నికలలో గెలవడానికి వీటి ప్రభావం కీలకంగా మారింది. ఇవి లేని ఓబీసీలు మరింత బలహీనంగా మారారు. రాజకీయాలు, డబ్బు, నేరాలు కలగలిసి పోయినాయి. ఈ తరుణంలో న్యాయ వ్యవస్థ ద్వారా కేసులు వేసి పోరాడేందుకు కావలసిన డబ్బు ఓబీసీలకు లేదు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కేవలం అగ్ర కులస్థుల చేతుల్లో ఉంది. సోషల్ మీడియా రోజు రోజుకూ పెరుగుతున్నది కానీ నిరక్షరాస్యత కారణంగా ఓబీసీలు ఈ మాధ్యమాన్ని ఎంత శక్తివంతంగా ఉపయోగించుకుంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

అన్ని జాతీయ రాజకీయ పార్టీలు ఓబీసీ సమస్యల పట్ల ఉదాసీనతతో ఉన్నాయి. ఓబీసీలు ఏకం అయినప్పుడే వారి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రులు ప్రభవిస్తారు. అప్పుడు మాత్రమే ఇతర రాజకీయ పార్టీలు వివిధ ప్రోత్సాహకాలు/ పదవులను అందించడానికి వారి ముందు క్యూ కడతాయి.




జాతీయ పార్టీల వివక్ష కూడా మరొక కారణం. సుమారు 50ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు ఓబీసీని ముఖ్యమంత్రి చేయడానికి పుష్కలంగా అవకాశం ఉంది. వారు ఒక దళితుడిని ముఖ్యమంత్రిని చేసారు కానీ ఓబీసీని ముఖ్యమంత్రి చేయలేదు. ఓబీసీలకు ఆ సోయి లేని సమయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ, పి.శివశంకర్, జి.రాజారాం, సర్దార్ మల్లికార్జున్ గౌడ్ వంటి ఎందరో ఓబీసీ నాయకులు ముఖ్యమంత్రులు కావడానికి వంద శాతం అర్హులైనవారు ఉన్నారు. రెండుసార్లు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ముఖ్యమంత్రి పదవికి పరిశీలించినా అగ్రకుల రాజకీయాల కారణంగా ఇవ్వడానికి నిరాకరించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఇదే విధమైన సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులను, అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఓబీసీలు చవిచూశారు. ఆంధ్ర ప్రాంతంలో కూడా ఓబీసీ కులాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. సర్దార్ గౌతు లచ్చన్న, ప్రగడ కోటయ్య వంటి ఎందరో పేరొందిన ఓబీసీ నాయకులు ముఖ్యమంత్రి కాలేకపోయారు. ఈ అణగారిన కులాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందజేయటం కోసం, సమానమైన, సమ్మిళిత సమాజాన్ని సృష్టించడం కోసం, రాజ్యాంగపరమైన బాధ్యతను నెరవేర్చడం కోసం వెంటనే సమగ్ర కులగణనతో కూడిన జనాభా గణన అవసరం.

అన్ని జాతీయ రాజకీయ పార్టీలు ఓబీసీ సమస్యల పట్ల ఉదాసీనతతో ఉన్నాయి. ఈ రాజకీయ పార్టీలు తీసుకుంటున్న నిర్ణయాలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఓబీసీల ప్రయోజనాలకు ప్రమాదకరంగానే ఉన్నాయి. కుల ఆధారిత సమగ్ర జనాభా గణనను నిర్వహించేందుకు వారు విముఖత చూపుతున్నారు. కనీసం ఇప్పుడైనా ఓబీసీ జనాభా గణన కోసం ప్రత్యేక చట్టాన్ని ఆమోదించాలి, లేదా ఎస్సీ ఎస్టీలతో సమానంగా ఓబీసీల లెక్కింపు కోసం నిబంధనలను రూపొందించడానికి రాజ్యాంగాన్ని సవరించాలి. ఓబీసీలకు వారి జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్ల కల్పన జరగాలి. అంబేడ్కర్ ఒకప్పుడు బహుజనుల అభివృద్ధికి రాజకీయ అధికారమే ప్రధానమని చెప్పారు. ఓబీసీ కులాలు తమ జనాభా ప్రకారం చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాడాలి.

తెలంగాణలోని ఓబీసీలు బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి ప్రేరణ పొంది వారి స్వంత రాజకీయ పార్టీ/ పార్టీలను ఏర్పాటు చేసుకోవడానికి వెనుకాడకూడదు. నిర్ణయాత్మక శక్తిగా మారడానికి వారిని ఏకం చేసి ఓబీసీ కులాలలో చైతన్యాన్ని పెంపొందించాలి. ఓబీసీలు ఏకం అయినప్పుడే వారి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రులు పుడతారు. అప్పుడు మాత్రమే ఇతర రాజకీయ పార్టీలు వివిధ ప్రోత్సాహకాలు / పదవులను అందించడానికి వారి ముందు క్యూ కడతాయి. వికసిత భారత్ కల నిజం అవుతుంది.

• టి.చిరంజీవులు
రిటైర్డ్ ఐఏఎస్



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 కనిష్ఠం 23.8

నాలాలపై సేఫ్టీ ఆడిట్

● జీహెచ్‌ఎంసీ నోటిఫికేషన్



హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. నాలాలు, వరద నీటి డ్రెయిన్ల క్షేత్రస్థాయి పరిస్థితి పరిశీలనకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ(ఈఓఐ) బుధవారం

మిగతా 8వ పేజీలో..



సినీతారలు, మోడళ్లే కాకుండా అందంగా కనిపించాలనే తాపత్రయంతో సంపన్నవర్గాలకు చెందిన కొందరు యువత కూడా కొకైన్‌కు బానిస అవుతున్నారు. నిజంగా కొకైన్ తీసుకుంటే అందం పెరుగుతుందా అంటే.. అదంతా తప్పుడు ప్రచారమని వైద్యులు చెబుతున్నారు. కొకైన్ ఎంతో హానికరమని, గుండెపోటుకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

కొకైన్ అందాన్ని పెంచుతుందా?

● వాస్తవం కాదంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొకైన్ ఓ మత్తు పదార్థం. దాన్ని తీసుకుంటే కేంద్ర నాడీ వ్యవస్థ, గుండె కండరాలు ఉత్తేజం చెందాయనే భావన కలుగుతుంది. మూత్రపిండాలను ఎక్కువగా పని చేయించడమే కాకుండా, మానసిక చైతన్యాన్ని ప్రేరేపిస్తుంది. కంటిచూపు, వినికిడి శక్తి పెరిగినట్లు అనిపిస్తుంది. అలసట తగ్గిన భావన కలుగుతుంది. ఏదో కొత్త ధైర్యం, సామర్థ్యం వచ్చిన భావం పుట్టుకొస్తుంది. సెక్స్ సామర్థ్యం పెరిగినట్లు అనిపిస్తుంది. అయితే, ఈ నూతనోత్సాహం అంతా తాత్కాలికమేనని, ఎక్కువసేపు ఉండదని వైద్యులు చెబుతున్నారు. కొకైన్‌కు బానిసగా మారితే మనిషిలో టెన్షన్ పెరగడం, మాట సరిగా రాకపోవడం, చేతులు, కాళ్ళు వణకడం, ఒక్కోసారి ఫిట్స్‌కు దారి తీయడం, గుండెవేగంగా కొట్టుకోవడమే కాకుండా, నాడీవ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతున్నట్లు బాధితుల్లో గుర్తించామని వివరిస్తున్నారు.

కొకైన్‌తో గ్లామర్ పెరగదు



గ్లామర్ పెరగడానికి కొకైన్‌లాంటి మాదకద్రవ్యాలు ఉపయోగపడవు. అమ్మకందారులు అలా ప్రచారం చేస్తారు. తమలో శక్తిసామర్థ్యాలు లేవని, ఇతరులతో చురుకుగా మాట్లాడలేమని, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించలేమని భావించే వారు కొకైన్‌లాంటి మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. షూటింగ్‌లో ఉన్న సమయంలో నటులు కొందరు తమ నటన బాగా చేయడానికి ఈ రకం మాదకద్రవ్యాలను తీసుకుంటున్నారు. మోతాదు మించితే ఇబ్బందేనని అందరూ గమనించాలి.

- డాక్టర్ హేమంత్‌కుమార్, కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జన్, కిమ్స్ ఆస్పత్రి.



ధారగా..!

● నగరంలో నీటి ఇక్కట్లు మొదలు..
● ఇష్టారీతిన వ్యవహరిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది
● పర్యవేక్షించని మేనేజర్లు, డీజీఎంలు
● ఆఫీసులకే పరిమితమవుతున్న జీఎంలు

గ్రేటర్ హైదరాబాద్‌లో నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు వేగంగా పడిపోవడంతో ఎక్కువమంది వాటర్‌బోర్డు నీళ్లపైనే ఆధారపడుతున్నారు. గ్రేటర్‌తో పాటు ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు రోజూ 560 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదు. చాలాప్రాంతాల్లో నీటి సరఫరా సన్నని ధారగా సాగుతున్నదని నగరవాసులు గగ్గోలు పెడుతున్నారు. వేసవి నేపథ్యంలో ఆర్భాటంగా యాక్షన్‌ప్లాన్ రూపొందించినా, లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పనిచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, మార్చి6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నల్లాల నుంచి ధారగా వస్తున్న నీటితో ఒక బిందె నిండడం కూడా కొన్ని ప్రాంతాల్లో గగనం అవుతోంది. వేసవికి రెండు నెలల ముందే భూగర్భజలాలు పడిపోవడం, బోర్లు వట్టిపోవడంతో బోర్డు నీటిపైనే ఆధారపడ్డ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీళ్ల గ్రేటర్‌వాసుల అవసరాలకు సరిపోవడం లేదు. కొన్ని ప్రాంతాలకు అధికంగానూ, మరికొన్ని ప్రాంతాలకు సాధారణంగాను నీటి సరఫరా అవుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులున్న ప్రాంతాలకు సరఫరా చేసే సమయానికి మించి అధికంగా నీటిని మళ్లిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాలకు నిర్ణయించిన సమయం కంటే తక్కువగా సరఫరా చేస్తున్నారు.

ఇళ్లల్లోనే అధికారులు

వాటర్‌బోర్డు ఆపరేషన్ మెయింటెనెన్స్ విభాగానికి చెందిన మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలు నీటిసరఫరా తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి. ఏ ప్రాంతానికి ఎంతమేర నీటి సరఫరా జరుగుతుందో పరిశీలించాలి. కానీ, ఆ పని చేయకుండా కొన్ని డివిజన్లలో మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వేసవి నేపథ్యంలో నిత్యం క్షేత్రస్థాయిలో ఉండి సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన ఉన్నతాధికారులంతా ఆఫీసుల్లో ఏసీరూమ్‌ల నుంచి బయటకు రావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్నిప్రాంతాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో నీటికష్టాలు

- టోలిచౌకిపరిధిలోని వలికాలనీ, నదీమ్ కాలనీ ప్రాంతాల్లో అరగంట కూడా నీటి సరఫరా కావడం లేదు. కొద్దిపాటి సమయం వచ్చే నీళ్ల కూడా లోప్రెషర్‌తో వస్తున్నాయి.
- చందానగర్‌లోని పలుప్రాంతాలకు నీళ్ల సక్రమంగా సరఫరా కావడం లేదు.
- భోలక్‌పూర్‌లోని సిద్దిఖ్‌నగర్ ప్రాంతంలో నీటిసరఫరా అరకొరగా ఉంటోంది. ఇక్కడ కూడా నీరు సన్నని ధారగా వస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



మహాశివరాత్రికి 340 ప్రత్యేక బస్సులు

కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగుట్టకు..

హైదరాబాద్ సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని పలుప్రాంతాల నుంచి కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగుట్ట జాతరలకు 340 ప్రత్యేక బస్సులను గ్రేటర్ ఆర్టీసీ నడుపుతోంది. నేటి నుంచి ఆదివారం వరకు ఈ సదుపాయం ఉంటుందని, ఒక్కో ప్రాంతానికి ఓ ప్రత్యేకాధికారిని నియమించామని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. అఫ్జల్‌గంజ్, తార్నాక,

మిగతా 8వ పేజీలో..

తల్లీబిడ్డలకు మోదీ కిట్స్

పౌష్టికాహారం అందించేందుకే: కిషన్‌రెడ్డి



తల్లీబిడ్డతో సెల్ఫీ దిగుతున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

ముషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ముషీరాబాద్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్తీ బేబీ షో - 2024 కార్యక్రమాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌రాం అధ్యక్షతన నిర్వహించారు. కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ ముఖ్యఅతిథులుగా హాజరై మహిళలకు పౌష్ఠికాహార మోదీ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పోషకాహారలేమితో తల్లీబిడ్డలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకే ప్రధాని ఈ కిట్లను అందిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రతిపక్షాలు ప్రధాని మోదీకి కుటుంబం లేదని చౌకబారు విమర్శలు చేస్తున్నాయని, దేశప్రజలంతా మోదీ కుటుంబసభ్యులే అని అన్నారు. అనంతరం తల్లీబిడ్డలతో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, భారత్ డైనవిక్ లిమిటెడ్ డైరెక్టర్లు వివి రాజారాం, ఏ.మాధవరావు, బీజేపీ నాయకులు చంద్రమోహన్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

చాంద్రాయణగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెట్రోరైలు పనులకు మోక్షం కలగనుంది. ఆ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు ఫారూఖ్‌నగర్ వద్ద బల్దియా, విద్యుత్, మెట్రోరైలు అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సీఎం వచ్చే దారిలో జీహెచ్ఎంసీ అధికారులు డివైడర్‌కు రంగులు, రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

గ్రేటర్‌లో మరిన్ని ప్రాజెక్టులు

ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రేటర్‌లో తొలిసారిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈనేపథ్యంలో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు.

- మార్చి7వ తేదీన మ.12.30 గంటలకు సికింద్రాబాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులకు, 1.30 గంటలకు బంజారాహిల్స్‌లో డా.బాబు జగ్జీవన్‌రాం భవన్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తారు.
- మార్చి 8 శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జూపార్కు సమీపంలోని మీరాలం ఎస్టీపీని, 4.30 గంటలకు ఇబ్రహీం గోల్కొండ మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభిస్తారు.
- మార్చి 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీనగర్‌లో బైరామల్‌గూడ ఫ్లై ఓవర్‌ను, 4.30కు ఉప్పల్‌లో నల్లచెరువు ఎస్టీపీని, 5 గంటలకు సికింద్రాబాద్ ఎన్‌హెచ్44లో ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రారంభిస్తారు.
- మార్చి 12న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలతో రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొంటారు. డా.సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షస్ డిసీజెస్ ఆఫ్ ఇండియా కేంద్రం పనులకు శంకుస్థాపన చేస్తారు.

బీఆర్‌ఎస్ నిరసన

● ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్



మహాధర్నాలో పాల్గొన్న తలసాని

అమీర్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ కింద భూములను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం పార్టీశ్రేణులతో కలిసి అమీర్‌పేట మైత్రీవనంలోని హెచ్ఎండీఏ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ జేబులు నింపుకోవడానికే ఎల్‌ఆర్ఎస్‌ను బీఆర్ఎస్ తీసుకువచ్చిందని ప్రస్తుత మంత్రులు గతంలో ఆరోపణలు చేశారని, తాము అధికారంలోకి రాగానే పేదలకు ఉచితంగా భూముల రిజిస్ట్రేషన్ చేయించి

మిగతా 8వ పేజీలో..

కాంగ్రెస్ శుద్ధి



కాంగ్రెస్‌తీరుపై బీఆర్ఎస్ నిరసన చేసిన అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, నేతలు ఆ ప్రాంతం అపవిత్రమైందంటూ పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయా రెడ్డి, బొంతు శ్రీదేవి, బాబాఫసియుద్దీన్ పాల్గొన్నారు.

అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగుతావా? మంత్రి పొన్నంపై గ్రేటర్ నేతల గరం 8

గాంధీలో ఎంసీహెచ్ భవనం సిద్ధం

చిన్నపిల్లలు, గర్భిణుల చికిత్సలు అక్కడే ● అన్నివిభాగాలూ తరలింపు



హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో అత్యాధునిక మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) అందుబాటులోకి వచ్చింది. నేడు లేదా రేపటి నుంచి పిల్లల వైద్యసేవలు, చికిత్సలు, ప్రసవాలను అక్కడే చేయనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. 200 పడకల సామర్థ్యంతో భవనం నిర్మించినా, పిల్లలు, మహిళలు, గర్భిణులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో పడకలను 400కు పెంచి సేవలను అందించనున్నారు. నవజాత శిశువుల చికిత్సకు న్యూనాటల్ ఇంటెన్సివ్ కేర్ (ఎన్ఐసీయూ), పురిటినొప్పుల సమయంలో పర్యవేక్షణ కోసం అబ్జర్వేషన్ రూం, అత్యవసర చికిత్సల కోసం మెటర్నిటీ ఇంటెన్సివ్ కేర్ (ఎంఐసీయూ) యూనిట్లు ఏర్పాటు చేశారు. నవజాత శిశువులకు ఎక్కువగా న్యూరాలజీ, యూరాలజీ సమస్యలు వస్తాయి. అలాంటివారికి అప్పటికప్పుడే చికిత్సలు అందించడానికి ప్రత్యేక వార్డులను సిద్ధం చేశారు.

నెలకు 600పైగా ప్రసవాలు

గాంధీ ఆస్పత్రిలో నెలకు 600 నుంచి 800 వరకు ప్రసవాలు జరుగుతుంటాయని డాక్టర్ రాజారావు తెలిపారు. ఓపీలో 300 నుంచి 400 వరకు గైనిక్

మిగతా 8వ పేజీలో..

మళ్లీ ఛాన్స్

● బ్రేక్ తీసుకున్న మహిళలకు మళ్లీ ఉద్యోగాలను ఆఫర్ చేస్తున్న కార్పొరేట్ సంస్థలు
● కార్యాలయాల్లో మహిళలకు అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లు

పెళ్లి, కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్‌లో బ్రేక్ తీసుకున్న మహిళలు మళ్లీ ఉద్యోగాల్లో చేరుతున్నారు. కొంత అనుభవం, నైపుణ్యం ఉంటే చాలు.. అలాంటి వారికి తాము అవకాశం ఇస్తాం అంటున్నాయి పలు కంపెనీలు. సాఫ్ట్‌వేర్ రంగంలో వీరికి ఉపాధి అవకాశాలు అధికంగానే లభిస్తున్నాయి. ఆటోమొబైల్, టెలికమ్యూనికేషన్స్, సేల్స్ తదితర రంగాల్లోనూ మహిళల రీజాయినింగ్స్ ఎక్కువగానే ఉంటున్నాయని పలు కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)



కొంత కాలం బ్రేక్ తీసుకున్న తర్వాత మళ్లీ ఉద్యోగం చేయాలనుకునే మహిళలకు అవకాశాలు కల్పిస్తామంటూ కొన్నిసంస్థలు ప్రత్యేకంగా క్యాంపెయిన్ చేస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలలో అవగాహన కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నాయి. ఇటీవలి కాలంలో మళ్లీ జాయిన్ అవుతామంటున్న మహిళా ఉగ్యోగులను పలు సంస్థలు టెక్నికల్, మేనేజ్‌మెంట్ బాధ్యతలలో తీసుకుంటున్నాయి. అవసరమైన శిక్షణ ఇస్తున్నాయి. ఓ సుప్రసిద్ధ ఐటీ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ దినేష్ ఇదే విషయమై మాట్లాడుతూ 'రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ అనేవి ఇప్పుడు తప్పనిసరి. కెరీర్ గ్యాప్ వస్తున్న మహిళలకు అవకాశమివ్వడానికి వారి అంకితభావం, మోటివేషన్‌లే కారణం. ఇలాంటి వారు గతం కంటే మరింత డెడికేటెడ్‌గా వర్క్ చేస్తారు. సాధించాలన్న తపనతో పనిచేస్తారు. వారి గత ఉద్యోగ అనుభవం, మిగిలిన వారికి మార్గదర్శకమూ అవుతుంది' అని వెల్లడించారు.

ప్రతిభను గుర్తిస్తున్నాయి..

కొవిడ్ తర్వాత పరిశోధన, అభివృద్ధి రంగాలకు డిమాండ్ పెరిగింది. దీంతో కెరీర్ గ్యాప్ వచ్చినప్పటికీ, ప్రతిభావంతులైన మహిళలను ఉద్యోగాలలో నియమించుకోవడానికి కార్పొరేట్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. హెక్సాగాన్ అయితే మేనేజ్‌మెంట్, టెక్నికల్ రోల్స్‌లో తాము ఉద్యోగులను తీసుకుంటున్నామంటోంది. అంతేకాదు, బిగిన్.. ఎగైన్ అంటూ ఈ తరహా ఉద్యోగుల కోసమే ప్రత్యేకంగా క్యాంపెయిన్ చేస్తోంది. ఇటీవల తమకు 350 దరఖాస్తులు వచ్చాయని, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్వాలిటీ ఎనాలసిస్ వంటి రోల్స్‌లో ఉద్యోగాలను ఆఫర్ చేశామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో మాత్రమే కాదు, టెలీకమ్యూనికేషన్స్, బయో టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఆటోమొబైల్, సేల్స్ రంగాల్లో ఈ తరహా ఉద్యోగాలకు ఎంక్వైరీలు వస్తున్నాయని ఓ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. విశేషమేమిటంటే, సాఫ్ట్‌వేర్ తదితర రంగాలలో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ఓవైపు సాగుతుండగా, ఈ రీ జాయినింగ్స్ పట్ల మహిళలకు అవగాహన కల్పించడానికి పలు కంపెనీలు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఇటీవల నగరంలోని ఓ భారీ గేటెడ్ కమ్యూనిటీలో తాము ఈ తరహా కార్యక్రమాన్నే చేశామని, మహిళల నుంచి ఆశాజనకమైన స్పందన లభించిందంటోంది ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ.

తొలుత కొంచెం కష్టం కానీ..

దాదాపు ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఉద్యోగంలో చేరాను. సంవత్సరకాలంగా నూతన టెక్నికల్ స్కిల్స్ నేర్చుకుంటున్నాను. 10 సంవత్సరాల గ్యాప్ తర్వాత వచ్చినా మా కంపెనీ ఉద్యోగం ఇస్తోంది. గ్యాప్ అనంతరం ఉద్యోగంలో చేరడం కొత్తలో కాస్తకష్టంగానే ఉంటుంది. కానీ ప్రస్తుతం నా షెడ్యూల్ మొత్తం మారిపోయింది. నేను చేస్తున్న పని పట్ల సంతోషంగా ఉన్నాను. నాలో ఆత్మవిశ్వాసమూ పెరిగింది.

- మౌనిక పల్లి, సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, హెక్సాగాన్ ఆర్ అండ్ డీ ఇండియా

టీమ్‌ను మనమే ఎంచుకునే అవకాశం

సాంకేతికత రోజురోజుకూ మారిపోతోంది. అలాంటి వేళ ఐదేళ్ల కెరీర్ గ్యాప్ ఉన్న తనలాంటి వారికి అవకాశాలు దక్కుతాయా అనే సందేహం ఉండేది. ఉద్యోగం దొరకడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. నైపుణ్యముంటే, కొత్త అంశాలను నేర్పడానికి తగిన శిక్షణను కంపెనీలు అందిస్తున్నాయి. దానితో పాటుగా మన టీమ్‌ను మనమే ఎంచుకునే అవకాశం కల్పిస్తుండటం ఓ చక్కటి అవకాశం.

- లీలావతి సురానా, సీనియర్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్

కూతురును మందలించిన తండ్రి
మనస్తాపంతో ఆత్మహత్య



కృష్ణవేణి(ఫైల్)

నిజాంపేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో సబ్జెక్టులు తప్పిందని, కనీసం ఈ సారైనా అన్నీ పాస్ కావాలని తండ్రి కూతురును మందలించాడు. మనస్తాపానికి గురైన ఆమె అపార్టుమెంట్ 5వ ఫ్లోర్ నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి సాయికీర్తికాలనీలోని ధర్మపురి గోదావరి అపార్టుమెంట్‌లో బాపిరాజు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య మహాలక్ష్మి, కూతురు కృష్ణవేణి(19) ఉన్నారు. గోదావరి జిల్లా, గంగవరం, స్వగ్రామమైన కొత్తాడలో కృష్ణవేణి ఇంటర్ పూర్తి చేసింది. కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయింది. బాగా చదువుకొని సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ కావాలని తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన కృష్ణవేణి మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో అపార్టుమెంట్ 5వ ఫ్లోర్ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించి మృతదేహాన్ని గాంధీకి తరలించారు.



● **కారులో మంటలు**

లక్డీకాపూల్ వద్దకు రాగానే కారులో మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కన ఆపాడు. ఇంతలోనే మంటలు ఎగిసిపడి కారు పూర్తిగా దగ్ధమైంది.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ

ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

● నేడు స్వామివారి కల్యాణమహోత్సవం

కీసర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల పాటు జరిగే కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో వేద పాఠశాల పండితుడు గణపతిశర్మచే గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటిరోజు పూజల్లో భాగంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరలోని వంశపారంపర్యంగా వస్తున్న నివాస గృహంలోకి తీసుకెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకీసేవ ద్వారా కీసర గ్రామం నుంచి నడకదారి గుండా కీసరగుట్టకు తీసుకువస్తారు. శ్రవణ నక్షత్రయుక్త లగ్నంలో శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు.

కోటి రూపాయలు కేటాయింపు

బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం కోటి రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరం ఉన్నా ఆలయ నిర్వాహకులు, జిల్లా కలెక్టర్ సమన్వయం చేసుకొని నిధులు వినియోగించుకోవడం జరుగుతుంది.

● ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన సత్రాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.



టీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, ఫెడరేషన్ ప్రతినిధులు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో తాను శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డైరీ-2024ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై తాను చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కార్యదర్శులు సలీమా, గుడిగ రఘు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణ



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌యూజే ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందన్నారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బి.దామోదర్, నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నారు.

గాంధీలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్సను చిన్నపిల్లల వైద్యుల బృందం విజయవంతంగా చేసింది. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బైరాంగూడకు చెందిన మైథిలీ(8) కొంతకాలంగా దగ్గు, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో ఈనెల 1న గాంధీ ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు చిన్నారికి ఎంఆర్ఐ టెస్టులతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. చివరికి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. కేసు సవాల్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎస్.శ్రీనివాస్, మనోజ్, అశ్రిత్‌రెడ్డి, హర్ష, నాగార్జునతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి చిన్నారికి ఉపశమనం కల్పించారు.



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ రవిగుప్తా

18 నుంచి అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ : డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ 16వ అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తోందని డీజీపీ రవిగుప్తా తెలిపారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 18 నుంచి 21 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో కలిసి డీజీపీ రవిగుప్తా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 440 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 24 జట్లు పోటీ పడతాయని, నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 745 మ్యాచ్‌లు జరుగుతాయని డీజీపీ వెల్లడించారు. అదనపు డీజీపీలు అభిలాషా బిస్త్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, విక్రమ్ సింగ్ మాన్, స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐజీ ఎం. రమేష్ ఇతర కీలక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భూదాన భూమిలో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి: సీపీఐ

నార్సింగ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వట్టినాగులపల్లి భూదాన భూమిలో జరిగిన రిజిస్ట్రేషన్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఐ కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూదాన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆయన కోరారు. గండిపేట మండలం, నార్సింగ్ మున్సిపాలిటీ వట్టినాగులపల్లిలోని సర్వే నెంబర్ 186, 187, 188, 189లలో దాదాపు 30 ఎకరాల అన్యాక్రాంతమైన భూదాన భూమిని పార్టీ మండల నాయకులతోపాటు సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా భూదాన భూమిలో జరిగిన రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. భూదాన భూమిని పొందిన రైతులను కొందరు రాజకీయ నాయకులు భయపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున ముడుపులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూమిగా మార్చరని ఆయన ఆరోపించారు. భూదాన భూముల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను అన్నింటిని కూడా వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



వట్టినాగులపల్లిలో అన్యాక్రాంతమైన భూముల వద్ద సీపీఐ నాయకులు నర్సింగ్‌రావు, యాదయ్య తదితరులు

కార్యక్రమంలో గండిపేట పార్టీ మండల కార్యదర్శి ఎం. బాబూరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేశ్, సీనియర్ నాయకులు బి. శంకరయ్య, స్వామి, రైతు కుటుంబాలకు సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలోని ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఆరాంఘర్ చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు మార్కెట్‌లో విక్రయానికి పెట్టారని, దానిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆ భూమిని కాపాడాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కాటేదాన్ సర్వేనెంబర్ 54లో నాలుగు ఎకరాల 18 గుంటలు, సర్వేనెంబర్ 55లో 4.24 ఎకరాలు, సర్వేనెంబర్ 56లో 7.18 ఎకరాలు కలిపి మొత్తం 16.20 ఎకరాలు భూమిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1964, సెప్టెంబర్ 4న జీవో 1406 ద్వారా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్‌కు ఇచ్చిందన్నారు. సర్వే నెంబర్ 55లో ఉన్న 4.24 ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తమదంటూ విక్రయించడానికి యత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆరాంఘర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడి, అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

బేస్‌మెంట్ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర కోశాధికారి కట్టా మల్లేశం

అఫ్జల్‌గంజ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సెట్ బ్యాక్ లేకుండా బహుళ అంతస్తు నిర్మిస్తూ, కురుమ సంఘం భవనం బేస్‌మెంట్ కూల్చివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర కోశాధికారి కట్టా మల్లేశం, బేగంబజార్, గోషామహల్ డివిజన్ల అధ్యక్షులు రమేశ్, చిన్నం మధుసూదన్ డిమాండ్ చేశారు. బుధవారం గోషామహల్ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ ఇంటి నంబర్ 15-4-211 కొన్నేళ్లుగా కురమ సంఘం భవనం ఉన్నదని అన్నారు. భవనానికి ఆనుకుని వీబీ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు అజయ్, సంజయ్ తమ స్థలంలో బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా తమ భవనానికి అనుకొని పిల్లర్లకు గుంతలు తీయడంతో పక్కనే ఉన్న కురమ సంఘం భవనం బెస్‌మెంట్ ఒక్కసారిగా కూలిపోయిందని తెలిపారు. ఏ క్షణంలోనైనా భవనం పూర్తిగా కూలిపోయే ప్రమాదముందని వారు తెలిపారు. తమ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బెస్‌మెంట్ కూల్చివేయడంతో కురుమ సంఘం ప్రతినిధులు ఇంటి నిర్మాణం చేపడుతున్న నిర్వాహకులు అజయ్, సంజయ్‌లను అడుగగా తమపై దౌర్జన్యానికి దిగుతూ, 'తాము ఇలాగే కడుతాం మాకు మున్సిపల్ ఉన్నతాధికారులు, రాజకీయంగా పలుకుబడి, స్థానికంగా పోలీసుల అండదండలు ఉన్నాయని, మీ దిక్కున్న చోట చెప్పుకోవాలని' బెదిరింపులకు



గోడలకు బీటలు, పగుళ్ల బారినపడిన కురుమ సంఘం భవనం

పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ ఏసీపీ సైదుద్దీన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్, రాష్ట్ర మంత్రులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. అప్పటికీ సదరు యజమానులు అజయ్, సంజయ్‌లు స్పందించి ముందుకు రాకపోతే తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం నేతృత్వంలో ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బేగంబజార్ కురుమ సంఘం జనరల్ సెక్రటరీ బెన్ని నర్సింహ, బండ అశోక్, వనమాల గోపాల్, బాలేశ్వర్, కురుమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పిస్తేనే పన్ను చెల్లిస్తాం!

● నాయకులు కాలనీలకు రావొద్దు

● సోషల్ మీడియాలో ప్రచారం

నార్సింగ్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీళ్లు లేవని, రోడ్లు బాగాలేవని, మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే పన్ను చెల్లిస్తామని, రాజకీయ నాయకులు మా ప్రాంతానికి రావద్దంటూ కొందరు వారం రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. రాజకీయ నాయకులు రాకూడదంటూ ఓ కాలనీలో పేపర్‌ను అతికించారు. సమస్యలపై లక్ష్మీప్రియ కాలనీ వాళ్లు మాత్రమే అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్పందిస్తూ మణికొండలోని కొన్నిచోట్ల మాత్రమే తాగునీటి సమస్య ఉందని, అంతా ఉందని



సోషల్ మీడియాలో పోస్టు..



ఓ కాలనీలో ఏర్పాటుచేసిన పోస్టర్

చేస్తున్న ప్రచారం నమ్మవద్దన్నారు. సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తే పరిష్కారమవుతాయని, ట్విట్టర్‌లో వస్తే పరిష్కారమవుతాయా అని ఆయన ప్రశ్నించారు. సమస్య ఉన్న ప్రాంత ప్రజలు అధికారులను, మున్సిపల్ చైర్మన్‌ను కలవాలని, అప్పటికీ పరిష్కారం కాకుంటే తనను కలవాలని సూచించారు.

పాఠశాలలో దర్వాజలు, కిటికీలకు మరమ్మతులు

రాజేంద్రనగర్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అధ్వానంగా మారిన దర్వాజలు, కిటికీలకు మరమ్మతులు చేశారు. పాఠశాలలో పది దర్వాజలు, 20 కిటికీలు శిథిలావస్థకు చేరుకున్నాయని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎర్ర కుమార స్వామి, సభ్యులు దుర్గానర్‌కు చెందిన కొత్వాల్ నరహరి దృష్టికి తీసుకు వెళ్లారు. వాటి మరమ్మతులకు నరహరి ఆర్థిక సాయం చేశాడు. బుధవారం పాఠశాలలో శిథిలావస్థకు చేరిన పది దర్వాజలు, 20 కిటికీలకు నయయువ యూత్ క్లబ్ సభ్యులు మరమ్మతులు చేశారు. సందర్భంగా ఎర్ర కుమార స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, పల్లపు జగన్ తదితరులు పాల్గొన్నారు.



కిటికీలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత టీడీపీదే:.. బక్కని

హిమాయత్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత టీడీపీదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు పేర్కొన్నారు. బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలంగాణ వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోషామహల్‌కు చెందిన సీనియర్ నాయకుడు కేడీ దినేశ్‌ను నియమించారు. ఆయనను మాజీ కార్పొరేటర్ రామ్‌నారాయణ్ యాదవ్, ఎ.శివరాజ్, ఊర్మిళ దేవీసింగ్, సోమశేఖర్ కురుమ, డాక్టర్ ప్రకాశ్‌శర్మ, నరేశ్‌జైన్, గురుదీప్‌సింగ్, రాధా కిషన్, డి.గోపాల్ రావు, శ్రీను తదితరులు ఘనంగా సత్కరించారు.



జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల7న బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాజ్‌భవన్ కార్యాలయంలో టీటీడీ లోకల్ బాడీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర ఆధ్వర్యంలో పలువురు గవర్నర్ తమిళిసైని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

రవీంద్రభారతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న శ్రీశక్తి మహిళా మండలి, ప్రతిఘటన మహిళాశక్తి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. బుధవారం రాష్ట్ర బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీశక్తి మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాధిక, ప్రతిఘటన మహిళాశక్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు శీలం సరస్వతీ తదితరులు

అఫ్జల్‌గంజ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ డిపో సిబ్బంది

రాజేంద్రనగర్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో మేనేజర్ ఎం.శ్రీనాథ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా పాల్మకుల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే స్కూల్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరీ హాజరయ్యారు. వివిధ రూట్లలో రోజూ ప్రయాణం చేస్తున్న 8 మంది మహిళా ప్రయాణికులను ఆహ్వానించి డిపో తరపున మహిళా ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మెకానికల్ ఇంజనీర్ నీలిమ, అసిస్టెంట్ మేనేజర్ రవి కుమార్, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గం హకీంపేట్‌లో..

కార్వాన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ నియోజకవర్గం హకీంపేట్‌లోని ఫ్లాక్ ఫంక్షన్‌హాల్లో బుధవారం ఉమెన్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వృత్తిని ఎంచుకోవాలని ఆయన సూచించారు.

పర్యాటక సంస్థలో...

హైదరాబాద్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ పర్యాటక సంస్థ రిజర్వేషన్ కేంద్ర కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యాటక సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బురాజమౌళి, మహిళా ఉద్యోగుల సంఘం కార్యదర్శి జ్యోతి, ప్రతినిధులు హైమ, రాజలక్ష్మి, రచన, ఆదిలక్ష్మి, సుకన్య, వర్ష, మోజుద్దీన్, శరత్, లావణ్య, రజిని తదితరులు పాల్గొన్నారు. టూరిజం ప్లాజాలో జరిగిన వేడుకల్లో శాంతి, మధుర, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.



గాంధీభవన్‌లో మహిళా దినోత్సవంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ.సదాలక్ష్మి తదితరులు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AzBtwsK లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు హజ్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

పహాడిషరీఫ్ మార్చ్ 6(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటి షాహీన్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ లాయిక్ తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయారు. హజ్ కమిటీలో 18 మంది సభ్యులను ప్రభుత్వం నియమించింది. గురువారం హజ్ హౌస్‌లో కమిటీలోని 18 మంది సభ్యులు నాంపల్లిలోని హజ్ హౌస్‌లో చైర్మన్ సమక్షంలో ప్రమాణం చేయనున్నారని మొహమ్మద్ లాయిక్ తెలిపారు. తనను హజ్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు సీఎం రేవంత్, ఫయీమ్ ఖురేషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోపీ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ గోపీ

మదీన, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాలాపత్తర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా రౌతు గోపీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న ఎన్.శ్రీశైలం మల్టీజోన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంగళవారం సాయంత్రం స్టేషన్‌కు వచ్చిన గోపీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గతంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన అనుభవం ఉన్నదన అన్నారు. శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

యాంటీ కరప్షన్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు



లక్ష్మణ్‌రావు

గోషామహల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యాంటీ కరప్షన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.ఆర్.లక్ష్మణ్ రావు నియమితులయ్యారు. బుధవారం యాంటీ కరప్షన్ ఫౌండేషన్ జాతీయ నాయకులు సంజీవ్‌శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా అవినీతి జరిగిన వెంటనే తనకు ఫిర్యాదు చేస్తే బాధితుల పక్షాన అండగా నిలిచి వారికి సత్వర న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

మదీన, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఫలక్‌నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నుకు వడ్డీపై 90 శాతం ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం తగదు

● బహదూర్‌పురా ఇన్‌చార్జి రాజ్‌కుమార్

మదీన, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం తగదని ఆ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో హితవు పలికారు. పాతబస్తీ పర్యటనకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో స్థానిక ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో మాట్లాడినంత మాత్రాన మజ్లిస్- కాంగ్రెస్ పార్టీల మధ్య ఒప్పందం జరిగిందనడం మందబుద్దికాదన్నారు. ఈనెల 5న అరుంధతి నగర్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తాను నిర్మిస్తున్న ఓవైసీ ఎక్సలెన్స్ స్కూల్‌కు ఆహ్వానించి అక్కడి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. కొంతమంది కావాలని మజ్లిస్, కాంగ్రెస్ పార్టీల మధ్యఒప్పందం జరిగిందని అడ్డగోలు ప్రచారం చేస్తున్నారన్నారు, ఇది తగదన్నారు. నిరాధారమైన విషయాలను ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

ఫహీమ్ హత్య కేసులో ఐదుగురి అరెస్ట్?

రాజేంద్రనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ చింతల్‌మెట్, ఎంఎం పహడీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన పెయింటర్ ఫహీమ్(20) హత్య కేసులో అత్తాపూర్ పోలీసులు ఐదుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఫహీమ్ హత్యకు పాతకక్షలే కారణమని తెలుస్తోంది. ఫహీమ్ సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు గతంలో ఫయీమ్‌తో గొడవపడ్డ వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు మాత్రం ఫహీమ్ హత్య కేసులో నిందితులను పట్టుకోలేదని, త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. షాహీన్‌నగర్‌కు చెందిన ఫహీమ్‌కు నెల రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన కొందరు యువకులతో గొడవ జరిగి పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగినట్లు సమాచారం. గొడవను దృష్టిలో పెట్టుకున్న యువకులు ఫహీమ్‌ను ఎంఎం పహడీలోని దర్గా వద్దకు పిలిపించి దారుణంగా హత్య చేసినట్లు తెలిసింది.

యువకుడి అదృశ్యం

మదీన, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైయ్యాడు. ఈ ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బండ్లగూడ ప్రాంతానికి చెందిన లత, పురుషోత్తమ్‌ల కుమారుడు హేమంత్(24) ఈనెల 4వ తేదీ సాయంత్రం ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం కుటుంబ సభ్యులు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడికి మతిస్థిమితం సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 17.5 లక్షల నగదు పట్టివేత

అఫ్జల్‌గంజ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గోషామహల్‌లో షాహినాథ్ గంజ్ పోలీసులు బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.17.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. గోషామహల్ అలస్కా ఎక్స్‌రోడ్ వద్ద పోచారం అన్నోజిగూడ షాహినగర్‌కు చెందిన విక్రమ్‌గౌడ్(38) ద్విచక్ర వాహనంపై రూ.17.5 లక్షలు తీసుకువెళ్తున్నాడు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనం తనిఖీ చేయగా నగదు పట్టుబడింది. నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడం, వివరాలు సరిగా చెప్పకపోవడంతో నగదు స్వాధీనం చేసుకొని, విక్రమ్‌గౌడ్‌పై కేసు నమోదుచేసినట్లు షాహినాత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బాబుచౌహాన్ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లు.. సీనియర్ అసిస్టెంట్‌పై వేటు..?

● ఫలక్‌నుమాలో మూడో రోజూ రికార్డుల పరిశీలన



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసింహారెడ్డి, శ్రవణ్

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలో నాన్ అవైలిటీ పత్రాలు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేసినట్టు గుర్తించడంతో అక్కడి సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణపై వేటు పడినట్టు తెలిసింది. కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు జోనల్ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారని సమాచారం. నకిలీ సర్టిఫికెట్ల జారీపై ఫిర్యాదుల నేపథ్యంలో మూడు రోజులుగా కేంద్ర కార్యాలయంలోని అధికారులు.. ఫలక్‌నుమా సర్కిల్ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలిస్తున్నారు. జారీ చేసిన సర్టిఫికెట్ల ఆధారంగా ఆస్పత్రుల్లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఫేక్ సర్టిఫికెట్లు జారీ అయినట్టు కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో సదరు అధికారిని సస్పెండ్ చేయాలని రోనాల్డ్ రోస్ ఆదేశించారని ఓ అధికారి తెలిపారు.

ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలి : బీజేపీ

జీహెచ్‌ఎంసీలో నకిలీ పత్రాల జారీ నిత్యకృత్యంగా మారిందని, గతంలోనూ 23 వేలకుపైగా సర్టిఫికెట్లు ఇచ్చారని, ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోకుండా కిందిస్థాయి సిబ్బందిని బలి చేయడం వల్లే అక్రమాలు ఆగడం లేదని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, సురేఖ అన్నారు. పై అధికారుల సహకారం లేకుండా నకిలీ సర్టిఫికెట్ల జారీ సాధ్యం కాదని, ఈ తతంగంపైన సమగ్ర విచారణ జరిపి అసలైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్‌లకు వినతిపత్రం అందజేశారు.

పోలీసుల ఎదుట హాజరైన సినీనటి సౌమ్యజాను



సౌమ్యజాను

బంజారాహిల్స్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుపై దాడి చేయడంతోపాటు అసభ్యపదజాలంతో దూషించిన సినీనటి సౌమ్యజాను అలియాస్ షేక్ జాన్‌బీ బుధవారం బంజారాహిల్స్ పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఫిబ్రవరి 24న బంజారాహిల్స్ రోడ్డు నెంబరు.12లో సౌమ్యజాను జాగ్వార్ కారును రాంగ్‌రూట్‌లో నడుపుతూ వెళ్లారు. గమనించిన హోంగార్డు గొడుగు విష్ణేష్ అడ్డుకోగా కారు నుంచి దిగిన నటి అతడిని కొట్టడంతోపాటు సెల్‌ఫోన్ లాక్కొని నేలకు కొట్టింది. దుర్భాషలాడుతూ హోంగార్డు వేసుకున్న కోట్‌ను చించేసింది. దీంతో విష్ణేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు 332, 353, 427, 504, 279 ఐపీసీతో పాటు మోటార్ వెహికల్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నటి సౌమ్య హైకోర్టును ఆశ్రయించారు. తనపై పెట్టిన కేసులన్నీ ఏడు సంవత్సరాల్లోపు శిక్ష పడేవే అని, 41 సీఆర్‌పీసీ కింద నోటీసు ఇచ్చి విచారణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆమె కోరారు. ఈ మేరకు 41 సీఆర్‌పీసీ ఇచ్చి విచారణ చేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నెల 11లోపు విచారణాధికారి ఎదుట హాజరుకావాలని సౌమ్యకు సూచించింది. ఈ నేపథ్యంలో బుధవారం సౌమ్య తన తల్లితోపాటు ఇద్దరు న్యాయవాదులతో కలిసి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. విచారణాధికారి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నోటీసు ఇచ్చి పంపించేశారు.



పురస్కారగ్రహీతలతో మధుసూదనాచారి

చట్టసభల్లో ప్రాధాన్యం పెరగాలి

చిక్కడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలని శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కె.లలిత, ఎస్.శ్రీమణి, టి.శోభారాణిలను సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భమిడి ఉష, తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో ఉపాసన, తదితరులు

అన్నిరంగాల్లో గుర్తింపు అభినందనీయం

రాయదుర్గం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చూపిస్తూ తగిన గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమని ఉపాసన కామినేని అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని టీ-హబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాసన కామినేని, శిల్పారెడ్డి, టీ-హబ్ సీఈవో ఎంఎస్‌ఆర్, పూర్వ విద్యార్థుల సహ వ్యవస్థాపకురాలు అదితి ఆర్యకోటక్, హెచ్‌ఎస్‌బీసీ ఎండ మమతమాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఉమెన్ ఇంపాక్ట్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మహ్మద్ ఫయాజ్, లీనా, ప్రీతం, డాక్టర్ మైషాగ్రే, శాండీ గ్రేవాల్, పలువురు పాల్గొన్నారు.

మహిళలకు ప్రధాని మోదీ సముచిత స్థానం

కేంద్ర మంత్రి దర్శన్ జిర్దోస్ విక్రం

గచ్చిబౌలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని కేంద్ర రైల్వే, జౌళి సహాయక మంత్రి దర్శన్ జిర్దోస్ విక్రం అన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించిన గొప్పనాయకుడు మోదీ అని ఆమె కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొండాపూర్ మసీద్‌బండలోని కార్యాలయంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల శక్తి వందన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ హౌస్‌లో నారీశక్తివందన్ అతిథి నిలయం, మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని, మంత్రిత్వ శాఖలను ఎక్కువ శాతం మహిళలకే ఇచ్చిన ఘనత మోదీకే దక్కుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కిసాన్ సమ్మాన్ నిధి కింద 21కోట్ల మంది రైతుల ఖాతాలో రూ.6వేలు జమ చేసిన ఘనత మోదీదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇలాంటి సంక్షేమ ఫలాలు అందించలేదన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే 2040 నాటికి భారతదేశం నంబర్‌వన్ దేశంగా మోదీ సంకల్పించారన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని, అందుకే ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కరరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, ప్రధాన కార్యదర్శి సమత, రాష్ట్ర కార్యదర్శి శ్రీలత, కన్వీనర్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మహిళలను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి దర్శన్ జిర్దోస్ విక్రం, మాజీ ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్

మహిళగా జన్మించడం అదృష్టం : తమిళిసై



మహిళా దినోత్సవంలో గవర్నర్ తమిళిసై, పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, ప్రముఖులు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళగా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మేడ్చల్ జిల్లా, జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్‌పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో రాచకొండ పోలీస్‌కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తన జీవితంలో రంగు, ఎత్తు, ప్రతిభను ప్రదర్శించడంలో ఎదురైన అనుభవాలు వివరించారు. మహిళలకు నిబద్ధత ఎక్కువని, అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తుండడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, పోలీస్ అకాడమి డైరెక్టర్ ఐపీఎస్ అభిలాష బిస్త్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, అడ్మిన్ డీసీపీ ఇందిర, ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషావిశ్వనాథ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్, బాలీవుడ్ నటి తనాజ్ ఇరానీ, ఫ్యాషన్‌డిజైనర్ శిల్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూడవ స్టాండింగ్ కమిటీ.. తొలి సమావేశం..!

● 14 అంశాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన జీహెచ్‌ఎంసీ మూడవ స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం బుధవారం జరిగింది. నూతన సభ్యులకు స్వాగతం పలికిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వారిని అధికారులకు పరిచయం చేశారు. అనంతరం ఎజెండాపై చర్చించిన సభ్యులు 14 అంశాలను ఆమోదించారు. స్టాండింగ్ కమిటీ తదుపరి సమావేశం బుధవారం, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రతీ గురువారం నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి సమావేశంలోనే పారిశుధ్య, ప్రకటనల విభాగాలపై అడ్‌హక్ కమిటీల ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ రోనాల్డ్‌రోస్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఆమోదించిన ప్రధానాంశాలు..

- గ్రేటర్‌లోని భవనాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల వ్యవస్థ, నాలాలు తదితర యుటిలిటీస్‌ను జీఐఎస్ మ్యాపింగ్ చేయాలి. తద్వారా కచ్చితమైన సమాచారం ఉండడంతోపాటు.. ఎన్ని భవనాల నుంచి ఆస్తిపన్ను వసూలవుతుంది..? పన్ను పరిధిలోకి రాని నిర్మాణాలెన్ని..? ఏ కేటగిరిలో పన్ను చెల్లిస్తున్నారు..? దేని కోసం వినియోగిస్తున్నారు..? అన్న వివరాలు తెలియనున్నాయి.
- కూకట్‌పల్లిలోని ఎల్లమ్మచెరువు నుంచి రూ.2.74 కోట్లతో గతంలో ప్రతిపాదించిన 1200ఎంఎం డయా పైపులైన్‌కు బదులు అదే వ్యయంతో 1600 ఎంఎం డయా పైపులైన్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు.
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని పలు చెరువుల వద్ద సీఎస్‌ఆర్ కింద అభివృద్ధి పనులు చేసే గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.
- ఎల్‌బీనగర్‌లోని బైరామల్‌గూడ చెరువు నుంచి సరూర్‌నగర్ చెరువు వరకు రూ.5.88 కోట్లతో ప్రతిపాదించిన వరదనీటికాల్వ నిర్మాణానికి రూ.10 లక్షలు అదనంగా మంజూరు చేయాలి.

పారిశుధ్యం, ప్రకటనల విభాగంపై..

అడ్‌హక్ కమిటీల ఏర్పాటు

- కౌన్సిల్ తీర్మానం నేపథ్యంలో ప్రతిపాదన
- ఆమోదించిన స్టాండింగ్ కమిటీ
- ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు
- చైర్‌పర్సన్‌గా మేయర్
- సమగ్ర పరిశీలన అనంతరం నివేదిక

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలోని పారిశుధ్య నిర్వహణ, ప్రకటనల విభాగంలో అవినీతిపై ఎట్టకేలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. అన్ని పార్టీల సభ్యులతో కూడిన అడ్‌హక్ కమిటీలను బుధవారం స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. మేయర్ చైర్‌పర్సన్‌గా ఉన్న రెండు కమిటీల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంల నుంచి ఇద్దరు చొప్పున కార్పొరేటర్లు సభ్యులుగా ఉన్నారు. జీఓ.68 పేరిట 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ప్రకటన బోర్డులు, హోర్డింగ్‌లపై నిషేధం, బస్‌షెల్టర్లు, ఇతర ప్రాంతాల్లో ప్రకటన బోర్డులను యాడ్ ఏజెన్సీలకు కేటాయించడంలో అక్రమాలు జరిగాయంటూ గత నెల 19, 20 తేదీల్లో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. యేటా జీహెచ్‌ఎంసీకి రూ.100 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా.. అధికారులు, యాడ్ ఏజెన్సీలు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతుండడంతో సంస్థకు నష్టం జరుగుతున్నదని ఆరోపించారు. పారిశుధ్య నిర్వహణలోనూ అవినీతి జరుగుతోందని మండిపడ్డారు. స్వీపింగ్, ఇంటింటి చెత్త సేకరణ, రహదారులపై చెత్త తొలగింపు, స్వీపింగ్ యంత్రాల పనితీరు సరిగా లేదన్నారు. యేటా రూ.400 కోట్ల వరకు ఖర్చు చేస్తోన్నా.. నగరంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నదని, ఈ పరిస్థితి మారాలంటే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో రెండు విభాగాలపై కమిటీలు వేయాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగానే అడ్‌హక్ కమిటీల ఏర్పాటును కమిషనర్ ప్రతిపాదించగా స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీకి సమాచారమిచ్చేందుకు ఆయా విభాగాల అదనపు కమిషనర్లు కోఆర్డినేటర్లు/కన్వీనర్లను నియమించాలని కమిషనర్ సూచించారు. సమగ్ర పరిశీలన అనంతరం కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలుంటాయి.

పారిశుధ్య విభాగం కమిటీ

చైర్‌పర్సన్ - గద్వాల్ విజయలక్ష్మి, మేయర్
బీఆర్‌ఎస్ - రావుల శేషగిరిరావు, సామల హేమ
కాంగ్రెస్ - ఎం.రజిత, వి.జగదీశ్వర్‌గౌడ్
బీజేపీ- డాక్టర్ బి.సురేఖ, పూరపల్లి శ్రవణ్
ఎంఐఎం- సయ్యద్ సోహైల్ ఖాద్రీ, డాక్టర్ ఆయేషా హుమేరా

ప్రకటనల విభాగం కమిటీ

చైర్‌పర్సన్ - గద్వాల్ విజయలక్ష్మి, మేయర్
బీఆర్‌ఎస్ - వి.సింధూఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్‌యాదవ్
కాంగ్రెస్- దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పి.విజయారెడ్డి
బీజేపీ - వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి
ఎంఐఎం-సయ్యద్ మినాజుద్దీన్, బతాజబీన్

బీఆర్‌ఎస్ నిరసన

(5వ పేజీ తరువాయి)

ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పేద కుటుంబాలను ఇబ్బందులు పెట్టవద్దనే తమ ప్రభుత్వం పేదళ్ల కాలంలో ఎల్‌ఆర్‌ఎస్ జోలికి వెళ్లలేదని తెలిపారు. అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీని మరిచి పేదలపై కాంగ్రెస్ ఆర్థిక భారం మోపేందుకు కుట్రలు చేస్తోందన్నారు అనంతరం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఐదుగురు సభ్యులతో కలిసి హెచ్‌ఎండీఏ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు చల్లని వాటర్‌బాటిళ్లను అందజేసి ఎల్‌ఆర్‌ఎస్‌ను వెంటనే రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీరుపై నిరసన

కుత్బుల్లాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో డబ్బు వసూలు చేసి నిరుపేదలను దోచుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనా? అని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులు బుధవారం ఎల్‌ఆర్‌ఎస్‌పై నిరసన తెలిపారు. కాంగ్రెస్ అంటే కష్టాలు.. కష్టాలు అంటేనే కాంగ్రెస్ అనేలా పాలన సాగుతోందన్నారు. 100 రోజుల పాలన పూర్తి కావడానికి ఇంకా వారం రోజులు మిగిలి ఉందని, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని ఆరోపించారు. అనంతరం భూ క్రమబద్ధీకరణను ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా చేపట్టాలని కోరుతూ కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వినర్సింహకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగుతావా?

● మంత్రి పొన్నంపై గ్రేటర్ నేతల గరం

హైదరాబాద్ సిటీ, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగుతావా.? అంటూ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌పై గ్రేటర్ కాంగ్రెస్ నేతలు గరం గరమయ్యారు. ఫిరోజ్ ఖాన్, అజారుద్దీన్ ఆయనతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గ్రేటర్ కాంగ్రెస్ నేతల సమావేశం డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి అధ్యక్షతన గాంధీభవన్‌లో బుధవారం జరిగింది. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి మంత్రి పొన్నం హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గెలుపుదిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలు, కార్యకర్తలతో చర్చించారు. గురువారం నుంచి మూడు రోజులపాటు నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తుండడంతో ఆయా అంశాలను వివరించారు. సమావేశం అనంతరం రెండు రోజుల క్రితం ఉప్పుగూడలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీతో కలిసి పొన్నం టీ తాగిన అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ప్రారంభోత్సవం రోజున అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం ఫొటో లేకపోవడంపై కాంగ్రెస్ నేతలు అప్పటికే గుర్రుగా ఉన్నారు. ఈక్రమంలో అక్బరుద్దీన్‌తో కలిసి టీ తాగడాన్ని తప్పుబడుతూ గాంధీభవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మంత్రి పొన్నంపై ఫిరోజ్‌ఖాన్, అజారుద్దీన్ ఆక్షేపణ వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివాదం పెద్దదవుతున్న క్రమంలో సీనియర్లు కలగజేసుకుని సర్దిచెప్పారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమెన్ ఇన్ స్టెమ్ స్కాలర్‌షిప్‌లు

● ప్రారంభించిన బ్రిటిష్ కౌన్సిల్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యూకేలో సైన్స్, సంబంధిత కోర్సులు చేయాలనుకునే మహిళల కోసం ప్రత్యేకంగా స్కాలర్‌షిప్‌లను తీసుకువచ్చింది బ్రిటిష్ కౌన్సిల్. యూకేలోని క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం, ఆంగ్లియా రస్కిన్, గ్రీన్‌విచ్, సౌతాంప్టన్‌తో పాటుగా కోవెంట్రీ విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో 25 స్కాలర్‌షిప్‌లను ఇండియా, దక్షిణాసియాలోని మహిళల కోసం రిజర్వ్ చేశామని బ్రిటిష్ కౌన్సిల్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ స్కాలర్స్ డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్స్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ వంటి కోర్సులను చేయవచ్చు. బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రితికా చందా పర్రుక్ ఎంబీఈ మాట్లాడుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను సైన్స్ ద్వారా మాత్రమే పరిష్కరించవచ్చన్నారు. ఆయా యూనివర్శిటీలలో నిర్దిష్ట గడువు సహా ఇతర సమాచారం కోసం https://www.britishcouncil.in/study-uk/scholarships/womeninstem-scholarships చూడవచ్చు.

పేట్‌బషీరాబాద్ స్థలాన్ని అప్పగించేందుకు చొరవ తీసుకోండి

మీడియా అకాడమీ చైర్మన్‌కు వినతి



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌజింగ్ సొసైటీకి పేట్‌బషీరాబాద్‌లో కేటాయించిన 38 ఎకరాలను అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ తీసుకోవాలని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి సొసైటీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. నూతనంగా ఎన్నికైన సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, సీఈవో వంశీశ్రీనివాస్, డైరెక్టర్లు రమణరావు, అశోక్‌రెడ్డి బుధవారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పేట్‌బషీరాబాద్ భూమి అప్పగింతకు సంబంధించి ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. సంబంధిత జీవో కాపీలు, సుప్రీంకోర్టు ప్రతులను అందజేశారు. సొసైటీకి కేటాయించిన స్థలం మొత్తాన్ని సొసైటీకి స్వాధీనం చేయాలని కోరారు. తమ విజ్ఞప్తికి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారని సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు.

నాలాలపై సేఫ్టీ ఆడిట్

(5వ పేజీ తరువాయి)

టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. ఖైరతాబాద్ జోన్‌లోని 250.70 కిలోమీటర్ల వరదనీటి ప్రవాహ వ్యవస్థపై సర్వే చేయనుండగా, ఇందులో 25.68 కి.మీల మేర మేజర్ నాలాలున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని నాలాలు, వరద నీటి కాలువల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా ప్రమాదవశాత్తు వాటిలో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పలు ప్రాంతాల్లో చెత్తా చెదారమూ నాలాల్లో వేస్తుండడంతో ప్రవాహ వ్యవస్థకు అవరోధంగా మారి పక్కనున్న కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా నాలాలు, వరద నీటి కాలువల సేఫ్టీ ఆడిట్ నిర్వహించనున్నారు. ఎంపికయ్యే ఏజెన్సీ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో నడుచుకుంటూ తిరిగి క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించాల్సి ఉంటుంది. రక్షణా చర్యలున్నాయా, ఎక్కడైనా మనుషులు పడిపోయే ప్రమాదముందా, ప్రవాహం ఏ స్థాయిలో ఉంది, నాలాల పక్కన వీధి దీపాలున్నాయా..? ప్రమాదకర ఏరియాలను గుర్తిస్తూ, ఏ తరహా చర్యలు తీసుకోవాలనేది నివేదికలో సూచించాల్సి ఉంటుంది. కిలోమీటర్‌కు రూ.23,400ను అప్‌సెట్ ప్రైస్‌గా నిర్ణయించారు. 90 రోజుల్లో సర్వేకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

మహాశివరాత్రికి 340 ప్రత్యేక బస్సులు

(5వ పేజీ తరువాయి)

ఈసీఐఎల్, కుషాయిగూడ, కీసర విలేజ్ పాయింట్స్ నుంచి కీసరగుట్టకు నడిపే స్పెషల్ ఆపరేషన్స్ ఇన్‌చార్జిగా కాచిగూడ డీఎం (9959226145), రాజేంద్రనగర్ (9959226147) డీఎంలను నియమించారు. రెజిమెంటల్ బజార్, సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కీసరగుట్టకు నడిచే బస్సులకు కంటోన్మెంట్ డిపో మేనేజర్ (9959226143), అమ్ముగూడ, యాప్రాల్, వెంకటాపురం పాయింట్ల నుంచి కీసరగుట్టకు హకీంపేట డీఎం (9959226144), ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి కీసరగుట్టకు నడిపే బస్సులకు చంగిచర్ల డీఎం (7893088433) ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు.

కీసరగుట్టలో విచారణ కేంద్రం


గ్రేటర్‌తో పాటు పలుప్రాంతాల నుంచి కీసరగుట్టకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ కీసరగుట్టలో ఎంక్వైరీ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. మూడు షిఫ్ట్‌ల్లో ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు సిబ్బందిని నియమించనుంది. ప్రత్యేక బస్సుల వివరాల కోసం కోఠి (9959226160), రేతిఫైల్ బస్‌స్టేషన్ (9959226154)లలోని కమ్యూనికేషన్ సెంటర్లలో సంప్రదించవచ్చని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు.

గాంధీలో ఎంసీహెచ్ భవనం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సమస్యలున్నవారు వస్తుంటారని తెలిపారు. గర్భిణులకు ఇతర సమస్యలు ఉత్పన్నమైతే అత్యవసర వైద్య సహాయం కోసం గాంధీ ప్రధాన భవనాలకు త్వరితగతిన తీసుకెళ్లేలా మాతాశిశు సంరక్షణ భవనానికి అనుసంధానంగా స్కైవాక్ వంతెనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రేపు మహిళా దినోత్సవం



అత్తాకోడళ్లే.. కానీ స్నేహితుల్లా ఉంటారు. "మా అత్తమ్మ మా ఉమ్మడి కుటుంబానికి ఇరుసు" అంటుంది కోడలు. "ఈ తరం వాళ్లను చూసి మేము నేర్చుకోవాలి.. ఈ వయస్సులో నన్ను వాణిజ్యవేత్తను చేసింది మా కోడలే" అంటారు ఆ అత్త. ఆ అత్తా కోడళ్లు ఎవరో కాదు... మెగాస్టార్ చిరంజీవి సతీమణి **సురేఖ**, కోడలు **ఉపాసన**. వాళ్లిద్దరి కబుర్లు వింటుంటే గంటలు గడిచిపోతూ ఉంటాయి. తాజాగా వారిద్దరూ కలిసి రెడీ టూ ఈట్ ఫుడ్ ప్రొడక్ట్స్ బిజినెస్ ప్రారంభించారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ఆ విశేషాలతో పాటు తమ అనుబంధం గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా పంచుకున్నారు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

> కొణిదెల ఫ్యామిలీ వారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పెరుగన్నం తింటారు. నేను, చరణ్- ఇంగ్లాండ్‌లో ఒక పెద్ద రెస్టారెంట్‌కు వెళ్లాం. రాత్రి తిరిగి వచ్చేసిన తర్వాత - "పెరుగన్నం ఉందా?" అని అడిగాడు. తనకి రసం అంటే చాలా ఇష్టం.
>
> - ఉపాసన

తినేవాళ్లకు పెట్టడంలో ఉండే
తృప్తే వేరు..!

మెగాస్టార్ సతీమణిగా మీరు తెలుగు ప్రజలకు సుపరిచితులు. కానీ మీరు ఎప్పుడూ బయటకు రాలేదు. తొలిసారి బయటకు వచ్చి- 'అత్తమ్మాస్ కిచెన్' ప్రారంభించటం ఎలా అనిపిస్తోంది?

సురేఖ: కొత్తగా ఉంది. మా అవసరాలకు తగినంత.. తగినట్లుగా ఆహారాన్ని తయారుచేసుకోవటం.. స్నేహితులకు పంచటం మాత్రమే మాకు తెలుసు. కానీ నాకు తెలిసినవన్నీ అందరికి పంచితే బావుండుననే ఆలోచన చాలాకాలంగా ఉంది. నేను, ఆయన (చిరంజీవి) అనేక దేశాలకు వెళ్తా ఉంటాం. మాకు హాలిడే అంటే- సైట్ సీయింగ్ కాదు. ఒక చోట ప్రశాంతంగా ఉండటం, వండుకోవటం, తినటం. అయితే వేరే దేశాలకు వెళ్లినప్పుడు ఒకటి రెండు రోజుల కన్నా- ఎక్కువ బయట తినలేం. ఇంట్లో వండిన ఆహారం తినాలనిపిస్తుంది. గతంలో ఒకటి రెండుసార్లు చాలా ఇబ్బంది పడ్డాం. అప్పటి నుంచి... విదేశాలకు వెళ్లాలంటే- ప్రీమిక్స్‌లు తయారుచేసి పట్టుకెళ్లేదాన్ని. వాటిని వండుకొనేవాళ్లం. ఆస్కార్స్ సమయంలో ఉపాసన గర్భవతి. తనకు విదేశాలలో ఆరోగ్యకరమైన ఆహారం దొరకకపోవచ్చు కాబట్టి- ఇక్కడి నుంచి రకరకాల రెడీ మిక్స్‌లు చేసి ఇచ్చాను. ఉపాసన వాటిని బాగా ఎంజాయ్ చేసింది. ఆ సమయంలో తనుకు పుట్టిన ఆలోచనే- ఈ 'అత్తమ్మాస్ కిచెన్'. తన ఉద్దేశంలో ఇది ప్రజలందరికీ మేలు చేసే ఒక మంచి వ్యాపార అవకాశం.



> "మా అత్తయ్యగారు అంజనాదేవి గొప్ప కుక్. ఆవిడ దగ్గర నుంచి నేను వంట నేర్చుకున్నా. మామయ్య వెంకటరావు గారికి నాన్‌వెజ్ చాలా ఇష్టం. శనివారం నాన్‌వెజ్ వండేవారు కాదుట. అందువల్ల ఆ ఫ్లేవర్ వచ్చేలా అత్తయ్య వెజిటేరియన్ వంటలు వండేవారు. ఐదారు రకాల ఆకు కూరలతో అత్తయ్య బిర్యానీ చేస్తారు. చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి బిర్యానీ ఎవరూ చేయటం నేను చూడలేదు."

తను బిజినెస్ ఫ్యామిలీ నుంచి వచ్చింది. దీన్నొక అవకాశంగా భావించింది. ఈ విషయం తను చెప్పినప్పుడు నేను అంగీకరించా. ఎందుకంటే- ఈ తరం బాగా బిజీ అయిపోయింది. అనేక మంది ట్రావెల్ చేస్తూ ఉంటారు. ఉద్యోగాలు చేసి వచ్చి వండుకోలేని వాళ్లు ఉంటారు. అందుకే ఈ వయస్సులో- లేటుగా అయినా- వ్యాపారవేత్త అవ్వాల్సి వచ్చింది.

మీకు చిన్నప్పటి నుంచి బాగా వంట చేయటం వచ్చా?

లేదండి. మా అమ్మ వాళ్లింట్లో నేనే చిన్నదాన్ని. కూరలు తరగటం లాంటి చిన్న చిన్న సాయాలు చేయటం తప్ప వండటం రాదు. పెళ్లి అయిన తర్వాత అన్నీ నేర్చుకున్నా. ఇక్కడ మీకో రహస్యం చెబుతా. వంటలో నాకు గురువు- మా ఆయనే. మామయ్యగారు భోజన ప్రియులు. మా అత్తయ్యగారు చాలా బాగా వండుతారు. దాంతో ఆయన చిన్నప్పుడు రకరకాల వంటలు వండేవారట. మాకు పెళ్లైన కొత్తల్లో- అత్తమ్మలాగ నేను కూడా వంటచేస్తే బావుండునని ఆయనకు ఉండేది. కానీ నాకు రాదు. కాపురానికి వెళ్లిన తర్వాత- ఒక రోజు ఉప్మా చేశా. ఉండలు ఉండలుగా వచ్చింది. అప్పటిదాకా ఉప్మా అలాగే చేస్తారనుకొనేదాన్ని. ఆ తర్వాత ఆయనే నాకు ఉప్మా చేయటం, ఇతర వంటలు వండటం నేర్పారు. మా ఇంట్లో ఉప్మా- ఇప్పుడు చాలా ఫేమస్. చాలా మంది అడిగి మరీ తింటారు.

మరి ఈ ప్రీకుక్డ్ వంటలు ఎప్పుడు మొదలుపెట్టారు?

మా పెళ్లైన రెండు నెలలకు- '47 డేస్' అనే సినిమా షూటింగ్ కోసం పారిస్ వెళ్లాం. అక్కడ సరైన ఆహారం లభించేది కాదు. వంట చేద్దామంటే- వంట సామాను దొరికేది కాదు. అది నాకొక పెద్ద పాఠం. ఆ తర్వాత ఎక్కడికైనా వెళ్లాలంటే- ముందుగానే రకరకాల ప్రీకుక్డ్ వంటలు తయారుచేసుకొని వెళ్లేదాన్ని. ఒక స్టవ్, కొన్ని గిన్నెలు- ఉంటే చాలు. వండుకొని తినే వాళ్లం.

మీది ఉమ్మడి కుటుంబం కదా.. అందరూ భోజన ప్రియులేనా?

ఆయన (చిరంజీవి) ఏది పెట్టినా తినేస్తారు. చివరకు పచ్చడీ అన్నమైనా తినేస్తారు. నాగబాబుకు మాత్రం అన్ని రుచులు కావాలి. కళ్యాణ్‌బాబుది వాళ్ల



> ఆయన పచ్చడితోనైనా అన్నం తినేస్తారు. రకరకాల వంటలు తినాలని ఉండదు. కానీ ఉప్పు తక్కువైతే మాత్రం చెబుతారు. ఈ సందర్భంలో నాకు ఒక సంఘటన గుర్తుకొస్తోంది. మేము మద్రాసులో కాపురం ఉండే సమయంలో ఆయన షూటింగ్స్‌లో బాగా బిజీగా ఉండేవారు. ప్రసాద్‌బాబు, ఈయన కలిసి ఒక సినిమా చేస్తున్నారు. ఒక రోజు ఇంట్లో కూరలు లేకపోతే- పప్పుచారు పెట్టి, వడియాలు వేయించా. ఈయన అవి తినేసి షూటింగ్‌కు వెళ్లిపోయారు. సాయంత్రం వచ్చిన తర్వాత- "ప్రసాద్‌బాబు షూటింగ్‌కి వచ్చి, వెళ్లిపోయాడు" అని చెప్పారు. దానికి కారణం- ఆ రోజు వాళ్లింట్లో జరిగిన గొడవట. అది కూడా కోడిగుడ్ల గురించి.ప్రసాద్‌బాబు వాళ్లావిడ కోడిగుడ్ల పులుసు పెడితే- అందులో రెండు గుడ్లే వేసిందని గొడవ చేసి ప్లేటు విసిరి షూటింగ్‌కి వచ్చాడట. వచ్చి ఈయనని ఏం తిన్నావని అడిగితే- పప్పుచారు.. వడియాలు అని చెప్పారట. ఈయన ఇంత సింపుల్‌గా ఉండటం చూసి, గిల్టీగా అనిపించి. భార్యకు సారీ చెప్పటానికి షూటింగ్ వదిలి వెళ్లిపోయారట. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

అన్నయ్య వరసే! ఎటువంటి డిమాండ్లూ ఉండవు. ఏది పెట్టినా తినేస్తాడు. ఇక్కడ ఒక విషయం తప్పనిసరిగా చెప్పాలి. మామయ్యగారు చక్కగా తినేవారు. ఆయన తినటం చూస్తే- విగిలిన వాళ్లకు కూడా తినాలనిపిస్తుంది. అదొక కళ.. అమ్మ నాకు చిన్నప్పటి నుంచి- అందరికీ పెట్టడం నేర్పింది. ఎవరైనా తృప్తిగా తింటుంటే ఇంకా పెట్టాలనిపిస్తూ ఉంటుంది. తినేవాళ్లకు పెట్టడంలో లభించే తృప్తి వేరు!

ఉపాసన... మీరు వంట చేస్తారా?

ఉపాసన: కొన్నిసార్లు. పెళ్లికాక ముందు వంటలు రావు. పెళ్లి అయిన



తర్వాత అత్తమ్మ దగ్గర వంటలు నేర్చుకున్నా!

మీ అత్తయ్య నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?

వంటలు నేర్చుకోవటం ఒకటి. కుటుంబ విలువలు నేర్చుకోవటం మరొకటి. అత్తమ్మ- ఈ రోజుకి ఇంట్లో అందరూ తింటే తప్ప తను తినదు. నాకు పెళ్లైన కొత్తల్లో తనని చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉండేది. ఆ తర్వాత ఒక పెద్ద ఉమ్మడి కుటుంబానికి తాను ఒక ఇరుసు ఎందుకైందో నాకు అర్థమయింది. అంతే కాదు... తన వడ్డన కూడా చాలా అప్యాయంగా ఉంటుంది. నాకు ఒక పద్ధతిగా తినటం తనే నేర్పించింది. ఒకప్పుడు నేను ముందు పెరుగు తిని- ఆ తర్వాత మిగిలినవి తినేదాన్ని. కానీ నాకు అత్తమ్మ- ముందు పప్పు, ఆ తర్వాత కూర, ఆ తర్వాత పచ్చడి, ఆ తర్వాత పెరుగు తినటం నేర్పించింది. ఇది ఎందుకు చెబుతున్నానంటే- మన ముందు తరం వారిలో ఉన్న మంచిని నేర్చుకోవాలి. మొత్తం కుటుంబంలో ఉన్న చిన్నా పెద్ద- అందరూ ఏం తింటారో, ఎవరికి ఏది ఇష్టమో అత్తమ్మకు తెలుసు. మూడు రోజుల క్రితం- కళ్యాణ్‌గారు ఇంటికి వచ్చారు. వస్తారని తెలిసి ఆయనకు ఇష్టమైన బిర్యానీ చేయించారు. ప్రతి రోజు ఏదో ఒక వంట- ఎవరో ఒకరికి వెళ్తానే ఉంటుంది.

> సంక్రాంతికి మొత్తం కుటుంబం అందరం కలిసి బెంగుళూరు వెళ్లాం. అందరూ వచ్చారు. పిల్లలు, పెద్దలు- ఇలా అందరికీ కావాల్సిన వంటలన్నింటినీ ముందే ప్లాన్ చేసి మెనూలు పంపేశాం. పిల్లలందరూ చాలా ఎంజాయ్ చేశారు. నా ఉద్దేశంలో- పిల్లలు పెద్దవాళ్లను చూసి నేర్చుకుంటారు. మనం ఒక మంచి పనిచేస్తే వాళ్లు చేస్తారు. మొన్న పండగ చాలా సంతోషంగా గడిచింది. పిల్లలు ఆ సంతోషాన్ని అనుభవించారు కాబట్టి వాళ్లు పెద్దయిన తర్వాత కూడా దాన్నే కొనసాగిస్తారు. ఆ పండుగ ఫొటోలు బాగా వైరల్ అయ్యాయి. మొన్న అమెరికాకు వెళ్తే చాలా మంది ఆ పండుగ గురించే ప్రస్తావించారు. తాము కూడా స్ఫూర్తి పొందామని చెప్పారు.

> "మాది చాలా పెద్ద కిచెన్. ఒక రూమ్‌లో ఫ్రీజర్, మరో రూమ్‌లో ఫ్రిజ్‌లు- ఇలా ఉంటాయి. ఉపాసన దీన్ని 'ఇండస్ట్రియల్ కిచెన్' అంటూ ఉంటుంది. ఎవరికి ఏం కావాలన్నా వండించి పెట్టడం నాకు ఇష్టం. ఇప్పుడు మా ఇంట్లో ముగ్గురు వంటవాళ్లు ఉన్నారు. నాలుగు తరాలవారికి అవసరమైనవన్నీ చేస్తూ ఉంటారు. కానీ వారు ఏం చేయాలో చెప్పేది నేనే! నా చిన్నప్పుడు అమ్మ వాళ్లింట్లో- అందరం ఒకే వంట తినేవాళ్లం. వేర్వేరు వంటలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వేర్వేరు వంటలు తప్పనిసరి అయ్యాయి."
>
> - సురేఖ

సురేఖగారు... మీరు నాలుగు తరాలను దగ్గరగా చూశారు.. చూస్తున్నారు.. మీరు గమనించిన మార్పులేమిటి?

ఒకప్పుడు ఆహారంపై పెద్ద అవగాహన ఉండేది కాదు. పెద్ద వాళ్లు చెప్పిందే పాటించేవారు. కానీ ఇప్పుడు అవగాహన పెరిగింది. ఆరోగ్యంగా ఉండాలనే కోరిక బలంగా ఉంది. ఎంత తినాలి? ఎప్పుడు ఆపేయాలి? అనే విషయంలో స్పష్టత ఉందనిపిస్తోంది. బయట ఎక్కువ తింటున్నారనే కంప్లైంట్ తప్ప- ఆహారం విషయంలో ప్రస్తుత తరమే మేలనిపిస్తోంది.

> మా ఇంట్లో పిల్లలకు తృణధాన్యాలతో ఆహారాన్ని నేనే తయారుచేస్తా. సెరిలాక్ వంటివి కూడా వాడం. బయట దొరికే ఆహార పదార్థాలలో ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. అవి ఆరోగ్యానికి తీవ్రమైన హాని చేస్తాయి.

మీ సమయంలో ఎక్కువమంది మహిళలు ఉద్యోగాలు చేసేవారు కారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఈ నేపథ్యంలో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఎలా?

సురేఖ: ఇప్పటి పిల్లలు చాలా కష్టపడుతున్నారు. కానీ ఏం చేస్తారు? ఇద్దరు పనిచేస్తే తప్ప అన్ని సౌకర్యాలు లభించవు. ఉద్యోగాలు చేసే అమ్మాయిలను చూస్తే జాలనిపిస్తుంది. కానీ వాళ్లు చాలా తెలివైన వాళ్లు. ఇటు పనిచేసుకుంటున్నారు, అటు పిల్లలతో కూడా సమయం గడుపుతున్నారు.

ఉపాసన: పని, ఇల్లు రెండూ ముఖ్యమైనవే! సమయానుకూలంగా ప్రాధమ్యాలు నిర్ణయించుకోవాలి. మార్చి ఎండింగ్ వచ్చేస్తోంది. అకౌంట్స్ క్లోజ్ చేయాలి. ఐదారు రోజులు ఆఫీసులోనే గడపాల్సి వస్తుంది. పిల్లల పరీక్షలు వస్తాయి. స్కూలు డేలు వస్తాయి. అలాంటప్పుడు కుటుంబంపైనే దృష్టి పెట్టాల్సి వస్తుంది. అయితే చాలాసార్లు రెండింటినీ కలిసి చూసి- పరిస్థితులు రివ్యూ చేసుకోకపోతే సమస్యలు వస్తాయి. చాలా మంది తమ బిజినెస్ గోల్స్‌ను రివ్యూ చేసుకుంటారు. కానీ ఫ్యామిలీ గోల్స్‌ను రివ్యూ చేసుకోరు.

జుట్టు ఆరోగ్యానికి కరివేపాకు

వంటల్లో కరివేపాకు వేస్తే రుచితో పాటు ఆరోగ్యం కూడా. యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలుండే కరివేపాకులో బి విటమిన్‌తో పాటు మెలనిన్‌ను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఇది జుట్టు ఆరోగ్యానికి దోహదపడుతుంది.

- గుప్పెడు కరివేపాకు, గుప్పెడు మందారం ఆకులను కొన్ని నీళ్లు వేసి పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ను మాడుకు తగిలేట్లు పట్టించాలి. పట్టించిన తర్వాత అరగంట ఉంచి జుట్టును శుభ్రపరచాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు నల్లగా ఉంటుంది.
- ఒక గిన్నెలో ఇరవై కరివేపాకులు వేసి అందులో కప్పు నీళ్లు పోసిన తర్వాత టేబుల్ స్పూన్లు మెంతులు జత చేయాలి. బాగా మరిగించి నీళ్లన్నీ తగ్గిపోయేవరకు ఉంచాలి. చివరగా వచ్చిన చిక్కటి ద్రవంలో టేబుల్ స్పూన్ కొబ్బరినూనె వేసి మిశ్రమాన్ని పేస్ట్ చేసుకోవాలి. దీన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే తెల్లని జుట్టు రాదు.
- ముప్ఫయి కరివేపాకులను తీసుకుని పేస్ట్ చేయాలి. ఇందులోకి టేబుల్ స్పూన్ పెరుగు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు తగిలేట్లు పట్టించాలి. తల మీద చల్లగా ఉంటుంది. దీంతో పాటు జుట్టు పెరుగుతుంది.
- గుంత ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేయాలి. నూనె మరిగేప్పుడు ఇరవై కరివేపాకుల్ని వేయాలి. మూడు నిముషాల తర్వాత దించేసి చల్లారిన తర్వాత జుట్టుకు పట్టించాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- పదిహేను కరివేపాకులను తీసుకుని పేస్ట్ చేసుకోవాలి. బౌల్‌లో ఈ పేస్ట్ వేసి అందులోకి నాలుగు టీస్పూన్ల ఉల్లిపాయ రసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించాలి. జుట్టును మర్దనం చేశాక ఇరవై నిముషాల పాటు వదిలేయాలి. ఇలా చేస్తుంటే జుట్టులో చుండ్రు సమస్య తగ్గిపోతుంది. జుట్టు వొత్తుగా పెరుగుతుంది.



విశ్వంభరి స్తుతి

నీతా అంబానీ... 'రిలయన్స్ ఇండస్ట్రీస్' అధినేత ముఖేష్ అంబానీ సహధర్మచారిణిగా... సామాజిక కార్యకర్తగా... 'ముంబయి ఇండియన్స్' ఐపీఎల్ జట్టు సహయజమానిగా ప్రపంచ స్థాయిలో సుపరిచితురాలయ్యారు. అంబానీ ఇంట ఏ వేడుక జరిగినా... క్రికెట్ మైదానంలో ఆటను ఆస్వాదించినా... సందర్భం ఏదైనా ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఇటీవల తమ తనయుడు అనంత్ ప్రీవెడ్డింగ్ ఈవెంట్‌లో నీతా మరోసారి మెరిశారు. అఖిలాండేశ్వరిని కొలిచే 'విశ్వంభరి స్తుతి' శ్లోకానికి తన అద్భుత నాట్యాభినయం జోడించి అబ్బురపరిచారు.

కాబోయే దంపతులు అనంత్, రాధికా మర్చంట్ 'హస్తాక్షర్' వేడుకలో అంబానీ కుటుంబ సభ్యులు తమ భావాలను, అనుభూతులను పంచుకున్నారు. అతిరథమహారథులు ఆసీనులైన ఆ మెగా ఈవెంట్‌లో చివరగా నీతా అంబానీ ప్రదర్శించిన 'విశ్వంభరి స్తుతి' మనోహరంగా, నయనానందకరంగా సాగింది. భారీ బడ్జెట్ చిత్రానికి ఏమాత్రం తీసిపోని సెట్టింగ్‌ల మధ్య... అమ్మవారిని స్తుతిస్తూ ఆమె అభినయించిన తీరు అతిథులను ఆ కాసేపూ మరో లోకంలోకి తీసుకువెళ్లింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ నాట్యాభినయాన్ని తన మనవళ్లకు అంకితమిస్తున్నట్టు నీతా ప్రకటించారు. అనంతరం ప్రదర్శించిన 'మహా హారతి'లో అంబానీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రాల్లో భారతీయతను ప్రపంచానికి ఘనంగా చాటిన ఈ కార్యక్రమం మంత్రముగ్ధులను చేసింది.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై తనకు ఉన్న మక్కువను ఈ సందర్భంగా నీతా అంబానీ ఒక వీడియో ద్వారా పంచుకున్నారు. 'మన వివాహ వేడుకలు భారతదేశ మూలాలు, సంస్కృతిని, కళలను ప్రతిబింబించేలా ఉండాలని చెప్పే ప్రధాన ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఇచ్చాను. అలాగే వైవాహిక జీవితంలోకి అడుగిడుతున్న అనంత్, రాధికకు అమ్మవారి ఆశీస్సులు అందజేయడం కూడా మరో కారణం. చిన్నప్పటి నుంచి నేను విశ్వంభరి స్తుతి వింటున్నాను. ముఖ్యంగా నవరాత్రి వేడుకల్లో' అంటూ నీతా చెప్పుకొచ్చారు. నీతా అంబానీ భరతనాట్య కళాకారిణి. ఆమె జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి సాగుతోంది. ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన నీతా... మంత్రాలు చదువుతూ, దేవుణ్ని ప్రార్థిస్తూ కనిపించారు. అనంత్ అంబానీకి కూడా భక్తి ఎక్కువ. అమ్మమ్మ పూర్ణిమా దలాల్ నుంచి తాను ఎన్నో పురాణాలు, కథలు విన్నాననీ, ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నేర్చుకున్నానని ఓ సందర్భంలో అనంత్ వెల్లడించాడు.



బరువు పెరిగినంత వేగంగా బరువు తగ్గటం కష్టం. తగ్గాలంటే మాత్రం క్రమశిక్షణ అవసరం. కచ్చితంగా ఉదయం పూట నిద్ర లేచి వ్యాయామం లేదా నడక, పరిగెత్తటం చేయాలి. ఇలా చేయటం వల్ల ఒంట్లోని కొవ్వు కరిగిపోతుంది.



బరువు తగ్గాలంటే..

- కండలను కరిగించే పని పెట్టాలంటే మాత్రం శరీరం బద్ధకాన్ని వదిలించుకోవాల్సిందే. దొరికిన ఆహారాన్ని తినకుండా అదుపులో ఉండాలి. అలా అని తినకుండా ఉండటం కూడా మంచిది కాదు. తినాలి..తగినట్లు వ్యాయామం ఉండాలి.
- టీవీలు లేదా ఫోన్లు చూస్తూ తినటం మంచిది కాదు. ఎంత తిన్నారో మీకే తెలియదు. పైగా గంటల పాటు కూర్చుని తినటం వల్ల ఊబకాయం వస్తుంది.
- తాజా ఆకుకూరలు, పండ్లు తినాలి. సోడా, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం మంచిది. మంచి నీళ్లు ఎక్కువగా తాగాలి.
- ముఖ్యంగా లైఫ్‌స్టయిల్‌ను మార్పు చేసుకుని బరువు తగ్గటానికి ప్రణాళిక వేసుకుంటేనే తగ్గుతారు.
- ఆహారం, వ్యాయామంతో పాటు మంచి నిద్ర ఉండకుంటే అంతే సంగతులు. అతిగా నిద్రపోయినా బరువు పెరుగుతారు. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోవాలి. దీనివల్ల బరువు తగ్గుతారు.



ఇటలీ వెళ్లిన కల్కి

ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణే, దిశా పటాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటలీలోని అద్భుతమైన లొకేషన్స్‌లో ప్రభాస్, దిశా పటానిపై పాట చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్, దిశా పటాని, నాగ్ అశ్విన్ ఇతర యూనిట్ సభ్యులతో దిగిన ఫొటోని బుధవారం మేకర్స్ షేర్ చేశారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కల్కి 2898' చిత్రం మే 9న విడుదల కానుంది.

బైక్ రేసర్‌గా శర్వా

పుట్టిన రోజున మూడు చిత్రాలు



యువ కథానాయకుడు శర్వానంద్ ప్రస్తుతం తన 35వ చిత్రం 'మనమే'లో నటిస్తున్నారు. ఆయనతో 'రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'మహానుభావుడు' చిత్రాలను నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజా చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శర్వా పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఈ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభిస్తున్నారు. తొలిసారిగా శర్వా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రాన్ని చేస్తున్నారు. ఇందులో ఆయన బైక్ రేసర్‌గా నటిస్తున్నారు.మోటో క్రాస్ రేసింగ్ నేపథ్యంలో మూడు తరాల కుటుంబానికి చెందిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్నారు.

శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు చిత్ర సమర్పకుడు విక్రమ్ తొలి క్లాప్ ఇచ్చారు.

ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, ఫొటోగ్రఫీ: జె.యువరాజ్, ఎడిటర్: అనిల్ కుమార్, రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర

'సామజవరగమన' దర్శకుడితో..

అలాగే శర్వానంద్ హీరోగా ఓ సినిమా తీస్తున్నట్లు ఈ పుట్టినరోజు సందర్భంగానే నిర్మాత అనిల్ సుంకర ప్రకటించారు. 'సామజవరగమన' చిత్రానికి దర్శకత్వం వహించిన రామ్ అబ్బరాజు శర్వానంద్ నటించే 37 చిత్రానికి డైరెక్టర్. హిలేరియస్ రైటింగ్‌కు పేరొందిన రామ్ శర్వాను హ్యూమరస్ క్యారెక్టర్‌లో చూపించనున్నారు. హీరోయిన్‌ను ఇంకా ఎంపిక చేయలేదు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో పొడవాటి జుట్టు, గడ్డంతో రగ్గడ్ స్టైల్‌తో సీరియస్ లుక్‌లో కనిపించారు శర్వా. ఈ చిత్రానికి కథ: భాను భోగవరపు, మాటలు: నందు సవరిగాన, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

శ్రీరామ్ ఆదిత్యతో 'మనమే'

శర్వానంద్ నటించే 35వ చిత్రం 'మనమే' ఫస్ట్‌లుక్‌ను ఆయన పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. లండన్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ ఇది. కృతి శెట్టి కథానాయిక. వివేక్ కూచిభొట్ల ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్,సహ నిర్మాత. ఏడిద రాజా అసోసియేట్ నిర్మాత.

మొదట ఎన్టీఆర్.. ఇప్పుడు రామ్‌చరణ్



అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటించే రెండో తెలుగు చిత్రం కూడా కన్‌ఫర్మ్ అయింది. జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఆమె తాజాగా రామ్‌చరణ్ హీరోగా నటించే 16 సినిమాలో కథానాయికగా నటించనున్నారు. జాన్వీ ఈ చిత్రం చేస్తుందనే వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఆమె తండ్రి బోనీ కపూర్ ఇటీవల ఈ విషయం వెల్లడించారు కూడా. జాన్వీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వద్ధి సినిమాస్ అధినేతలు అధికారికంగా ఈ విషయం వెల్లడించారు. దర్శకుడు బుచ్చిబాబు సాన ఈ సినిమా కోసం యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వెంకట సతీశ్ కిలారు చెప్పారు.

భీమ పాత్రను ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు హర్ష



గోపీచంద్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' ఈ శుక్రవారం విడుదలవుతోంది. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రానికి కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వం వహించారు. విడుదల సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ 'నేను బెంగళూరులో పుట్టి పెరిగాను. ఇప్పటివరకూ కన్నడ చిత్రాలే చేశాను. తెలుగులో రాధామోహన్ గారి 'బెంగాల్ టైగర్' చిత్రంలో రెండు పాటలకు కొరియోగ్రఫీ చేశాను. ఆయనే నన్ను తెలుగులో దర్శకుడిగా పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. గోపీచంద్‌గారికి మొదట ఒక కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని 'భీమ' కథ చెప్పాను. అది ఆయనకు నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్, ఎలివేషన్, ఎమోషన్ కలిగిన మంచి కమర్షియల్ సినిమా ఇది. సోషల్ మెసేజ్ కూడా ఉంది. సెమీ ఫాంటసీ ఎలిమెంట్ కూడా ఉంది. ముఖ్యంగా భీమ పాత్ర చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది' అని చెప్పారు. గోపీచంద్ వండర్‌ఫుల్ ఆర్టిస్ట్ అని చెబుతూ 'ఆయన సినిమాలన్నీ చూశాను. తనకి యూనిక్ బాడీ లాంగ్వేజ్ ఉంది. మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి. చాలా పాజిటివ్. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. భీమ పాత్ర ఆయనకే సూట్ అవుతుందని ఆయనకే చెప్పాను' అన్నారు హర్ష. నిర్మాత రాధామోహన్ చాలా ప్యాషన్ ఉన్న వ్యక్తి అనీ ఈ సినిమాకు కావాల్సిన వన్నీ సమకూర్చడంతో మంచి క్వాలిటీతో సినిమా తీయగలిగినట్లు ఆయన తెలిపారు.

సీతక్క చేతుల మీదుగా ఆకాశమే అందనీ



చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి' కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోందీ సినిమా. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'ఆకాశం అందనీ' అంటూ సాగే గీతాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ "తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న మహిళలు పోరాడి గెలుచుకున్న రోజు 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'. ఈ సందర్భంగా మహిళా గీత రచయిత చైతన్య పింగళి రాసిన 'ఆకాశమే అందనీ' లిరికల్ సాంగ్‌ను నా చేతుల మీదుగా రిలీజ్ చేయటం ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు చైతన్య రావు, హీరోయిన్ భూమి శెట్టి, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మాట్లాడారు.

బుల్లెట్ యాక్షన్



రవి వర్మ, సంజనా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బుల్లెట్. చౌడప్ప దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. దర్శకులు వి. సముద్ర, ప్రొడ్యూసర్ ఏ ఎం రత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏ. ఎం. రత్నం మాట్లాడుతూ "ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్లే ఆరడుగుల బుల్లెట్‌ను హీరోగా సెలెక్ట్ చేశారు" అని అన్నారు. దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ "ఈ చిత్ర దర్శకుడు చౌడప్ప నాకు మంచి మిత్రుడు. ఆయన ఎంతో ప్యాషన్‌తో తీసిన ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మాట్లాడుతూ ఇదొక యాక్షన్ మూవీ కర్నూల్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం' అని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: ఎం.సి. రావు, బి గోపాల్, ఎమ్.వి. మల్లిఖార్జున రావు,కోసూరి సుబ్రమణ్యం, మని.

ధూమ్‌ధామ్‌గా ఫస్ట్ లుక్



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ధూమ్‌ధామ్'. సాయి కుమార్, వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి కుమార్ మచ్చ దర్శకత్వం వహించగా, గోపీ మోహన్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల చేశారు. కలర్‌ఫుల్‌గా ఉన్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపొందిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

ఇన్వెస్టిగేటివ్ విశాలాక్షి



విజయ్ శంకర్, మహేశ్ యడ్లపల్లి, ఆయూషీ పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో నటిస్తోన్న చిత్రం 'విశాలాక్షి'. పవన్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఈ చిత్రం ప్రారంభమైంది. అతిథులుగా విచ్చేసిన, దర్శక సంఘం అధ్యక్షులు వీరశంకర్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇది ఇన్వెస్టిగేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే యాక్షన్ ఎంటర్టైనర్. మంచి సస్పెన్స్‌తో నడుస్తుంది" అని అన్నారు. నిర్మాత పల్లపు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ "ఈ చిత్ర కథను దర్శకుడు, నేను కలిపి డెవలప్ చేశాం. యూత్, ఫ్యామిలీని దృష్టిలో పెట్టుకుని ఈ కథను మలిచాం" అని తెలిపారు.



16న 'ఐఐఎఫ్ఐ' అవార్డ్స్ కార్యక్రమం

తెలుగు ఇండస్ట్రీలోని ప్రతిభావంతుల్ని గౌరవించుకునేందుకు తెలుగు ఫిల్మ్ అండ్ వెల్ఫేర్ ఫోరం ఓ అవార్డ్ ప్రదానోత్సవం ఈ నెల 16న నిర్వహిస్తోంది. 'ఐకాన్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ' (ఐఐఎఫ్ఐ) పేరిట జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన కర్టెన్ రైజర్ బుధవారం ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగింది. ఇందులో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "ఈ అవార్డ్ కార్యక్రమం వెనుక గొప్ప లక్ష్యం ఉంది. దీని ద్వారా అన్ని క్రాఫ్ట్‌లోని సీనియర్లను గౌరవించబోతున్నాం. తెలుగు సినిమా 75 ఏళ్ల కార్యక్రమం మనం ఘనంగా నిర్వహించుకున్నాం. వందేళ్ల పండగకు ఇంకా ఎనిమిదేళ్లు ఉంది. అప్పటి వరకూ ఎంతమంది బతికి ఉంటారో తెలీదు. అందుకే అప్పటి వరకూ ఆగేకంటే ఈ లోగా అన్ని విభాగాల్లోని సీనియర్స్‌ను గౌరవించబోతున్నాం. ఈ ప్రయత్నాన్ని దిగ్విజయం చేసేందుకు ఇండస్ట్రీలోని అందరి సహకారం అవసరం" అన్నారు. కార్యక్రమంలో 'ఐఐఎఫ్ఐ' నిర్వాహకులు నాగబాల సురేశ్, స్పాన్సరర్ విజయ్ కుమార్, నటి దివ్యవాణి, జ్యూరీ సభ్యుడు జర్నలిస్ట్ ప్రభు కూడా మాట్లాడారు.

సైన్స్ ఫిక్షన్



వికాస్ జీకే, శాంతి హీరోహీరోయిన్లుగా రూపుదిద్దుకున్న 'దర్శిని' చిత్రం త్వరలో విడుదల కానుంది. డాక్టర్ ప్రదీప్ అల్లు దర్శకత్వంలో డాక్టర్ ఎల్వీ సూర్యం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం టీజర్‌ను పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ విడుదల చేసి సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఇది. సినిమా బాగా వచ్చింది. పాటలు చిత్రానికి ప్లస్ అవుతాయి.' అన్నారు. ఓ ప్రముఖ పంపిణీ సంస్థ ద్వారా త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. టీజర్, పాటలు చూసి ఆశీర్వదించిన ఎంపీ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

74,000 పైకి సెన్సెక్స్

22,500 స్థాయికి చేరువలో నిఫ్టీ.. సరికొత్త గరిష్ఠాలకు సూచీలు



ఎస్‌బీఐ @ రూ.7 లక్షల కోట్లు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ప్రారంభ నష్టాల నుంచి తేరుకుని సరికొత్త రికార్డులకు చేరుకున్నాయి. సెన్సెక్స్ తొలిసారిగా 74,000 మైలురాయిని దాటింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఫార్మా, కొన్ని ఐటీ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ముగింపు స్థాయి 73,677తో పోలిస్తే దాదాపు 90 పాయింట్ల నష్టంతో 73,587 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 73,321 స్థాయికి జారుకుంది. అయితే, యూరప్ మార్కెట్ల సానుకూల సంకేతాలు, కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం నుంచి మన మార్కెట్ కూడా అప్‌ట్రెండ్ తీసుకుంది. ఒకదశలో సెన్సెక్స్ 474 పాయింట్లకు పైగా లాభంతో 74,151.27 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 408.86 పాయింట్ల లాభంతో సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపు స్థాయి 74,085.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక దశలో 140.9 పాయింట్లు పెరిగి 22,497.20 వద్ద ఇంట్రాడే రికార్డును నమోదు చేసి చివరికి 117.75 పాయింట్ల లాభంతో 22,474.05 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

1 సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడగా.. కోటక్ బ్యాంక్ షేరు 2.47 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. యాక్సిస్ బ్యాంక్, ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా పెరిగాయి.

1 బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 1.91 శాతం క్షీణించగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.65 శాతం నష్టపోయింది.

1 ఆర్‌బీఐ ఆంక్షల ప్రభావంతో జేఎం ఫైనాన్షియల్ షేరు 11% పతన మవగా.. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ 20 శాతం క్షీణించింది.

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ షేరు బీఎస్ఈలో ఇంట్రాడే ట్రేడింగ్‌లో 0.79 శాతం పెరిగి రూ.790.15 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.7 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. చివరికి షేరు 0.02 శాతం లాభంతో రూ.784.05 వద్ద ముగియడంతో మార్కెట్ క్యాప్ రూ.6,99,734 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎస్‌బీఐ షేరు 22 శాతం వృద్ధిని కనబరిచింది. గడిచిన ఏడాది కాలంలో 39 శాతానికి పైగా పుంజుకుంది.

1 ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి 82.83 వద్ద ముగిసింది.

ఐపీఓ అప్‌డేట్స్

1 కొల్హాకి చెందిన ఆటోమొబైల్ డీలర్‌షిప్, సర్వీసింగ్ సేవల కంపెనీ పాపులర్ వెహికిల్స్ అండ్ సర్వీసెస్ ఐపీఓ వచ్చే మంగళవారం ప్రారంభం కానుంది. ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.280-295గా నిర్ణయించింది.

1 క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ఐపీఓ ఈనెల 14న ప్రారంభమై 18న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.175 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన 17.5 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది.

1 ఆర్ కే స్వామి ఐపీఓ చివరిరోజు ముగిసేసరికి ఇష్యూ సైజుకు 25.78 రెట్ల అధిక సబ్‌స్క్రిప్షన్ లభించగా.. జేజీ కెమికల్స్ ఆఫర్ రెండో రోజు నాటికి ఇష్యూ సైజుకు 6.39 రెట్లు, గోపాల్ స్నాక్స్ ఆఫర్ తొలిరోజు పూర్తయ్యేసరికి ఇష్యూ సైజులో 56 శాతం బిడ్లు లభించాయి.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు రూ.1,650 కోట్లు: ఫెయిర్‌ఫాక్స్

న్యూఢిల్లీ: ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీకి పెద్ద ఊరట లభించింది. ఈ కంపెనీకి 20 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,650 కోట్లు) నిధులు సమకూర్చనున్నట్లు ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కార్పొరేషన్ (ఎఫ్ఐహెచ్‌సీ) ప్రకటించింది. అయితే ఈ రుణ సాయం రెగ్యులేటరీ సంస్థల నిబంధనలకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంగారు రుణాలపై ఆర్‌బీఐ నిషేధం విధించిన కొద్ది రోజులకే ప్రేమ్ వత్స నాయకత్వంలోని ఎఫ్ఐహెచ్‌సీ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.



ఇక కార్డ్ నెట్‌వర్క్ ఎంపిక కస్టమర్ ఇష్టమే : ఆర్‌బీఐ

ముంబై: క్రెడిట్, డెబిట్ కార్డుల జారీకి సంబంధించి ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన ఖాతాదారులకు వీటిని జారీ చేసేటప్పుడు, మాస్టర్ కార్డు, వీసా, రుపేలలో ఏ నెట్‌వర్క్ కార్డు తీసుకోవాలనే విషయాన్ని పూర్తిగా ఖాతాదారుల ఇష్టానికి వదిలేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించింది. ప్రస్తుతం ఈ విషయంలో ఖాతాదారులకు ఎటువంటి స్వేచ్ఛ లేదు. బ్యాంకులు ముందుగానే ఆయా నెట్‌వర్క్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఆయా నెట్‌వర్క్‌ల క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను మాత్రమే ఖాతాదారులకు అంటగడుతున్నాయి. ఇక ముందు ఇలాంటి ముందస్తు ఒప్పందాలేవీ కుదరవని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఏ నెట్‌వర్క్ క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు తీసుకోవాలనేది ఇక పూర్తిగా ఖాతాదారుల ఇష్టమని తెలిపింది. ఇప్పటికే క్రెడిట్ లేదా డెబిట్ కార్డులున్న ఖాతాదారులు తదుపరి రెన్యువల్ టైమ్‌లో తమకు ఇష్టమైన నెట్‌వర్క్ కార్డును ఎంచుకోవచ్చని పేర్కొంది. ఈ ఆదేశాలు జారీ అయిన ఆరు నెలల నుంచి అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

ఈ ఏడాది బంగారం 72,000?



న్యూఢిల్లీ: పసిడి వరుసగా రెండో రోజూ కొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో తులం బంగారం బుధవారం మరో రూ.150 పెరిగి రూ.65,150 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఒకదశలో 2,145 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. బంగారం ధర మరింత పెరిగి ఈ ఏడాది చివరికల్లా అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ 2,250 డాలర్లకు, దేశీయంగా తులం దాదాపు రూ.72,000 స్థాయికి చేరుకోవచ్చని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికాలో ధరాభారం తగ్గుముఖం పట్టడంతో ఫెడరల్ రిజర్వ్ జూన్ సమీక్షలో వడ్డీరేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చన్న అంచనాలు గడిచిన కొన్ని సెషన్లలో పసిడి ధరలు వేగంగా పెరగడానికి కారణమయ్యాయని ఎస్ఎస్ వెల్త్‌స్ట్రీట్ వ్యవస్థాపకులు సుగంధ సచ్‌దేవ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో భౌగోళిక రాజకీయ అనిశ్చితులతోపాటు సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను పెద్ద ఎత్తున పెంచుకుంటూ పోతుండడం కూడా డిమాండ్ పెరగడానికి కారణమవుతున్నాయని అన్నారు. బంగారం రేట్ల భవిష్యత్ బుల్లిష్‌గానే కనిపిస్తున్నప్పటికీ, మధ్యలో స్వల్ప దిద్దుబాటుకు లోనుకావచ్చని విశ్లేషకులు అంటున్నారు. దిద్దుబాటు దశలోనూ రూ.61,200, రూ.59,500 స్థాయిల వద్ద మద్దతు లభించవచ్చని వారు భావిస్తున్నారు.

ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్ వచ్చే త్రైమాసికంలో: బజాజ్ ఆటో

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ కంపెనీ బజాజ్ ఆటో ప్రపంచంలో సీఎన్‌జీతో (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) నడిచే తొలి బైక్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ మోటార్ సైకిల్‌ను ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్ మంగళవారం వెల్లడించారు. సీఎన్‌జీ బైక్‌తో ఇంధన, నిర్వహణ ఖర్చులు సంప్రదాయ ఇంధన మోటార్ సైకిళ్లతో పోలిస్తే 50-65 శాతం మేర తగ్గనున్నాయని ఆయన తెలిపారు. అంతేకాదు, ఈ బైక్ విడుదల చేసే కాలుష్య ఉద్గారాలు కూడా చాలా తక్కువన్నారు. సంప్రదాయ ఇంధన బైక్‌లతో పోలిస్తే కార్బన్ డై ఆక్సైడ్ విడుదల 50 శాతం, కార్బన్ మోనాక్సైడ్ 75 శాతం, నాన్ మీథేన్ హైడ్రోకార్బన్ దాదాపు 90 శాతం తగ్గనుందన్నారు.

గ్రీన్‌కో చేతికి జీఐ హైడ్రో ప్రాజెక్టు
డీల్ విలువ రూ.1000 కోట్లు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలోని గ్రీన్‌కో కంపెనీ జీఐ హైడ్రో నుంచి తూర్పు సిక్కింలోని రుబానెక్ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు కొనుగోలును పూర్తి చేసింది. 110 మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.1000 కోట్లు కాగా ఈక్విటీ విలువ రూ.300 కోట్లని ఈ డీల్‌తో సన్నిహితంగా పని చేసిన వారు తెలియచేశారు. అయితే అధికారికంగా ధ్రువీకరించడానికి రెండు కంపెనీల ప్రతినిధులు అందుబాటులో లేరు. 2014 మే నెలలో ప్రారంభమైన ఈ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు రంగ్‌పో, రోంగ్ని నదులకు చెందిన అనుసంధానిత రిజర్వాయర్ నుంచి నీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. గ్రీన్‌కో కంపెనీ ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, సిక్కింలలో 1789 మెగావాట్ల సామర్థ్యం గల 25 ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. వాటిలో సిక్కింలోనే 96 మెగావాట్ల సామర్థ్యం గల దిక్చూ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు కూడా ఉంది.

స్విట్జర్లాండ్‌కు పెరుగుతున్న పర్యాటకులు

హైదరాబాద్: స్విట్జర్లాండ్ పర్యాటక రంగం కొవిడ్ ప్రభావం నుంచి పూర్తిగా కోలుకుంది. 2023లో తమ దేశానికి వచ్చిన పర్యాటకుల సంఖ్య కొవిడ్‌కు ముందున్న 2019 స్థాయిని మించి పోయిందని స్విట్జర్లాండ్ టూరిజం డిప్యూటీ మార్కెటింగ్ అధికారి (ఈస్ట్ మార్కెట్స్) సైమన్ బోషార్ట్ చెప్పారు. అయితే భారత పర్యాటకుల సంఖ్య మాత్రం ఇంకా 2019 కంటే తక్కువే ఉందన్నారు. 2019లో భారత్ నుంచి ఎనిమిది లక్షల మంది పర్యాటకులు వస్తే, గత ఏడాది ఆ సంఖ్య ఏడు లక్షల స్థాయిలోనే ఉందన్నారు. ఈ సంవత్సరం వీరి సంఖ్య ఎనిమిది లక్షలకు చేరుకుంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరు తర్వాత హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది పర్యాటకులు తమ దేశానికి వస్తున్నట్టు సైమన్ చెప్పారు.

ఫిన్‌టెక్‌లకు మేము వ్యతిరేకం కాదు
మార్చి 15 వరకే పేటీఎంకు గడువు.. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీలకు తాము వ్యతిరేకం కాదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించినందునే పేటీఎం పేమెంట్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. నిజానికి ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగంలో మరిన్ని నవ కల్పనలు రావాలని ఆర్‌బీఐ కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ రంగంలో కొత్త ఆలోచనల సాధ్యాసాధ్యాలను పరీక్షించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే శాండ్ బాక్స్ విధానాన్ని ప్రవేశ పెట్టిన విషయాన్ని దాస్ గుర్తు చేశారు. దేశంలో ఫిన్‌టెక్‌ల అభివృద్ధికి ఆర్‌బీఐ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.

పేటీఎంకు మార్చి 15 వరకే గడువు: పేటీఎం వ్యాలెట్ వినియోగదారులకు ఈ నెల 15 వరకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రసక్తే లేదని దాస్ స్పష్టం చేశారు. పేటీఎం వ్యాలెట్ వినియోగదారుల్లో 80 నుంచి 85 శాతం మంది ఇప్పటికే పీపీబీఎల్‌తో అనుసంధానమైన తమ వ్యాలెట్లను ఇతర బ్యాంకులతో అనుసంధానం చేసుకున్నట్టు తెలిపారు. కాబట్టి పీపీబీఎల్‌పై ఆర్‌బీఐ తీసుకున్న నియంత్రణ చర్యల ప్రభావం పేటీఎం వ్యాలెట్ వినియోగదారులపై ఏమాత్రం ఉండదన్నారు.

8 శాతానికి చేరువలో వృద్ధి రేటు: ఈ ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు ఎనిమిది శాతానికి చేరువలో ఉంటుందని దాస్ తెలిపారు. మార్చితో ముగిసే నాలుగో త్రైమాసికంలోనూ జీడీపీ వృద్ధిరేటు 5.9 శాతంపైనే ఉంటుందన్నారు. అదే జరిగితే వార్షిక వృద్ధిరేటు ముందు అంచనా వేసిన 7.6 శాతాన్ని మించి పోతుందన్నారు. ఏదేమైనా ఈ ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు ఎనిమిది శాతానికి దగ్గరలో ఉంటుందని దాస్ చెప్పారు. జనవరి నెలలో నమోదైన 5.10 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత నాలుగు శాతం లక్ష్యం కంటే 1.10 శాతం ఎక్కువగా ఉందన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతం వద్ద కట్టడి చేయడమే తమ లక్ష్యమన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	65,130 ▲	59,700 ▲	78,000 ▼
ముంబై	64,490 ▼	59,080 ▼	71,710 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (రూ. 100 గుడ్లు)



6వ తేదీ		7వ తేదీ	
హైదరాబాద్	469	విజయవాడ	463
7వ తేదీ		విశాఖపట్నం	500
చిత్తూరు	523	వరంగల్	471
గోదావరి	463	డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	116	గోదావరి	124
వరంగల్	116		
కరీంనగర్	116	విజయవాడ	124
మహబూబ్‌నగర్	116	గుంటూరు	124
		ఒంగోలు	124
కర్నూలు	116		
విశాఖపట్నం	121	చిత్తూరు	120

అదరాలి.. ఆఖరాట

వరుసగా నాలుగో విజయంపై భారత్ గురి

- గెలుపుతో ముగించాలని ఇంగ్లండ్
- ఐదో టెస్ట్ నేటి నుంచి



అశ్విన్, బెయిర్‌స్టో

ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో



రోహిత్

100 భారత స్పిన్నర్ అశ్విన్, ఇంగ్లండ్ ఆటగాడు బెయిర్‌స్టోకు కెరీర్‌లో ఇది 100వ టెస్ట్. ఈ మ్యాచ్‌తో సెంచరీ మైలురాయిని చేరిన 14వ భారత ఆటగాడిగా అశ్విన్, 17వ ఇంగ్లండ్ ప్లేయర్‌గా బెయిర్‌స్టో రికార్డులకెక్కనున్నారు.

2 700 వికెట్ల మైలురాయికి అండర్సన్‌కు కావాల్సిన వికెట్లు. మురళీధరన్ (800), షేన్ వార్న్ (708) ఆతడి కంటే ముందున్నారు.

ధర్మశాల: కొన్ని సవాళ్లు ఎదురైనా.. సొంతగడ్డపై తిరుగులేని రికార్డును కొనసాగిస్తున్న భారత్.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌ను విజయంతో ముగించాలనుకుంటోంది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఐదవ, ఆఖరి మ్యాచ్ గురువారం నుంచి జరగనుంది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో అనూహ్యంగా ఓటమిపాలైనా రోహిత్ సేన.. ఆ తర్వాత బలంగా పుంజుకొని 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్ స్పిన్నర్ అశ్విన్ కెరీర్‌లో వందో టెస్ట్ కావడంతో.. ఎట్టిపరిస్థితుల్లోనూ గెలిచి ఆతడికి బహుమతిగా ఇవ్వాలని టీమిండియా పట్టుదలతో ఉంది. కోహ్లీ, రాహుల్ లాంటి సీనియర్ ప్లేయర్లు అందుబాటులో లేకపోయినా.. కుర్రాళ్ల ప్రతిభతో రోహిత్ సేన సిరీస్ ప్రకటించింది. ముఖ్యంగా ధ్రువ్ జురెల్..రాంచీ లో జరిగిన రెండో టెస్ట్‌లో మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. రాంచీ టెస్ట్‌లో తీవ్ర ఒత్తిడి పరిస్థితులు ఎదురైనా.. జురెల్ పోరాట కారణంగా భారత సిరీస్‌ను సొంతం చేసుకోగలిగింది. సర్ఫరాజ్ ఖాన్ కూడా అరంగేట్రం టెస్ట్‌లోనే రెండు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నాడు. నాలుగో టెస్ట్‌లో 14, 0 పరుగులతో నిరాశపరిచాడు. వరుసగా విఫలమవుతున్న రజత్ పటీదార్‌కు బహుశా ఇదే చివరి అవకాశం కావచ్చు. ఓపెనర్‌గా జైస్వాల్ అద్భుతంగా రాణిస్తుండగా.. వన్‌డౌన్‌లో గిల్ క్రమంగా నిలదొక్కుకుంటున్నాడు. గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగే అవకాశాలను టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది.



స్టోక్స్

బ్యాటర్లపై ఒత్తిడి..: బజ్‌బాల్ జమానాలో తొలిసారి టెస్ట్ సిరీస్ చేజార్చుకున్న ఇంగ్లండ్ ఒత్తిడిలో పడింది. దూకుడుగా ఆడాలన్న వారి వ్యూహం భారత పిచ్‌లపై బెడిసి కొట్టింది. ఇంగ్లండ్ బ్యాటింగ్ వైఫల్యం ఈ సిరీస్‌లో ఎక్కువగా కనిపిస్తోంది. మొదటి మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో 196 పరుగుల తర్వాత పోప్ ఆ స్థాయి ప్రదర్శన చేయలేక పోయాడు. ఓపెనర్లు క్రాలే, డకెట్ కొంత పర్వాలేదనిపించారు. రూట్, స్టోక్స్ ఆకట్టుకోలేదు. మరోవైపు సిరీస్‌లో ఆ జట్టు బౌలింగ్ మెరుగ్గా సాగింది. స్పిన్నర్లు బషీర్, హార్ట్‌లీకి పెద్దగా అనుభవం లేకపోయినా.. మెరుగైన ప్రదర్శన కనబరిచి నట్టుగానే భావించాలి. పేసర్లు అండర్సన్, మార్క్ ఉడ్‌లతో బరిలోకి దిగే చాన్సులు ఎక్కువగా ఉన్నాయి. వరుసగా విఫలమవుతున్నా బ్యాటర్ జానీ బెయిర్‌స్టోకు ఇది 100వ టెస్ట్ కావడం విశేషం. మరి ఈ మైలురాయి మ్యాచ్‌లోనైనా అతడు ఫామ్‌ను అందుకుంటాడేమో చూడాలి. కాగా, ఇక్కడి వాతావరణం చల్లగా ఉండడం ఇంగ్లండ్‌కు కొంత అనుకూలం. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, జైస్వాల్, గిల్, పటీదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), జడేజా, అశ్విన్, కుల్దీప్/ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్ (వికెట్ కీపర్), హార్ట్‌లీ, మార్క్ ఉడ్, బషీర్, అండర్సన్.

పిచ్/వాతావరణం

చల్లని వాతావరణం, పిచ్‌పై తేమ ఉండడంతో పేసర్లకు అనుకూలించే అవకాశం ఉంది. ఇక్కడ జరిగిన రంజీ మ్యాచ్‌ల్లో ఫాస్ట్ బౌలర్లే ఎక్కువ వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లు నిలదొక్కుకుంటే భారీ స్కోర్లు చేసే చాన్సుంది. వర్షం కురిసే అవకాశాలున్నాయి. అయితే, వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని స్టోక్స్.. ఉదయం పేసర్లకు, మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు సహకరించే చాన్సుందని రోహిత్ అన్నాడు.

ఆ పరిస్థితుల్లోనూ.. ఎందుకొచ్చావని అడిగింది



రాజ్‌కోట్‌లో జరిగిన టెస్ట్ మధ్యలో అశ్విన్ తల్లి చిత్రా రామచంద్రన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో అశ్విన్ ఇంటి వెళ్లాల్సిన పరిస్థితి. అయితే ఐసీయూలో ఉన్న సమయంలో తాను వెళ్లగా తన వద్దకు ఎందుకొచ్చావు.. మ్యాచ్ వదిలేసి అని అడిగిందని అశ్విన్ చెప్పాడు. 'అమ్మ స్పృహలోకి వస్తూ.. పోతూ ఉంది. ఒకసారి తెలివిలోకి వచ్చిన తర్వాత నన్నుచూసి 'నువ్వెందుకొచ్చావ్ ?' అని అడిగింది. ఆ వెంటనే మళ్లీ స్పృహ కోల్పోయింది. మళ్లీ కళ్లు తెరిచిన తర్వాత టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. నువ్వు వెళ్లాలని చెప్పింది' అని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నాడు.

రామ్‌చరణ్‌తో సచిన్ 'నాటు నాటు'

ముంబై: సచిన్ టెండూల్కర్ మైదానంలో స్టెప్పులేసి అలరించాడు. ఇండియన్ ప్రీమియర్ స్ట్రీట్ లీగ్ (ఐఎస్‌పీఎల్) ప్రారంభ టోర్నీ బుధవారం ఇక్కడి దాదోజీ కొండదేవ్ స్టేడియంలో జరిగింది. ఈ వేడుకకు హాజరైన సచిన్.. టీ10 కొన్ని జట్లకు యజమానులైన రామ్‌చరణ్, హీరో సూర్య, అక్షయ్ కుమార్‌లతో కలిసి ఆస్కార్ సినిమాలోని 'నాటు నాటు..' పాటకు డ్యాన్స్ చేశాడు. 6 జట్లు పోటీపడుతున్న ఐఎస్‌పీఎల్ ఈనెల 15వ తేదీ వరకు జరగనుంది.

గుజరాత్ గెలిచె..



వోల్వార్ట్ (76) మూనీ (85 నాటౌట్)

అదరగొట్టిన వోల్వార్ట్, మూనీ
పోరాడి ఓడిన బెంగళూరు

నేటి మ్యాచ్
యూపీ x ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ సత్తా చాటింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత లీగ్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్లు లారా వోల్వార్ట్ (45 బంతుల్లో 13 ఫోర్లతో 76), కెప్టెన్ బెత్ మూనీ (51 బంతుల్లో 12 ఫోర్లు, సిక్సర్‌తో 85 నాటౌట్) అద్భుత అర్ధ సెంచరీలతో విజృంభించడంతో గుజరాత్ 19 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనింగ్ జోడీ లారా వోల్వార్ట్, బెత్ మూనీ ఆరంభం నుంచే బౌండరీలతో విరుచుకుపడడంతో 5 ఓవర్లలోనే జట్టు స్కోరు హాఫ్ సెంచరీ దాటింది. ఆ తర్వాతా అదే దూకుడుగా ఆడిన ఇద్దరూ తొలి వికెట్‌కు 78 బంతుల్లో 140 పరుగుల భాగస్వామ్యం అందించడంతో జట్టు స్కోరు జెట్‌స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఛేదనలో ఆర్‌సీబీ 20 ఓవర్లలో 180/8 స్కోరుకు పరిమితమై ఓటమిపాలైంది. వారెహామ్ (22 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 48), రిచా ఘోష్ (21 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 30) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ స్మృతి మంధాన 24, ఎలిస్ పెర్రీ 24, డివైన్ 23 పరుగులు చేశారు. జట్టులో నాలుగు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే నిష్క్రమించారు. కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడం, సరైన భాగస్వామ్యాలు నిర్మించలేకపోవడం ఆర్‌సీబీని దెబ్బతీసింది. గుజరాత్ బౌలర్లలో గార్డనర్ రెండు వికెట్లు పడగొట్టింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 199/5 (బెత్ మూనీ 85 నాటౌట్, లారా వోల్వార్ట్ 76; సోఫీ మోలినెక్స్ 1/32, వారెహామ్ 1/36); **బెంగళూరు:** 180/8 (వారెహామ్ 48, రిచా 30, మంధాన 24, పెర్రీ 24, గార్డనర్ 2/23).

కిడాంబి, సింధు బోణీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆంధ్ర షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో కిడాంబి 21-15, 20-22, 21-8తో చౌ టైన్ చెన్ (తైవాన్)పై నెగ్గగా, సింధు 20-22, 22-20, 21-19తో మిచెల్లి లీ (కెనడా)పై అతి కష్టంగా గెలిచి, రెండో రౌండ్‌కి ప్రవేశించారు. మరో సింగిల్స్ పోరులో హెచ్ఎస్ ప్రణయ్ 17-21, 17-21తో లు గ్వాంగ్జు (చైనా) చేతిలో పోరాడి ఓడాడు.

విదర్భ విజయఢంకా

- రంజీ సెమీస్‌లో ఎంపీపై గెలుపు
- 10నుంచి ముంబైతో ఫైనల్



నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ మాజీ చాంపియన్ మధ్యప్రదేశ్ (ఎంపీ)కు సెమీఫైనల్లో భంగపాటు ఎదురైంది. రెండుసార్లు విజేత విదర్భ 62 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్‌ను చిత్తుచేసి ఫైనల్లో ప్రవేశించింది. ఆఖరి రోజు గెలిచేందుకు ఎంపీ జట్టుకు 93 రన్స్ కావాల్సి ఉండగా.. చేతుల్లో 4 వికెట్లు అవసరమయ్యాయి. ఈ నేపథ్యంలో ఐదోరోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 228/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఎంపీ.. విదర్భ బౌలింగ్ దాటికి మరో 30 పరుగులు మాత్రమే చేసి 258 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా విదర్భ సూపర్ విజయంతో మూడోసారి రంజీ ఫైనల్లో అడుగుపెట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే పరిమితమైన విదర్భ.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం 402 స్కోరుతో భారీ స్కోరు చేసింది. మధ్యప్రదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 252 రన్స్‌కే ఆలౌటైంది. యశ్ రాథోడ్ (141)కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. ఈనెల 10 నుంచి జరిగే ఫైనల్లో 41సార్లు చాంపియన్ ముంబైతో విదర్భ ట్రోఫీ కోసం తలపడనుంది. కాగా, గతంలో ఫైనల్ చేరిన రెండు పర్యాయాలూ (2017-18, 2018-19) విదర్భ విజేతగా నిలవడం విశేషం.

రిత్విక్‌కు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. నాసిక్‌లో ఈనెల 4న తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ టోర్నీలో రిత్విక్ 8.5 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. మొత్తం 11 రౌండ్లలో రిత్విక్ ఏడు గేమ్‌ల్లో గెలిచి, మరో మూడింటిని డ్రా చేసుకున్నాడు. ఒక గేమ్‌లో ఓడాడు.

అర్జున్‌కు రెండో డ్రా

ప్రేగ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌ను అర్జున్ డ్రాగా ముగించాడు. రష్యా జీఎం అలెక్సీతో తలపడిన అర్జున్, 30 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించాడు. ఇక, ప్రేగ్ చెస్ ఫెస్టివల్ ఏడో రౌండ్‌లో ప్రజ్ఞానంద-గుకేష్ 91 ఎత్తుల తర్వాత డ్రా చేసుకున్నారు.

'ఖేలో ఇండియా' విజేతలు ప్రభుత్వోద్యోగాలకు అర్హులే!

క్రీడా మంత్రి అనురాగ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల్లోని స్పోర్ట్స్ కోటాలో ఇక నుంచి ఖేలో ఇండియా పతక విజేతలను కూడా పరిగణనలోనికి తీసుకుంటామని కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఈ విప్లవాత్మకమైన నిర్ణయాన్ని తీసుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన వారికే క్రీడా కోటా కింద మేలు జరిగేది. ఇప్పుడు ఈ జాబితాలోకి ఖేలో ఇండియా పతకధారులను కూడా చేర్చామన్నారు.

కివీస్‌తో భారత్ తొలిపోరు
పారిస్ ఒలింపిక్స్ హాకీ షెడ్యూల్

లుసానే: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే పురుషుల హాకీ జట్లు షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. పూల్-బిలో ఉన్న భారత్ తన తొలి మ్యాచ్‌ను జూలై 27న న్యూజిలాండ్‌తో ఆడనుంది. ఆ తర్వాత 29న అర్జెంటీనా, 30న ఐర్లాండ్, ఆగస్టు 1న డిఫెండింగ్ చాంప్ బెల్జియం, ఆగస్టు 2న ఆస్ట్రేలియా జట్లతో గత క్రీడల కాంస్య విజేత భారత తలపడనుంది. పూల్-ఎలో నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, దక్షిణాఫ్రికా జట్లు బరిలో ఉన్నాయి.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

» పంట నష్టం రూ.180 కోట్ల దాకా

» సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.


నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

\- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

\- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నకిలీ పాస్‌పోర్టు కేసులో మరో ఇద్దరి అరెస్టు

» ఎస్‌ఆర్ నగర్‌లో ఆధార్ కేంద్రం నిర్వాహకుడు కూడా..

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించి నకిలీ గుర్తింపు పత్రాలతో పాస్‌పోర్టులు పొందిన శ్రీలంక జాతీయుల కేసులో మరో ఇద్దరు పోలీసుల్ని సీఐడీ అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసిన సీఐడీ తాజాగా మరో ఇద్దర్ని అరెస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఎస్‌బీలో హెడ్‌కానిస్టేబుళ్లుగా పని చేసి పదోన్నతిపై పంజాగుట్ట ట్రాఫిక్ ఏఎస్సైగా బదిలీ అయిన షేక్ నజీర్ బాషా, మారేడ్‌పల్లి ఏఎస్సైగా బదిలీ అయిన తిప్పన్నను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితోపాటు ఎస్‌ఆర్ నగర్‌లో ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్న కొప్పిశెట్టి కల్యాణ్‌నూ ఈ కేసులో సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టైన వారి సంఖ్య 21కి చేరింది. అక్రమంగా పాస్‌పోర్టులు పొంది విదేశాలకు వెళ్లిన 97 మందిలో నలుగుర్ని సీఐడీ గుర్తించింది. వారిని తిరిగి భారత్‌కు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి వేతనాలు చెల్లించండి

» సీఎంకు ఎమ్మెల్యే కూనంనేని లేఖ

ఎన్‌హెచ్‌ఎం పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కూనంనేని బుధవారం లేఖ రాశారు. ఈ మిషన్‌లో 17 వేల మంది పని చేస్తున్నారని, మూడు నెలలుగా జీతాలు అందడంలేదని లేఖలో పేర్కొన్నారు.

సాయిబాబా విడుదలకు నాగ్‌పూర్ జైలు నిరాకరణ!


హైదరాబాద్/న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో పదేళ్లుగా జైలులో ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించి, ఆయనపై ఉన్న కేసును కొట్టివేసినప్పటికీ ఆయనను విడుదల చేసేందుకు నాగ్‌పూర్ జైలు నిరాకరించిందని న్యాయవాది నిహాల్ సింగ్ రాథోడ్ తెలిపారు. సమయం అయిపోయిందన్న కారణంగా సాయిబాబాను బుధవారం విడుదల చేయలేదని ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా చెప్పారు. కాగా, సాయిబాబా విడుదల చేయకపోవడం దుర్మార్గమని చర్య అని సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణ అన్నారు. సాయిబాబ, వరవరరావులను బేషరుతుగా తక్షణమే విడుదల చేయాలని కోరారు.

నిరసన దీక్షకు అనుమతించండి: ఎమ్మెల్సీ కవిత

భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టదలచిన నిరసన దీక్షకు అనుమతించాలని డీజీపీ రవిగుప్తకు ఆ సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీజీపీతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ నియామకాల్లో జీవో 3 వల్ల మహిళలకు రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అన్యాయంపై నిరసన దీక్ష చేపట్టాలని భావిస్తున్నామని పేర్కొన్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)


ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగు నీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

పి.సుశీలకు గౌరవ డాక్టరేట్



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మార్చి 6: తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం సందర్భంగా ప్రఖ్యాత గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను నేడు అందజేయనుంది. ఉదయం 11.15 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. పి.సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను ఆయన అందజేయనున్నారు.

కాలుష్య నియంత్రణ బోర్డులో అవినీతి అధికారులు

» మండిపడిన హైకోర్టు

» సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ప్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీ చేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చినా.. సదరు అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. దీన్ని సవాల్ చేస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఏడునెలలుగా మేం పీసీబీ పని తీరును గమనిస్తున్నాం. కొంతమంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరికొంత మంది అధికారులు ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే..! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాగితాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

» కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

» పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎమ్ నిధుల నిలిపివేత

» తెలంగాణకు తప్ప అన్ని రాష్ట్రాలకు విడుదల

» రూ.877 కోట్లు విడుదలను ఆపేసిన కేంద్రం

» ఉద్యోగులకు పెండింగ్‌లో 4నెలల జీతాలు

» విడుదల చేయాలంటూ కేంద్రానికి సర్కారు లేఖ

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్) నిధులను కేంద్రం నిలిపివేసింది. ఈ నిధులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. నిధుల నిలిపివేత వల్ల ఎన్‌హెచ్‌ఎమ్ పరిధిలోని కీలకమైన ఆరోగ్య పథకాలు నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర వైద్యమంత్రి మాన్సుఖ్ మాండవీయకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తాజాగా లేఖ రాశారు. ఎన్‌హెచ్‌ఎమ్ కింద రాష్ట్రానికి రావాల్సిన మూడో విడత నిధుల కోసమే నిరుడు నవంబరులోనే విజ్ఞప్తి చేసిన విషయాన్ని అందులో గుర్తు చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.877 కోట్లు రావాల్సి ఉంది. వాటన్నింటిని గత కొన్ని నెలలుగా కేంద్రం ఆపేసింది. దీంతో ఎన్‌హెచ్‌ఎమ్‌లో పనిజేసే ఉద్యోగులందరికీ గత నాలుగు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. విచిత్రంగా ఇవే నిధులను మిగతా అన్ని రాష్ట్రాలకు కేంద్రం సకాలంలో విడుదల చేసింది. పొరుగున ఉన్న కర్ణాటక, ఏపీ సహా అన్ని రాష్ట్రాలకు డబ్బులు విడుదల చేసింది. తెలంగాణకు జాతీయ ఆరోగ్యమిషన్ కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1480.22 కోట్ల బడ్జెట్‌కు కేంద్రం అనుమతినిచ్చింది. ఇందులో రూ.888.13 కోట్లు కేంద్రం వాటా (60 శాతం) కాగా, రాష్ట్ర వాటా కింద 40శాతం అంటే రూ.592.09 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ కింద ఇవ్వాలి. ఇందులో కేంద్రం తన వాటా కింద ఇచ్చే నిధులను నాలుగు క్వార్టర్స్ కింద ఇస్తుంది. ఇందులో ఇప్పటికి కేవలం రూ. 540.59 కోట్లనే విడుదల చేసింది. మరో రెండు క్వార్టర్స్‌కు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి ప్రతి మూడు మాసాలకు ఈ నిధులను విడుదల చేయాల్సి ఉంటుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. మరో 24 రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుంది. మరో రెండు క్వార్టర్‌లకు సంబంధించిన రూ.347.54 కోట్ల నిధులు ఆగిపోయాయి. ఇవే కాక పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసుల కింద తెలంగాణకు ఎన్‌హెచ్‌ఎమ్ స్కీమ్స్‌లో భాగంగా మరో రూ.306 కోట్లు, మెడికల్ రియింబర్స్‌మెంట్ కింద రూ.231కోట్లను కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాల్సివుంది. వెరసి మొత్తం రూ.877కోట్లు కేంద్రం నుంచి రావాల్సివుంది.

ఇప్పటికే ఎన్‌హెచ్‌ఎమ్ నిధుల్లో తీవ్ర అన్యాయం

ఎన్‌హెచ్‌ఎమ్ నిధుల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు లెక్కలతో సహా చెబుతున్నారు. 2020-21 నుంచి 2023-24 మధ్య కాలంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి రూ.1,11,168.47 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఇందులో గత నాలుగేళ్లల్లో రాష్ట్రానికి కేవలం రూ.2621 కోట్లను కేంద్రం విడుదల చేసింది. మన రాష్ట్రానికి విడుదలైన నిధుల పరంగా చూస్తే దేశంలో 15వ స్థానంలో ఉంది. మొత్తం నిధుల్లో మనకు వచ్చినది 2.35 శాతమే. ఎన్‌హెచ్‌ఎమ్ ద్వారా అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు కేంద్రం రూ.15,872.51 కోట్లు ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు రూ.9,051 కోట్లు, మహారాష్ట్రకు రూ.7,661 కోట్లు, అస్సోంకు రూ.7207 కోట్లు రాజస్థాన్‌కు రూ.7,056 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది. కేవలం ఆ ఐదు రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎమ్ కింద మొత్తం విడుదల చేసిన నిధుల్లో 42.12 శాతం ఫండ్స్‌ను ఇచ్చినట్లు ఆ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమే జాతీయ ఆరోగ్య మిషన్ ముఖ్య లక్ష్యం. ఆ ప్రాంతాల్లో నివసించే పేదలు, మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ లభ్యత, వైద్య సౌకర్యాలను అందుబాటులో ఉంచడం జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగం.



పోర్టల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి , చిత్రంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ తదితరులు

భద్రాచలం ఆలయ అభివృద్ధికి నిధులిస్తాం..

- సమగ్ర ప్రణాళికతో రావాలి: డిప్యూటీ సీఎం భట్టి
- మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి సమీక్ష

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీని కోసం ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి భద్రాచల ఆలయ అభివృద్ధి పనులు, సీఎం పర్యటనపై ఆయన సమీక్ష నిర్వహించారు. దేవాలయం చుట్టూ రెండు ప్రాకారాలు, రోడ్డు నిర్మాణానికి అధికారుల వద్ద ఉన్న ప్రణాళికను భట్టి అడిగి తెలుసుకున్నారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సమీక్షించారు. ఈనెల 11న సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టనున్న భద్రాచల పర్యటన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఇంజనీరింగ్, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శ్రీరామనవమి, పట్టాభిషేకం, ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు.

ఆన్‌లైన్ విద్యుత్ సేవల పోర్టల్ ప్రారంభం

హై టెన్షన్ (హెచ్‌టీ) లైన్ల తరలింపు, 132/220/440 కేవీ కొత్త సర్వీసులు, 11/33 కేవీ లైన్ల కోసం ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించిన పోర్టల్‌ను భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా వినియోగదారులు ఇంటి నుంచే విద్యుత్తు సేవలు పొందవచ్చని విక్రమార్క చెప్పారు. దరఖాస్తు ఏ దశలో ఉంది, ఎప్పటిలోగా పరిష్కారం అవుతుందనే అంశాలను పోర్టల్‌లో తెలుసుకోవచ్చన్నారు. వినియోగదారులు ట్రాన్స్‌కోకు సంబంధించి (www.tstransco.in), దక్షిణ డిస్కమ్-హైదరాబాద్ (www.tssouthernpower.com), ఉత్తర డిస్కమ్-వరంగల్ (www.tsnpdcl) వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఈ ఏడాది 4.50 లక్షల 'ఇందిరమ్మ ఇళ్లు'

- 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా నిర్మాణం
- మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికే
- 11న పథకం ప్రారంభం: పొంగులేటి

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు పక్కా ఇళ్లు నిర్మించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను ఏలిన గత పాలకులు ఈ కర్తవ్యాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను సాకారం చేయబోతోందన్నారు. ఈ నెల 11న భద్రాచలం రామయ్య సన్నిధిలో ఐదో గ్యారెంటీ కింద సీఎం రేవంత్ ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. బుధవారం సచివాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో 'ఇందిరమ్మ ఇల్లు' పథకంపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రాష్ట్రంలో ఇల్లు లేని వారికి స్థలం ఇవ్వడంతోపాటు స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందించడానికి అవసరమైన కార్యాచరణను ప్రారంభించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా నిర్మించాలని, ఒక హాలు, బెడ్‌రూం, వంట గది, బాత్‌రూమ్ ఉండాలని తెలిపారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఈ ఏడాది 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని, ఆయా ఇళ్లను మహిళల పేరు మీదే ఇస్తామని తెలిపారు. అదే విధంగా మొదటి దశలో సొంత స్థలం ఉన్నవారికే పథకం కింద రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆహార భద్రత కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. పథకం మార్గదర్శకాలను విడుదల చేయాలని అధికారులకు సూచించారు. పథకాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. కాగా 'ఇందిరమ్మ ఇల్లు' పథకం తొలివిడతలో సొంత స్థలం ఉన్నవారికే అందనుందని, అదే విధంగా ఆహార భద్రత కార్డే ప్రామాణికంగా లబ్ధిదారుల గుర్తింపు ఉంటుందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఈ మేరకు 'ఇందిరమ్మ ఇల్లు.. స్థలం ఉన్న వారికే' శీర్షికన మంగళవారం కథనం ప్రచురించింది.

శివరాత్రి ఉత్సవాలకు నిధులు విడుదల

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ ఆలయాల్లో నిర్వహించే ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 'స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఫర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్' పథకం కింద.. ఉత్సవాల నిర్వహణకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర గుట్ట రామలింగేశ్వర స్వామి దేవాలయానికి కోటి, మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గా మాత దేవాలయానికి 2 కోట్లు విడుదల చేసింది.

ముస్లిం ఉద్యోగులకు రంజాన్ వెసులుబాటు

రంజాన్ నెలలో ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్లిం ఉద్యోగులు గంట ముందుగానే విధుల నుంచి వెళ్లేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి వచ్చేనెల 11 వరకు ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లిపోవచ్చని అందులో పేర్కొన్నారు.

ఏసీబీ పట్ల నమ్మకం పెరిగింది: సీవీ ఆనంద్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో ఏసీబీ పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఇటీవల సేవ, ఉత్తమ సేవ, ఉత్కృష్ట సేవ పతకాలను సాధించిన సిబ్బందికి సీవీ ఆనంద్ మెడల్స్ అందజేశారు. ఏసీబీ నుంచి ఇతర విభాగాలకు బదిలీ అయినవారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా వస్తున్న ఫిర్యాదులపై సత్వర స్పందన, కేసుల నమోదుతో ప్రజల్లో ఏసీబీపై విశ్వాసం పెరిగిందన్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడ్డవారి కేస్ డైరీ రాసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన సిబ్బందికి వివరించారు.

ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం క్యాంపు ఆఫీస్..!

ఎంసీహెచ్‌ఆర్‌డీ ఆవరణలో గెస్ట్ హౌజ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ జనరల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శశాంక్ గోయెల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు కూడా మంజూరు చేశారు. నూతనంగా నిర్మించనున్న ఈ గెస్ట్ హౌజ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌గా వినియోగించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సీఎం తన సొంత నివాసంలోనే ఉంటున్నారు. నిత్యం తన కోసం వచ్చే సందర్శకులను కలిసేందుకు, ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఎలాంటి క్యాంప్ ఆఫీస్ లేదు. అందుకే ఎంసీహెచ్‌ఆర్‌డీలో నిర్మించనున్న గెస్ట్ హౌజ్‌ను సీఎం క్యాంప్ ఆఫీస్‌గా వినియోగిస్తారని సమాచారం.





పాలమూరు ప్రజాదీవెన సభకు హాజరైన జనం; సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మా ప్రభుత్వాన్ని టచ్ చేస్తే..

మానవ బాంబులే

(మొదటిపేజీ తరువాయి)

ఏదో చేద్దామని. ఒక్కొక్కన్ని పండవెట్టి తొక్కి పేగులు తీస్కొని మెడల ఏస్కొని ఊరేగుతం బిడ్డా ఎవడన్నా ఈ ప్రభుత్వం మీదకొస్తే. ఆషామాషీగా అల్లాటప్పగా ఒచ్చినోళ్లం కాదు బిడ్డా.. నల్లమల్ల అడవి నుంచి తొక్కుకుంట తొక్కుకుంట.. ప్రగతి భవన్‌లో ఉన్న నిన్ను కంచెలు బద్దలు కొట్టి బజార్ల కీడ్చినం' అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నాయని, తాజాగా అధికారంలోకి వచ్చిన తమ పార్టీ కాంగ్రెస్ మరోసారి పదేళ్లు అధికారంలో ఉంటుందని చెప్పారు. ప్రజాదీవెనసభలో లోక్‌సభ ఎన్నికలతోపాటు, ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సీఎం రేవంత్‌రెడ్డి శంఖారావం పూరించారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లు అధికారంలో ఉండి పందికొక్కుల్లా రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని.. తాము మాత్రం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే పలు గ్యారెంటీలను అమలు చేస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కాకిలెక్కలు చెప్పుకుంటూ.. భ్రమలు కల్పిస్తూ.. ఎన్నో చిక్కుముడులు వేస్తే.. వాటిని తాము విప్పుతున్నామన్నారు. బీఆర్ఎస్ అంటే ఏమిటో తెలుసా అని ఒకాయన తనను అడిగారని, తాను భారత రాష్ట్ర సమితి అని చెబితే.. కాదు కాదు.. బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి అని చెప్పారని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్‌రావులను చూస్తే అలాగే అనిపిస్తోందన్నారు. ఎస్సీల వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఇప్పటికే మంత్రి దామోదర రాజనర్సింహ సారథ్యంలో ఆ దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. కానీ పదేళ్లు మాదిగలను వంచించి, మోసగించిన దొర దగ్గరకు వెళ్లడం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు న్యాయమా? అని ప్రశ్నించారు. దేశ ప్రధాని తెలంగాణకు వస్తే ఆయనను గౌరవించానని, రాష్ట్రానికి కావాల్సిన నిధులను, పనులను అందరి ముందే అడిగానని.. అంతేగానీ, చెవిలో గుసగుస పెట్టి, తలుపులు మూసి, కడుపులో తలకాయ పెట్టలేదని సీఎం పేర్కొన్నారు. కేంద్రంతో ఘర్షణ ఉంటే రాష్ట్రానికి, ప్రజలకు నష్టం కలుగుతుందనే భావనతోనే ప్రధాని మోదీని సముచితంగా గౌరవించానని, కానీ అడిగిన నిధులు, పనులు మంజూరు చేయకపోతే చాకిరేవు పెట్టే బాధ్యత కూడా తానే తీసుకుంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు దూలం లెక్క పెరిగిండు కానీ దూడకున్నంత బుద్ధి కూడా లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చి 90 రోజులే అవుతోందని, ఇంతలోనే ఏం చేశారని అడుగుతున్న వారు.. 3,650 రోజులు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మోదీ, కేడీ పాలమూరుకు జాతీయ హోదా ఇచ్చారా? కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు పూర్తిచేశారా? అని ప్రశ్నించుకోవాలన్నారు. కరీంనగర్‌లో చావు తప్పి కన్ను లొట్టబోయి పాలమూరుకు వస్తే ఆ బేకార్‌గాన్ని ఇక్కడి ప్రజలు గెలిపించారని, కానీ, ఇప్పుడు పాలమూరు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేకపోతున్నాడని రేవంత్ తీవ్ర విమర్శలు చేశారు.

హోష్‌లో ఉండి జోష్‌తో పని చేస్తా

అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ పెంపు, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఆడబిడ్డల కోసం రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించామని, నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున నిర్మించబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11వ తేదీన ప్రారంభించబోతున్నామని సీఎం ప్రకటించారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని, 30 వేల ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు 11 వేల పైచిలుకు ఉద్యోగాలకు డీఎస్సీ నోటిఫికేషన్, 565 ఉద్యోగాల కోసం గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఇదంతా తమ పనితీరుకు నిదర్శనమన్నారు. తాను తాగుబోతు తిరుగుబోతును కాదని ఎప్పుడూ హోష్‌లో ఉండి జోష్‌తో పని చేస్తానని తెలిపారు. కొడుకును సీఎం చేద్దామనుకుంటే పాలమూరు పిలగాడు వచ్చిండని కేసీఆర్‌కు జలసీ వచ్చిందని విమర్శించారు. హరీశ్ తన మామకు ఒంట్లో మంచిగ లేక అసెంబ్లీకి రాలేదని చెప్పిండని, మరి అలాంటోడు నల్గొండకు గాడ్దులను కాయడానికి పోయారా? అని విమర్శించారు.

పాలమూరుకు ప్రత్యేక ప్రణాళిక

'నల్లమల బిడ్డనైన నన్ను 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా, 2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా, 2009, 2014, 2023లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గుండెల్లో పెట్టుకుని గెలిపించుకున్న పాలమూరు ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ఇది జరుగుతోంది' అని సీఎం వెల్లడించారు. ప్రజలు విశ్వాసంతో తమను గెలిపించారని, వారి నమ్మకం వమ్ముకాకుండా తనతోపాటు మంత్రులు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ 14 స్థానాలు గెలవడం ఖాయమని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి

ఇటీవల కోస్గిలో జరిగిన బహిరంగ సభలో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించినట్లుగానే.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి పేరును సీఎం ప్రకటించారు. జీవన్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే.. ఎంపీటీసీ, జడ్పీటీసీల హక్కులతోపాటు, వారికి రావాల్సిన పెండింగ్ బకాయిలను కూడా ఇప్పించేందుకు పనిచేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుస్థిరంగా పరిపాలన అందిస్తుంటే.. కేసీఆర్ తన ఉనికిని కాపాడుకోడానికి బీఎస్పీ నేత ప్రవీణ్ కుమార్ కాళ్లు పట్టుకున్నారని, బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ.. మూడు బీలు కలిసినా కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...ఒక మాదిగ బిడ్డ డిప్యూటీ సీఎం అయితే మూడు నెలల్లోనే తొలగించారని, ఆ తర్వాత మాదిగలకు క్యాబినెట్‌లో స్థానమే ఇవ్వలేదన్నారు.

భారీగా హాజరైన జనం

మహబూబ్‌నగర్, మార్చి 6: పాలమూరులో నిర్వహించిన ప్రజాదీవెన సభ సక్సెస్ అయింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత మొదటిసారి మహబూబ్‌నగర్‌కు వస్తుండటంతో జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్యనేతలు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా జనసమీకరణ చేశారు. ఎంవీఎస్ కళాశాల మైదానం జనంతో కిటకిటలాడింది. దాదాపు 50 వేల మంది వరకు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచే మైదానానికి చేరుకున్నారు. రాత్రి 7 గంటలకు కూడా వస్తూనే ఉన్నారు. మైదానం వెలుపల కూడా భారీ సంఖ్యలో ప్రజలు కనిపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని జనం ఆసక్తిగా విన్నారు.

కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం!

- రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయి
- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కరువు వచ్చినా, ఎంత కష్టం వచ్చినా.. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, కలిసికట్టుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవడంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని, అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాల్సిందిగా కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. రైతులందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎండాకాలంలో తాగునీటి కష్టాలు రాకుండా చూసేందుకు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సీఎం తన నివాసం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సీజన్‌లో రైతులు ఎదుర్కొనే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారాలు సూచించేందుకు రైతునేస్తం ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వమే ప్రజల దగ్గరికి వెళ్లాలని, రైతుల సమస్యలను తెలుసుకోవాలనే ఆలోచనతో వ్యవసాయశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రైతులతో కలిసి భవిష్యత్తు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని, విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలుకొని.. పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. పంటలకు లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులు కేవలం వరి, పత్తి మిర్చి పంటలకే పరిమితం కావద్దని, ఇతర పంటలు సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రస్తుతం 110 సెంటర్లలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నామని, భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తామని చెప్పారు.

ప్రతి వారం రైతునేస్తం కార్యక్రమం..

రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రభావం పెరిగిందని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఫామ్ మెకనైజేషన్‌కు భారీగా నిధులు కేటాయించామని తెలిపారు. డ్రిప్ యూనిట్లు, స్ప్రింక్లర్లు రైతులకు ఇచ్చి ప్రోత్సహించామని గుర్తు చేశారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఫామ్ మెకనైజేషన్‌కు ఏమాత్రం నిధులు కేటాయించకపోవటంతో రైతులు నష్టపోయారని అన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడటంతో జలాశయాల్లో నీళ్లు అడుగంటుతున్నాయని, అందరూ సమిష్టిగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కొన్ని శక్తులు కావాలని దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కాగా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. వివిధ రైతు వేదికల నుంచి ఆన్‌లైన్‌లో రైతులతో ఆయన సంభాషించారు. సేంద్రియ సాగుకు ప్రభుత్వ మద్దతు ఉంటుందని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధరను పొందేలా మార్కెట్ అవకాశాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు.

రంగంలోకి డ్యామ్ సేఫ్టీ నిపుణుల కమిటీ

నేడు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పరిశీలన

రేపు సుందిళ్ల బ్యారేజీ వద్దకు కమిటీ

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడానికి జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ రంగంలోకి దిగింది. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న కమిటీ ప్రతినిధులు, జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ కమిటీ సభ్యులు గురువారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల దాకా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 3:15 గంటలకు అన్నారం చేరుకొని.. సాయంత్రం 6:30 గంటల దాకా అన్నారం బ్యారేజీని పరిశీలించనున్నారు. ఆ తర్వాత రాత్రి రామగుండంలో విడిది చేయనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా సుందిళ్ల బ్యారేజీని పరిశీలించి, అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత 9వ తేదీన ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ ప్రతినిధులు జలసౌధలో నీటిపారుదల శాఖ అధికారులతో ఉదయం 10:30 గంటల నుంచి 1:30 గంటల దాకా సమావేశం కానున్నారు. అనంతరం ఢిల్లీ లేదా పుణెకు బయలుదేరి వెళ్లనున్నారు. అయితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన 19 రకాల సమాచారం ఇవ్వాలని కమిటీ కోరింది. ఆ సమాచారంపై అధికారులతో చర్చించి, ఢిల్లీ చేరుకునే అవకాశాలున్నాయి. మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకుకు సంబంధించిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ) నివేదిక ప్రభుత్వానికి చేరడంతో.. ఆ రిపోర్టును కూడా ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

లహరి ఏసీ స్లీపర్ బస్సుల్లో 10 శాతం రాయితీ: టీఎస్ఆర్టీసీ

దూర ప్రాంతాలకు వెళ్లే లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో చార్జీలపై ప్రయాణికులకు 10 % రాయితీ కల్పించాలని టీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. సాధారణ టికెట్ ధరలో ప్రయాణికులు బుక్ చేసుకునే బెర్త్‌లపై ఏప్రిల్ 30వ తేదీ వరకు ఈ రాయితీని అందిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు తిరిగే అన్ని రూట్లలో ఈ రాయితీ వర్తిస్తుందని వారు తెలిపారు. ఈ రాయితీని వినియోగించుకుని, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందంటే..

ఆ పాపం మోదీ సర్కారుదే!

పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంతో కేంద్రం మిలాఖత్.. పలు కార్పొరేషన్లు, బ్యాంకుల ద్వారా రూ.84 వేల కోట్లు ఇచ్చింది

- కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణ ఎందుకు జరపలేదు?
- రూ.94 వేల కోట్లతో కట్టిన బ్యారేజీలను వృథాగా వదిలేయలేం
- వానాకాలానికి ముందే రిపేర్లు చేసి వాడుకుంటాం: మంత్రి ఉత్తమ్
- జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీతో సమావేశం



ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు మంత్రి ఉత్తమ్ సాదర స్వాగతం

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారడానికి ప్రధాన కారణం మోదీ ప్రభుత్వమేనని.. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉంటూ రాష్ట్రంలోని బీఆర్ఎస్‌తో బీజేపీ అలయ్‌బలయ్ చేసుకుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. వివిధ కార్పొరేషన్లు/బ్యాంకుల ద్వారా రూ.84 వేల కోట్లకు పైగా రుణాలను కాళేశ్వరం ప్రాజెక్టుకు అందించింది కేంద్రంలోని బీజేపీయేనని ఆరోపించారు. రెండు రోజులు రాష్ట్రంలో పర్యటించిన మోదీ తమపై విచిత్రమైన ఆరోపణలు చేశారని ఆయన తప్పుపట్టారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతిపై ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పట్టుమని 3 నెలలు కాలేదని.. అయినా, బ్యారేజీల కుంగుబాటుపై విచారణ చేపట్టామని, న్యాయవిచారణ చేయాల్సిందిగా హైకోర్టును కోరామని.. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ)కి చెందిన నిపుణుల కమిటీతో బ్యారేజీలను పరిశీలింపజేస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉండీ ఏమీ చేయలేక.. 3 నెలలు కూడా పూర్తిచేసుకోని రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడం తగదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కాళేశ్వరం కుంభకోణంపై సీబీఐ విచారణ చేయలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం బ్యారేజీలను పరిశీలించడం కోసం బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ బృందానికి మంత్రి ఉత్తమ్ సాదర స్వాగతం పలికారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం డ్యామ్ సేఫ్టీ) బి. నాగేంద్రరావుతో కలిసి జలసౌధలో ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీతో భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి.. ఎన్‌డీఎస్ఏ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. బ్యారేజీల కుంగుబాటుకు గల కారణాలను వెలికితీసి నాలుగు నెలల్లో నివేదిక ఇస్తామని కమిటీ చెప్పిందని.. కానీ, సత్వరమే నివేదిక అందజేయాల్సిందిగా తాము కోరామని ఉత్తమ్ వెల్లడించారు. బ్యారేజీ పునరుద్ధరణ/ మరమ్మతులకు తీసుకోవాల్సిన స్వల్ప, దీర్ఘకాలిక చర్యలపై వానాకాలానికి ముందే సిఫారసులు చేయాల్సిందిగా కోరినట్టు వివరించారు. వీలైనంత త్వరగా నివేదిక ఇస్తే వానాకాలంలోపు మరమ్మతులు చేసి, బ్యారేజీలను వినియోగించుకుంటామన్నారు. రూ.94 వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టులోని బ్యారేజీలను వృథాగా వదిలేయలేమని.. వాటిని మరమ్మతులు చేసి, కచ్చితంగా వాడుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ఎవ్వరినీ వదిలిపెట్టబోం..

ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా.. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీపై చర్యలుంటాయని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలకు పాల్పడ్డ వారినెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీకి సహాయంగా ఉండటానికి వీలుగా ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) బి.నాగేంద్రరావుకు బాధ్యతలు అప్పగించినట్టు చెప్పారు. కాళేశ్వరం అక్రమాలపై హైకోర్టు సిటింగ్ జడ్జిని వేయాలని కోరగా అందుకు హైకోర్టు తిరస్కరించిందని.. ఈ నేపథ్యంలో హైకోర్టు/సుప్రీంకోర్టు మాజీ జడ్జితో విచారణ జరిపించే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. కాళేశ్వరం బ్యారేజీల్లోని అన్ని బ్లాకులకూ పరీక్షలు చేయిస్తామని ప్రకటించారు.

జియోగ్రాఫికల్, సెక్షనల్ డ్రాయింగ్‌లిచ్చాం

అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన జియోగ్రాఫికల్, సెక్షనల్ డ్రాయింగ్‌లను నిపుణుల కమిటీ కోరిందని.. వాటిని అందించామని ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ వెల్లడించారు. అయితే.. విస్తృతంగా ఈ వివరాలు ఇవ్వాల్సిందిగా కమిటీ కోరినట్టు ఆయన తెలిపారు. గురువారంమేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను, శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించిన అనంతరం నిపుణుల కమిటీ 9న హైదరాబాద్‌కు చేరుకుంటుందని.. 2016-2019 నడుమ వాటి నిర్మాణంలో పాల్గొన్న అధికారులతో పాటు నిర్మాణ సంస్థలతో కమిటీ ఆ రోజు భేటీ అవుతుందని అనిల్ కుమార్ వివరించారు. థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ నివేదిక అందించాలని కమిటీ కోరగా.. ఆ విధానాన్ని గత ప్రభుత్వం రద్దు చేయడం వల్లే ఆ నివేదికలు లేవని వెల్లడించినట్టు తెలిపారు.

'త్వరలోనే గడ్డం తీస్తా... ఇంట్లోనూ ఒత్తిడి పెరిగింది:ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి త్వరలోనే తన గడ్డం గీయిస్తారట..!! గడ్డం చేయించుకోమని కుటుంబసభ్యులు కూడా ఆయన్ను ఒత్తిడి చేస్తున్నారట..!!. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దె దించే వరకు గడ్డం తీయనని ఉత్తమ్ కుమార్ రెడ్డి 2016లో శపథం చేశారు. అప్పట్నించి ఆయన గడ్డం తీయించలేదు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైన తర్వాత ఉత్తమ్ గడ్డంపై తీవ్ర చర్చ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో 'గడ్డం ఎప్పట్లోగా తీస్తారు' అని మంత్రిని ఆరా తీయగా... 'త్వరలోనే గడ్డం గీయిస్తా... ఇంట్లో కూడా ఒత్తిడి పెరిగింది' అని సరదాగా బదులిచ్చారు. అయితే, గడ్డంతో ఇలాగే అలవాటై పోయిందని ఆయన అనడం కొసమెరుపు.

కాంగ్రెస్ గూటికి కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత కోనేరు కోనప్ప ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్, బీఎస్పీ దోస్తీ కుదిరిన నేపథ్యంలో కాంగ్రెస్ గూటికి చేరాలని ఆయన నిర్ణయించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సిర్పూరులో బీఆర్ఎస్ నుంచి కోనప్ప, బీజేపీ నుంచి హరీశ్‌బాబు, బీఎస్పీ నుంచి ప్రవీణ్‌కుమార్ పోటీపడగా.. స్వల్ప తేడాతో కోనప్పపై హరీశ్ బాబు విజయం సాధించారు. ఇక్కడి నుంచి పోటీ చేసిన ప్రవీణ్‌కుమార్‌కు 40,000కుపైగా ఓట్లు రావడంతో కోనప్ప విజయావకాశాలు సన్నగిల్లాయి. ఈ క్రమంలో బుధవారం బీఎస్పీతో పొత్తు పెట్టుకున్నట్టు కేసీఆర్ ప్రకటించడంతో కోనప్ప అసంతృప్తికి గురయ్యారు. తన అనుచరులను హైదరాబాద్‌కు పిలిపించుకొని చర్చించారు. తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తర్వాత సీఎం రేవంత్‌ను కలిశారు. కాగా తమతో ఒక్క మాటైనా చెప్పకుండా బీఆర్ఎస్‌తో పొత్తు ఎలా పెట్టుకుంటారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై బీఎస్పీ క్యాడర్ మండిపడుతోంది. ఈ మేరకు మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి నివాసంలో ఆయా మండలాల నాయకులు, ఇతర నేతలు సమావేశమయ్యారు. పొత్తు ఎవరితో ఉన్నా ఎంపీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ టికెట్‌ను సిడాం గణపతికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

తూప్రాన్ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

తూప్రాన్, మార్చి 6: మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ చేజారింది. మున్సిపల్ కార్యాలయంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లకు గాను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 11 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒక్కరు, మరో ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. అనంతరం ఇద్దరు స్వతంత్రులు బీఆర్ఎస్‌లో చేరడంతో అదే పార్టీకి చెందిన బొంది రాఘవేందర్‌గౌడ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హస్తం గూటికి చేరారు. దాంతో కాంగ్రెస్ బలం పదికి పెరిగింది. కోరం ఉండటంతో చైర్మన్‌పై ఆర్డీవో జయచంద్రారెడ్డి అవిశ్వాస తీర్మానానికి ఓటింగ్ కోరగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితోపాటు, పది మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. దాంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

రాడిసన్ డ్రగ్స్ పార్టీ కేసు..ఫైజల్‌కు గోవా లింకులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ బ్లూ కొకైన్ పార్టీ కేసులో గచ్చిబౌలి పోలీసులు తీగ లాగితే.. గోవా డ్రగ్స్ కింగ్‌పిన్‌ల డొంకలు కదులుతున్నాయి. గోవా డ్రగ్స్ డీలర్లకు హైదరాబాద్‌లో ఫైజల్ అనే వ్యక్తి ఏజెంట్ అని దర్యాప్తు అధికారులు గుర్తించారు. అతని ద్వారా మిర్జా అలీ బేగ్‌కు డ్రగ్స్ అందాయని, వీరి మధ్య అబ్దుల్ రహ్మాన్ వారధిగా ఉన్నట్లు నిగ్గు తేల్చారు. ఈ నెట్‌వర్క్‌ను మూలాల నుంచి ఛేదించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గోవాలోని కొల్వాలే జైలులోంచే డ్రగ్స్ కింగ్‌పిన్‌లు తమ నెట్‌వర్క్‌ను ఆపరేట్ చేస్తున్నట్లు ఆధారాలను సేకరించారు. గోవా డ్రగ్స్ కింగ్‌పిన్‌లకు పలు రాష్ట్రాల్లో ఏజెంట్లు ఉన్న నేపథ్యంలో.. ఆయా రాష్ట్రాల పోలీసులకు సమాచారాన్ని అందించాలని సైబరాబాద్ పోలీసులు నిర్ణయించినట్లు తెలిసింది. రహ్మాన్, ఫైజల్‌ను అదుపులోకి తీసుకుని, విచారిస్తే.. గోవా లింకులపై పూర్తిస్థాయిలో ఆధారాలు బయటపడతాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. కాగా.. రాడిసన్ కొకైన్ పార్టీలో తొమ్మిది మంది పాల్గొన్నట్లు గచ్చిబౌలి పోలీసులు గుర్తించగా.. వారిలో నీల్ తప్ప మిగతా అందరూ విచారణకు హాజరయ్యారు. నీల్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్స్ పార్టీకి అనుమతినిచ్చిన రాడిసన్ హోటల్ యాజమాన్యంపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

నేడు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

న్యూఢిల్లీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో పార్టీ తరపున అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం సమావేశం కానుంది. ఢిల్లీలో జరిగే సమావేశంలో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఒకట్రెండు రోజుల్లోనే తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉంది. టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్ కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నట్లు తెలిసింది. తెలంగాణలో మొత్తం 17 సీట్లు ఉండగా, సగానికిపైగా సీట్ల విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చినట్లు సమాచారం. చేవెళ్ల, సికింద్రాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, జహీరాబాద్, మెదక్‌తోపాటు మరికొన్ని స్థానాలకు తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. భువనగిరి, ఖమ్మంలో ఏదైనా ఒక స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని రాష్ట్ర నేతలు కోరడం, ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడం వంటి పరిణామాల దృష్ట్యా ఆయా స్థానాలకు అభ్యర్థులను ఎంపికకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ సింగ్ ఠాగూర్

ఖమ్మం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పశ్చిమబెంగాల్‌కు ప్రదీప్‌సింగ్ ఠాగూర్ ఎన్నికయ్యారు. 21 మంది సెంట్రల్ కమిటీ, 9మంది పొలిట్ బ్యూరో, ముగ్గురు కంట్రోల్ కమిషన్ సభ్యులను 'మాస్‌లైన్ ఆవిర్భావ ఐక్యత సదస్సు' ప్రతినిధులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా త్రిపురకు చెందిన సుభాష్‌దేబ్, తెలంగాణకు చెందిన పోటు రంగారావు, కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా రాయల చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.

ఇంటర్ ఫస్టియర్ గణితం పేపర్లో తప్పులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 6 : బుధవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం గణితం -1బి పేపర్‌లో తప్పులు రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. 19, 20, 21 ప్రశ్నల్లో అక్షర దోషాలు ఉండటంతో అయోమయానికి లోనయ్యారు. ఎల్ ఎక్స్‌కు బదులు వన్ ఎక్స్ అని, ఎల్ స్థానంలో వన్ అని రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అలాగే 21వ ప్రశ్నలో 3ఎల్‌కు బదులు 31 రావడంతో ప్రశ్న పూర్తిగా మారిపోయింది. కాగా, పరీక్షా పత్రాన్ని తప్పుల తడకగా ముద్రించిన ఇంటర్మీడియెట్ బోర్డు నిర్లక్ష్య వైఖరిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ

కూకట్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెల 29వ తేదీన జరిగిన చోరీ కేసులో కూకట్‌పల్లి పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు కార్యాలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు వారి విచారణలో తెలిసింది. కార్యాలయంలోని రికార్డు గదిలోకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న గ్రిల్స్ తొలగించడంతో పాటు గది తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు కనుగొన్నారు. రిజిస్ట్రార్ ఆఫీసు చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల విచారణలో భాగంగా ఇప్పటివరకు 5 వాల్యూమ్స్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు చోరీకి గురైనట్లు తేలింది. చోరీకి గురైన వాటిల్లో 31, 95, 97, 131, 279 నెంబర్లకు చెందిన వాల్యూమ్స్ ఉన్నట్లు గుర్తించామని ఎస్సై కృష్ణమోహన్ తెలిపారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ మృతి

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. కానీ, అఫ్సాన్ ఎలా మరణించాడనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. దీంతో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోయిన భారతీయుల సంఖ్య రెండుకు చేరింది. గుజరాత్‌కు చెందిన హమిల్(23) వారం రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌కు చెందిన అఫ్సాన్, రాష్ట్రంలోని నారాయణపేట జిల్లాకు చెందిన మహ్మద్ సుఫియాన్(23) సహా భారత్‌కు చెందిన చాలా మంది యువకులు దళారులు ద్వారా రష్యా సైన్యంలో సహాయకులుగా చేరారు. వీరంతా రష్యా సైన్యంతో కలిసి ఉక్రెయిన్ సరిహద్దుల్లో యుద్ధంలో పాల్గొంటున్నారు. ఇలా ఇరుక్కుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే రష్యాతో సంప్రదింపులు జరుపుతోంది. కాగా, అఫ్సాన్ మరణంపై రాయబార కార్యాలయం నుంచి తమకు ఫోన్ వచ్చిందని అతని సోదరుడు ఇమ్రాన్ సాహిల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అఫ్సాన్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు సాయం చేయాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కోరామన్నారు. దీంతో ఎంపీ అసదుద్దీన్ రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడారు

పెళ్లయిన ఐదు రోజులకే..

- రోడ్డు ప్రమాదంలో వధూవరులు సహా ఐదుగురి దుర్మరణం
- తిరుపతికి వెళ్లి తిరిగివస్తుండగా ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు
- కారులోని నవ దంపతులు, వరుడి తల్లిదండ్రులు, డ్రైవర్ మృతి
- ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఘటన

మచ్చబొల్లారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆ పెళ్లి జరిగి ఐదు రోజులే గడిచాయి. వివాహ వేడుక కోసం ఆ ఇంటి ముందు వేసిన పందిరి ఇంకా పచ్చగా ఉంది. గుమ్మాలకు వేసిన మామిడి తోరణాలు, పూల మాలలు తాజాగా ఉన్నాయి! కానీ వేడుక తాలూకు కళ తగ్గని ఆ ఇంటిని తీవ్ర విషాదం కమ్మేసింది. పెళ్లి, రిసెప్షన్ తర్వాత సంబురంగా కారులో దైవదర్శనానికి వెళ్లి, ఇంటికి తిరిగొస్తున్న వధూవరులు, వరుడి తల్లిదండ్రులు సహా ఐదుగురు ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతులు హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన నవ దంపతులు బాల కిరణ్ (30), కావ్యశ్రీ (28), బాల కిరణ్ తల్లిదండ్రులు రవీందర్ (55), లక్ష్మి (49). వీరు ప్రయాణిస్తున్న కారు, ఆళ్లగడ్డ సమీపంలోని నల్లగట్ల వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అశోక్ (22) కూడా మృతి చెందాడు. అల్వాల్ వెస్ట్ వెంకటాపురంలో ఉంటున్న రవీందర్‌కు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులున్నారు. బాల కిరణ్ పెద్ద కుమారుడు. స్వీడన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి నిశ్చయం కావడంతో గత నెల 8న స్వదేశానికి కొచ్చాడు. ఏపీలోని తెనాలికి చెందిన కావ్యతో ఈనెల 1న వధువు స్వస్థలంలోనే పెళ్లయింది. ఈనెల 3న తూంకుంటలోని సమ్మర్ గ్రీన్ రిసార్టులో రిసెప్షన్ జరిగింది. ఆ మరుసటి రోజు.. అంటే సోమవారం బాల కిరణ్, కావ్యశ్రీ, రవీందర్, లక్ష్మి కలిసి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం కారులో తిరుపతికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు బుధవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అశోక్ సహా కారులోని ఐదుగురూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ ఘటన పెళ్లింట తీవ్ర విషాదం నింపింది.


పెళ్లి రిసెప్షన్‌లో వధూవరులు బాలకిరణ్, కావ్య, వరుడి తల్లిదండ్రులు రవీందర్, లక్ష్మి (ఫైల్)

జోరుగా ధరణి స్పెషల్‌డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోకపోవడం వల్ల ధరణి పోర్టల్‌లో పాత యజమాని పేర్లే కనిపిస్తున్నాయి. డిజిటల్ పాస్‌పుస్తకాలు వారి పేరిటే పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇలాంటి కేసుల్లో డీఎస్ (డిజిటల్ సిగ్నేచర్) కాకుండా, పాస్‌పుస్తకం జారీ చేయకుండా ఉంటే.. పెండింగ్ మ్యుటేషన్ కింద దరఖాస్తు చేసుకుంటే కొనుగోలు చేసిన వారి పేరు మీద పాస్ పుస్తకం వచ్చేలా సిఫారసు చేస్తున్నారు. ఒకవేళ అమ్మిన యజమాని పేరు మీద డిజిటల్ పట్టాదార్ పాస్ పుస్తకం వస్తే.. అమ్మిన వ్యక్తిని, కొనుగోలు చేసిన వ్యక్తిని తహశీల్దారు కార్యాలయానికి పిలిపించి, కొన్న వ్యక్తి దగ్గర ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఈసీని పరిశీలిస్తున్నారు. భూమి క్రయవిక్రయాలపై వాస్తవాలు నిర్ధారించుకొని.. అమ్మిన వ్యక్తి నుంచి అంగీకార పత్రాలు రాయించుకొని, ఆ వ్యక్తి పేరుపై ఉన్న భూమిని డీలీట్ (తొలగించడం) చేస్తూ, కొన్న వ్యక్తి పేరున భూమిని నమోదు చేసేందుకు నివేదికలు తయారుచేస్తున్నారు. అలాగే.. దరణికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మందికి ఎదురవుతున్న ఇబ్బందుల్లో ఒకటి.. ఆర్ఎస్ఆర్ వేరియేషన్. అంటే రికార్డులలో ఉండాల్సిన భూవిస్తీర్ణం కంటే ఎక్కువ అనుభవదారుల పేర్లపై నమోదు చేయడం. అందులోనూ అమ్మేసిన వారిపేర్లపైన మళ్లీ పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేయడం, కొంత మంది అనుభవదారులపై ఉండాల్సిన భూమి కంటే ఎక్కువ భూమి నమోదు చేయడంతో అసలు కొనుగోలు దారులకు మ్యుటేషన్ చేయలేదు. మరి కొంతమందికి వారసత్వంగా రావల్సిన భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. ఈ సమస్యతో వేల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే.. కొన్ని పట్టా భూములను పీవోబీ జాబితాలో నమోదు చేశారు. వాటిని ఎండోమెంట్, భూదాన్, వక్ఫ్‌బోర్డు, అసైన్డ్ భూములుగా ధరణిలో పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను కూడా అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. పరిష్కారం లేని దరఖాస్తుల తిరస్కరణకు సిఫారసు చేస్తున్నారు.

సిబ్బంది సమస్య..

రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో దాదాపు 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వాటి పరిష్కారానికి మార్చి 1న మొదలైన స్పెషల్‌డ్రైవ్ 9న ముగియనుంది. ఆలోగా ఈ దరఖాస్తుల పరిశీలనకు సరిపడే సిబ్బంది లేకపోవడం, వరుస సెలవులు రావడంతో జాప్యం జరిగే అవకాశం ఉందని రెవెన్యూ సంఘాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 33 జిల్లాలు, 613 మండలాలు ఉన్నాయి. 892 మంది తహశీల్దార్లు, 920 మందికి పైగా డిప్యూటీ తహశీల్దార్లు, సుమారు 1240 ఆర్ఐలు, 2500 వరకు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరిని కలుపుకొన్నా.. ఒక్కో మండలానికీ 10-15 మందికి మించి సిబ్బంది లేరు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో పెండింగ్ దరఖాస్తులు వేల సంఖ్యలో ఉండగా.. ఇతర జిల్లాల్లో వందల్లో ఉన్నాయి. మండలాలవారీగా ఉన్న సిబ్బందితో 2 లేదా 3 బృందాలను ఏర్పాటు చేసినప్పటికీ.. ధరణి పెండింగ్ దరఖాస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నందున ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే మరింత సమయం పడుతుందని అధికారులు, సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. స్పెషల్ డ్రైవ్ నేపథ్యంలో ప్రస్తుతం ధరణిలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లు మినహాయించి మిగిలిన లావాదేవీలను బంద్ పెట్టారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది అంతా స్పెషల్ డ్రైవ్‌పైనే దృష్టి పెట్టారు. అయినా సర్కారు విధించిన గడువులోపే దరఖాస్తులను పరిశీలించి నివేదికలు పంపే ప్రక్రియను పూర్తి చేయడం సాధ్యమయ్యే పనికాదని వారు అభిప్రాయపడుతున్నారు. కొన్ని నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఉన్నట్టుండి ఒకేసారి ఎలా పరిష్కరించాలనే అంశంపై ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారుల్లో జోరుగా చర్చ సాగుతోంది. మండలానికొక తహశీల్దారు, ఒక డిప్యూటీ తహశీల్దారు, ఇద్దరు ఆర్ఐలు, ఒక సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్లుగా వచ్చిన ముగ్గురు, నలుగురు వీఆర్ఏలు మాత్రమే ఉన్నారని.. పాత, కొత్త రెవెన్యూ రికార్డులను సరి చూసుకోవడం, అనంతరం క్షేత్రస్థాయిలో అర్జీదారులు పొజిషన్‌లో ఉన్నారా లేదా అని నిర్ధారించుకోవడానికి వెళ్లడానికే చాలా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు.

ఐదు నిమిషాల్లోనే బయాప్సీ ఫలితం

- క్యాన్సర్ ఉన్నదీ లేనిదీ వెంటనే నిర్ధారించే 'వివాస్కోప్'
- ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నిర్ధారణకు చేసే బయాప్సీ పరీక్ష ఫలితం రావడానికి దాదాపు ఐదురోజులు పడుతుంది. అలా కాకుండా బయాప్సీ చేసిన ఐదు నిమిషాల్లోనే ఫలితాన్ని తెలిపే ఇన్‌స్టంట్ డిజిటల్ పాథాలజీ టెక్నాలజీ.. 'వివాస్కోప్'ను తాము అందుబాటులోకి తెచ్చినట్టు హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) హాస్పిటల్స్ చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. జీఐ ఎండోస్కోపీ రంగంలో దీన్నో అద్భుతంగా ఆయన అభివర్ణించారు. దీంతో ఎండోస్కోపీ గదిలోనే ఫలితాన్ని తెలుసుకునే వీలుండడం వల్ల చికిత్సకు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రూ.3 కోట్ల విలువైన ఈ పరికరం దక్షిణాసియాలోనే తొలిగా ఏఐజీలో అందుబాటులోకి రావడం గమనార్హం. కాగా.. సంప్రదాయ బయాప్సీ విధానంతో పోలిస్తే.. వివాస్కోప్‌తో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏఐజీ హాస్పిటల్స్ డైరెక్టర్ జీవీరావు తెలిపారు. బయాప్సీ ఫలితాలను వెంటనే వెల్లడించడమే కాక.. హైరిజల్యూషన్ చిత్రాలను స్టోర్ చేసుకోగల, షేర్ చేయగల సామర్థ్యం ఈ వివాస్కోప్‌కు ఉందని వివరించారు. ఏఐజీ హాస్పిటల్స్‌లో పాథాలజీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ అనూరాధ ఈ టెక్నాలజీని వైద్యరంగంలోనే కొత్త శకంగా అభివర్ణించారు. ఎక్కడో ఉన్న పాథాలజిస్టులు కూడా దీని సాయంతో చిత్రాలను విశ్లేషించగలరని, తద్వారా నిర్ధారణ, చికిత్స వేగంగా జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

మిగతా 8 సీట్లపై బీజేపీ కసరత్తు

రేపు పార్టీ పార్లమెంటరీ కమిటీ సమావేశం.. రెండు, మూడు రోజుల్లోనే రెండో జాబితా

న్యూఢిల్లీ, మార్చి 6 (ఫిబ్రవరి): లోక్‌సభ ఎన్నికల కోసం శరవేగంగా పావులు కదుపుతున్న బీజేపీ.. తెలంగాణలో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తొలి జాబితాలో 9 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన అధిష్ఠానం.. మిగతా 8 మంది అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. ఈ మేరకు శుక్ర, శని వారాల్లో బీజేపీ పార్లమెంటరీ కమిటీ భేటీ జరగనుంది. ఆ తర్వాత(రెండు, మూడు రోజుల్లోనే) రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 8 లోక్‌సభ స్థానాలకుగాను ఒక్కో చోట నుంచి మూడు పేర్లను సూచిస్తూ అధిష్ఠానానికి రాష్ట్ర కమిటీ నివేదిక అందించింది. అయితే, కాంగ్రెస్ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం యోచిస్తోంది. నల్లగొండ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని నిలబెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సైదిరెడ్డితో బీజేపీ పెద్దలు చర్చించగా.. రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ఖమ్మం సీటును మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్, గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన దేవకి వాసుదేవర రావు, గోంగూర వెంకటేశ్వర్లు(జీవీ), తాండ్ర వినోద్ ఆశిస్తున్నారు. అయితే, బీజేపీ మాత్రం కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. మహబూబాబాద్‌లో ఒక ఐఆర్ఎస్ అధికారిని నిలబెట్టాలని బీజేపీ భావిస్తుండగా.. కాంగ్రెస్ సైతం ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. పెద్దపల్లి సీటు కోసం బీజేపీ నేత మిట్టపల్లి సురేందర్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కిషన్ రెడ్డితోపాటు మరికొంతమంది నేతలను కలవడమేకాకుండా ఢిల్లీలోనే ఉండి సీటు ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు. అదే చోట నుంచి సోగాల కుమార్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. వరంగల్ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్, చింతా సాంబమూర్తి, శ్రీధర్ పేర్లు వినిపిస్తున్నాయి. మెదక్ సీటు కోసం రఘునందన్‌రావు, అంజిరెడ్డి పోటీ పడుతుండగా.. అనూహ్యంగా ఆలె నరేంద్ర కుమారుడు ఆలె భాస్కర్ పేరు తెరపైకి వచ్చింది. మహబూబ్‌నగర్ ఎంపీ సీటు కోసం డీకే అరుణ, జితేందర్ రెడ్డి పోటీ పడుతుండగా.. ఒకరి పేరు ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఆదిలాబాద్‌లో సిటింగ్ ఎంపీగా ఉన్న సోయం బాపూరావుకు తొలి జాబితాలో చోటు దక్కకపోవడంతో మాజీ ఎంపీలు గోడం నగేశ్, రాథోడ్ రమేశ్ ఢిల్లీ స్థాయిలో గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.

దేశ ప్రజలే మోదీ కుటుంబం: లక్ష్మణ్

హైదరాబాద్: దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోదీకి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని, అది చూసి తట్టుకోలేని కాంగ్రెస్.. ఇతర ప్రాంతీయ పార్టీలు మోదీకి కుటుంబం లేదంటూ విమర్శలు చేస్తున్నాయని బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ అన్నారు. దేశ ప్రజలే తన కుటుంబమని మోదీ అనుకుంటున్నారన్నారు. దేశ వ్యాప్తంగా పేదలకు ఇళ్లు కట్టించిన ప్రధానికి సొంత ఇల్లు కూడా లేదని, అసాధ్యం అన్న దాన్ని సుసాధ్యం చేసి చూపిస్తున్న మోదీనే మరోసారి రావాలని దేశమంతా నినదిస్తుందన్నారు. ప్రజలను వంచించి అధికారం చేతబట్టిన రేవంత్ రెడ్డి.. గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసే పని చేస్తున్నాయని, వీరికి ఎంఐఎం సంధి చేస్తుందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాల్లో గెలవబోయేది బీజేపీనే అన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం ప్రధానిని కలిస్తే తప్పేంటి?

- దీన్ని కూడా రాజకీయం చేస్తారా..?
- బీఆర్ఎస్ నేతలపై సంజయ్ మండిపాటు
- ఏ ముఖం పెట్టుకొని కరీంనగర్ సభ పెడుతున్నారంటూ కేసీఆర్‌పై ఆగ్రహం


శంకరపట్నంలో మాట్లాడుతున్న సంజయ్

శంకరపట్నం, మార్చి 6: రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం ప్రధానిని కలిస్తే తప్పేముందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రధానిని సీఎం కలవడాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర జరిగింది. ఈ సందర్భంగా లింగాపూర్ గ్రామంలో సంజయ్ కల్లు తాగారు. గౌడన్నలతో కలసి మోకు ధరించి కల్లు కుండ చేతబట్టారు. కల్లు ఆరోగ్యానికి మంచిదని, ఆరోగ్య నిపుణులు సైతం ఈ విషయాన్ని వెల్లడించారని గుర్తుచేశారు. గీత కార్మికుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేశవపట్నంలో ఆయన మాట్లాడారు. మోదీని పెద్దన్న అని సీఎం సంబోధించడంలో తప్పేముందని నిలదీశారు. దీనిని రాజకీయం చేయడం సిగ్గు చేటన్నారు. మోదీ ఎన్నోసార్లు రాష్ట్రానికి వస్తే దొంగలా దాక్కున్న వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు.

17 సీట్లు గెలిపిస్తే అధిక నిధులు తెస్తాం..

సీఎం భవిష్యత్తులో సైతం కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాలే తప్ప.. గొడవలు పెట్టుకుంటే నష్టపోయేది ప్రజలేననే విషయాన్ని గుర్తుంచుకోవాలని సంజయ్ అన్నారు. 'తెలంగాణలోని 17 ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకొచ్చే బాధ్యత మేమే తీసుకుంటాం. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ మోసం చేసింది. కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని కరీంనగర్‌లో సభ పెడుతున్నారు..? అవినీతితో కూడబెట్టిన కేసీఆర్ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలి. బరాబర్ మేం రాముడి గురించి మాట్లాడుతాం.. కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేకపోతే మసీదుకు వెళ్లి మొక్కుకోండి..' అని వ్యాఖ్యానించారు.

12న అమిత్ షా రాక!

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా 12న తెలంగాణకు రానున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు, కేడర్‌కు అమిత్ షా దిశానిర్దేశం చేయనున్నారు. ఈ మేరకు పోలింగ్ బూత్ అధ్యక్షులతో సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు ఎల్బీ స్టేడియంలో బహిరంగ సభకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కేజీఎఫ్ సభ్యులు

కమ్మ సామాజికవర్గ అభివృద్ధికి కేజీఎఫ్ ఏర్పాటు

- జూలై 20, 21 తేదీల్లో ఇంటర్నేషనల్ సమ్మిట్
- వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మ సామాజికవర్గం అభివృద్ధే లక్ష్యంగా కమ్మ గ్లోబల్ ఫెడరేషన్(కేజీఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో బుధవారం కేజీఎఫ్ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ ఏడాది జూలై 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కేజీఎఫ్ ఇంటర్నేషనల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు కుసుమకుమార్ తెలిపారు. ఈ సమావేశంలో తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, తాజా మాజీ అధ్యక్షులైన సతీష్ వేమన, లావు అంజయ్య చౌదరితో పాటు యూకేకు చెందిన గుంటుపల్లి జయకుమార్, కర్నాటక కమ్మ సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, కేజీఎఫ్ గల్ఫ్ కౌన్సిల్ కోఆర్డినేటర్ జె. గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెట్టి మాట్లాడుతూ.. కమ్మ కమ్యూనిటీ ఆర్గనైజేషన్‌లోని సభ్యులందర్నీ ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన అవసరాన్ని వివరించారు. కమ్మ సామాజికవర్గం అభివృద్ధి చెందడమే కాకుండా సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మన దేశమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మ సామాజికవర్గానికి సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభాలో కమ్మ సామాజికవర్గం 6 శాతం(22 లక్షలు) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 7 శాతం(36.5 లక్షలు), తమిళనాడులో 7.7 శాతం(65 లక్షలు), కర్నాటకలో 6 శాతం(40 లక్షలు) ఉన్నట్లు వెల్లడించారు.


ప్రాణప్రతిష్ఠ పూజలు చేస్తున్న చినజీయర్ స్వామి

'స్వర్ణగిరి' వేంకటేశుడికి ప్రాణప్రతిష్ఠ

- పాల్గొన్న చినజీయర్, కోమటిరెడ్డి, కవిత

భువనగిరి రూరల్, మార్చి 6: స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం భువనగిరి శివారులోని మానెపల్లిహిల్స్‌లో నిర్మించిన పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, హోమాది క్రతువులతో స్వామి వారి పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. కార్యకమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 7 మార్చి 2024

diksuchi@andhrajyothy.com

ఏపీ ఐసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్ఈ)-ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఐసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్లు/నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏలో ప్రవేశానికి మాత్రం ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; డిస్టెన్స్/ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానాల్లో డిగ్రీ చదివినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వన్ సిట్టింగ్ విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ఏపీ ఐసెట్ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్షలో అనలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో డేటా సఫిషియెన్సీ నుంచి 20 ప్రశ్నలు, ప్రాబ్లమ్ సాల్వింగ్ నుంచి 55 ప్రశ్నలు ఇస్తారు. రెండో సెక్షన్‌లో ఒకాబులరీ నుంచి 15, ఫంక్షనల్ గ్రామర్ నుంచి 20, బిజినెస్ అండ్ కంప్యూటర్ టర్మినాలజీ నుంచి 15, రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. మూడో సెక్షన్‌లో అర్థమెటికల్ ఎబిలిటీ నుంచి 35, ఆల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ నుంచి 10, స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. రెండో సెక్షన్ ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో; మొదటి సెక్షన్, మూడో సెక్షన్ ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 200. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం(50 మార్కులు) రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.650; బీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 7
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 28 నుంచి 29 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 2 నుంచి
- **ఏపీ ఐసెట్ 2024 తేదీలు:** మే 6, 7
- **ఫలితాలు విడుదల:** జూన్ 20
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

తెలంగాణ ఎడ్‌సెట్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఎడ్‌సెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షని నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, ఓరియంటల్ లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో ఒకటి ఎంచుకోవాలి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ/బీఎస్సీ హోంసైన్స్/బీఏ(ఓరియంటల్ లాంగ్వేజెస్/లిటరేచర్)/బీసీఏ/బీబీఎం/బీబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ/తత్సమాన అర్హత ఉన్నవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఎంబీబీఎస్/బీఎస్సీ ఏజీ/బీవీఎస్సీ/బీహెచ్ఎంటీ/బీఫార్మసీ/ఎల్ఎల్‌బీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు; డిగ్రీ చదవకుండా పీజీ చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీఎస్ ఎడ్‌సెట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్, టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, కంప్యూటర్ అవేర్‌నెస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు; జనరల్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషనల్ అంశాల నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. మేథ్స్, సైన్స్, సోషల్ ప్రశ్నలు పదోతరగతి తెలంగాణ సిలబస్ ఆధారంగా ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్-ఉర్దు మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది వర్తించదు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.550
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 6
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 13 నుంచి 15 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 20 నుంచి
- **టీఎస్ ఎడ్‌సెట్ 2024 తేదీ:** మే 23
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సిద్దిపేట్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కర్నూలు, విజయవాడ.
- **వెబ్‌సైట్:** https://edcet.tsche.ac.in

నోటిఫికేషన్స్

నిట్ ఎంసీఏలో ప్రవేశానికి నిమ్‌సెట్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సంస్థలు అందిస్తున్న మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన 'నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (నిమ్‌సెట్) 2024' నోటిఫికేషన్ వెలువడింది. దీనిని నిట్ జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఇందులో ఐఐఐటీ భోపాల్ సహా వరంగల్, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి, కురుక్షేత్ర, అగర్తల, జంషెడ్‌పూర్, భోపాల్, అలహాబాద్, పట్నా నిట్‌లు పార్టిసిపేట్ చేస్తున్నాయి. నిమ్‌సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. వరంగల్, జంషెడ్‌పూర్ నిట్‌లలో రెండేళ్ల కోర్సు పూర్తయ్యాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి పోస్ట్ గ్రాడ్యుయేట్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్(పీజీఏడీసీఏ)ని ప్రదానం చేస్తారు. కురుక్షేత్ర, పట్నా నిట్‌లలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ అందుబాటులో ఉంది.



సీట్ల వివరాలు: మొత్తం 1033 సీట్లు ఉన్నాయి. వరంగల్ నిట్‌లో 58, తిరుచిరాపల్లి నిట్‌లో 115, సూరత్కల్ నిట్‌లో 58, రాయ్‌పూర్ నిట్‌లో 110, కురుక్షేత్ర నిట్‌లో 96(వీటిలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ సీట్లు 32), జంషెడ్‌పూర్ నిట్‌లో 115, భోపాల్ ఎంఏఎన్ఐటీలో 115, అలహాబాద్ ఎంఎన్ఐటీలో 116, అగర్తల నిట్‌లో 30 సీట్లు ఉన్నాయి. పట్నా నిట్‌లో డేటా సైన్స్&ఇన్ఫర్మాటిక్స్ 80, ఏఐ&ఐటీ 80 సీట్లు ఉన్నాయి. సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద ప్రతి స్పెషలైజేషన్‌లో సగం సీట్లు కేటాయించారు. భోపాల్ ఐఐఐటీలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు; బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు; ఓపెన్ యూనివర్సిటీల నుంచి దూరవిద్య విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

నిమ్‌సెట్ 2024 వివరాలు: ఈ పరీక్షని సీబీటీ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొదటి పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 70 నిమిషాల పరీక్ష సమయం ఉంటుంది. రెండో పార్ట్‌లో అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 40 ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల సమయం ఇస్తారు. మూడో పార్ట్‌లో కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 20, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. దీనికి 20 నిమిషాల సమయం ఇస్తారు. మేథమెటిక్స్ ప్రశ్నలకు ఒక్కోదానికి 12 మార్కులు; అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రశ్నలకు ఒక్కోదానికి 6 మార్కులు; జనరల్ ఇంగ్లీష్ ప్రశ్నలకు ఒక్కోదానికి 4 మార్కులు కేటాయించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు వంతు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 1000. ప్రశ్నలన్నీ ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎడిట్ విండో ఓపెన్:** ఏప్రిల్ 24 నుంచి 26 వరకు
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **నిమ్‌సెట్ 2024 తేదీ:** జూన్ 8
- **ఫలితాలు విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్, చాయిస్ ఫిల్లింగ్:** జూన్ 29 నుంచి జూలై 5 వరకు
- **మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 8
- **రెండో రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 13
- **మూడో రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 18
- **మిగిలిన సీట్ల వివరాలు ప్రకటన:** జూలై 23
- **స్పెషల్ రౌండ్ సీట్ల కేటాయింపు:** జూలై 27
- **వెబ్‌సైట్:** www.nimcet.in, www.nimcet.admissions.nic.in

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

జల సంరక్షణ విధానాలు

దేశంలో ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** బిహార్+ఉత్తరప్రదేశ్
- **దామోదర్ వ్యాలీ ప్రాజెక్ట్:** జార్ఖండ్+వెస్ట్ బెంగాల్
- **రామ్ గంగా:** ఉత్తరాఖండ్+ఉత్తరప్రదేశ్
- **చంబల్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+రాజస్థాన్
- **ఇందిరాసాగర్ ప్రాజెక్ట్:** మధ్యప్రదేశ్+గుజరాత్
- **సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్:** గుజరాత్+రాజస్థాన్+మధ్యప్రదేశ్+మహారాష్ట్ర

అంతర్జాతీయ ఉమ్మడి ప్రాజెక్టులు

- **గండక్ ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **మహంకాళి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **కోసి ప్రాజెక్ట్:** ఇండియా+నేపాల్
- **సంకోష్ ప్రాజెక్ట్:** ఇండియా+భూటాన్
- **తనక్ పూర్ ప్రాజెక్ట్:** ఇండియా+ నేపాల్

భారతదేశంలో సంప్రదాయ నీటిపారుదల, జల సంరక్షణ విధానాలు

- **జింగ్:** కరిగిన హిమనీ నదాల నీటిని సేకరించడానికి నిర్మించిన ట్యాంక్‌లు. ఇవి లడక్‌లో ఉన్నాయి.
- **నౌల:** ఉత్తరాఖండ్‌లో చుట్టుపక్కల ప్రవాహాల నుంచి నీటిని సేకరించడానికి నిర్మించిన చిన్న చిన్న బావులు
- **ఖుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన కాలువలు
- **గుల్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు
- **బౌడి:** హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్, కాంగ్రా, మండి జిల్లాల్లో కొండవాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను సేకరించడానికి ప్రత్యేకంగా నిర్మించిన బావులు.
- **నాప్స్:** హిమాచల్ ప్రదేశ్‌లో తాగునీటి కోసం, ఇంటి అవసరాల కోసం నిర్మించిన బావులు.
- **ఖత్రి:** హిమాచల్ ప్రదేశ్‌లో కొండవాలుల వెంబడి ప్రవహించే వర్షపు నీటిని సేకరించడానికి రాళ్లతో నిర్మించిన బావులు
- **డిఘీ:** ఢిల్లీ ప్రాంతంలో నిర్మించిన చిన్న చిన్న బావులు లేదా కుంటలు
- **అహర్-పైన్స్:** అహర్- బిహార్‌లో వర్షపు నీటిని మళ్లించి నిల్వచేసేందుకు నిర్మించిన జలాశయాలు. పైన్స్-అహర్...జలాశయాల నుంచి నీటిని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించడానికి నిర్మించిన చిన్న చిన్న నీటిపారుదల కాలువలు.



- **అపతాని:** అరుణాచల్ ప్రదేశ్‌లో ఉపరితల, భూగర్భ జలాలను ఉపయోగించి వరి, చేపల పెంపకం చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతులు
- **జబో/రుజా:** నాగాలాండ్‌లో వరద ప్రవాహాన్ని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన కాలువలు.
- **చీవ్-ఓజిహి:** నాగాలాండ్‌లో కొండ వాలుల వెంబడి ప్రవహించే నీటి ప్రవాహాలను మళ్లించడానికి ఏర్పాటు చేసిన అతి పొడవైన వెదురు పైపుల కాలువలు.
- **తుయ్ ఖుర్:** మణిపూర్, మిజోరాంలలో ఉన్న నీటి బుగ్గలు
- **వెదురు డ్రిప్:** మేఘాలయాలో వాలుల వెంబడి ప్రవహించే నీటిని సేకరించి అత్యధిక దూరంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు నీటిని తీసుకెళ్లే వెదురు పైపులు.
- **డాంగ్స్:** అసోంలోని బోడో తెగలు ఉపయోగించే నీటి కుంటలు
- **గర్-దార:** చుట్టుపక్కల ఉండే నీటి ప్రవాహాల నుంచి నీటిని సేకరించి నిల్వ ఉంచే అతిపెద్ద బావులు
- **డంగ్స్/జంపోయిస్:** పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురిలో వరి పొలాల కోసం ఏర్పాటు చేసిన నీటి కాలువలు
- **ఇనుండేషన్ ఛానెల్స్:** పశ్చిమ బెంగాల్‌లో వరద ప్రవాహాన్ని వ్యవసాయ క్షేత్రాలకు మళ్లించే కాలువలు.
- **పాట్:** మధ్యప్రదేశ్‌లోని బాబువ ప్రాంతంలో నీటి ప్రవాహాలను మళ్లించడానికి నిర్మించిన కట్టలు.
- **కటాస్/బందాస్:** ఒడిశాలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **హవేలి:** మధ్యప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలలో నిర్మించిన మట్టి ఆనకట్టలు
- **కుయిస్/బెరీస్:** రాజస్థాన్‌లో వర్షపు నీటిని సేకరించేందుకు ఏర్పాటు చేసిన లోతైన గుంతలు
- **బావోరీస్/బెర్స్:** రాజస్థాన్‌లో ప్రధానంగా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బావులు
- **పార్:** రాజస్థాన్‌లో లోతైన గుంతలలో(బెరీస్) నిల్వ చేసిన నీటిని వాడుకునే ప్రాంతం
- **కుండ్స్/కుండీస్:** రాజస్థాన్‌లోని పాళీ ప్రాంతంలో సాసర్ ఆకారపు పరివాహపు ప్రాంతాన్ని కలిగిన వలయాకారపు భూగర్భ బావులు
- **తలాబ్/నాడి:** రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతంలోని గ్రామాలలో నిర్మించిన నీటి కుంటలు.
- **టంకాలు:** బికనీర్ ప్రాంతంలో గృహాలలో తాగునీటి కోసం సున్నపురాయితో నిర్మించే బావులు
- **బావోళి/బావడి:** రాజస్థాన్‌లో దిగుడు మెట్ల బావిని పోలిన నిర్మాణాలు. వీటినే 'వావ్' లేదా 'వారది' అని గుజరాత్‌లో పిలుస్తారు.
- **జోహడ్స్:** రాజస్థాన్‌లో వాలుకు అనుగుణంగా మూడు వైపులా కట్టలు నిర్మించి ఒక వైపున నీరు ప్రవహించడానికి అనువుగా నిర్మించిన నిర్మాణాలు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకడానికి ఈ నిర్మాణాలు ఉపయోగపడతాయి.
- **పాడ్, భాండారాలు:** మహారాష్ట్రలోని తపతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. బందారా అంటే చిన్న వాగుల మీద అడ్డంగా కట్టిన కట్టలు. వాటి నుంచి కాలువలు తవ్వి, నీటిని వ్యవసాయ భూములకు తరలిస్తారు. ఈ వ్యవసాయ భూములను పాహాడ్స్ అం టారు.

నోట్: తమిళనాడు రాష్ట్రం మొట్ట మొదటి సారిగా వర్షపు నీటిని నిల్వ చేయటాన్ని చట్టంగా చేసింది.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్




పోటా పోటీ

ఒక ఊరి విదుర్ అనే గురువు ఉండేవాడు. అతడు జ్ఞానంలో దిట్ట. వందల మంది తన దగ్గర చదువుకుని ప్రయోజకులు అయ్యారు. ఎంతో మంది మెప్పు పొందారు. బిరుదులూ పొందారు. అయితే అతను సంపాదించుకున్న సొమ్ము తక్కువ. పొగడటం వల్ల అతను పడిపోయాడు. దీంతో తన రక్తసంబంధీకులే అతన్ని పొగిడి మెల్ల మెల్లగా డబ్బులు కాజేశారు. ఉన్న డబ్బులు పోవటంతో సన్యాసిగా మారాడు విదుర్.

సన్యాసిగా మారాడు. పైగా వయసు వచ్చింది. తన వాలకం చూసి ఇంట్లో వాళ్లు పట్టించుకోలేదు. దీంతో అడవికి వెళ్లాడు. తపస్సు చేసుకునేవాడు. ఒక రోజు తన చెంతకు ఇద్దరు మూర్ఖులు వచ్చారు. 'మీరే రక్ష' అనటంతో వారిరువురినీ తన శిష్యులుగా నియమించుకున్నాడు. జ్ఞానం బోధించేవాడు. అయినా వారికి ఎక్కేది కాదు. దీంతో వారిని తిట్టేవాడు గురువు. అయినా మూర్ఖులు పట్టించుకునేవారు కాదు. గురువే గొప్ప అనేవారు. దీంతో పొంగిపోయి విదుర్ తన శిష్యులను ఏమీ అనేవాడు కాదు.

గురువుకు మెల్లమెల్లగా కాళ్ల నొప్పులు మొదలయ్యాయి. నేను కాళ్లు పడతానంటూ ఇద్దరూ కొట్లాడుకున్నారు. మూర్ఖులు కాబట్టి తల బద్దలు కొట్టుకున్నారు. ఇది చూసిన గురువు 'ఇలా గొడవ పడవద్దు' అంటూ హితబోధ చేశాడు. ఒకడికి కుడికాలు, రెండోవాడికి ఎడమకాలు పట్టమని చెప్పాడు. ఇద్దరూ పోటాపోటీగా గురువు కాళ్లను పట్టేవారు. నొప్పులు పోయి హాయిగా విశ్రాంతి తీసుకునేవాడు గురువు. ఒక రోజు ఎడమకాలు పట్టేవాడు పనిమీద ఓ గ్రామానికి వెళ్లిపోయాడు. రెండోవాడు మాత్రం తన కుడికాలిని పట్టాడు. ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో.. 'నాయనా.. ఎడమ కాలు కూడా పట్టు' అన్నాడు. మూర్ఖుడు కాబట్టి.. 'నేను వాడి కాలినెందుకు పట్టాలి?' అనడిగాడు. 'నీకు పుణ్యం ఉంటుంది నాయనా' అన్నాడు. ఎడమ కాలిమీద కోపంతో ఒక రాయి తీసుకుని వచ్చి గురువు గారి కాలిమీద వేశాడు. కాలు నొప్పితో విలవిల్లాడిపోయాడు. మరుసటి రోజు ఎడమకాలు పట్టే వ్యక్తి వచ్చాడు. ఆ రోజు కుడికాలు పట్టినవాడు రాలేదు. విషయం తెలుసుకున్న ఎడమ కాలు పట్టేవాడు ఇలా అన్నాడు. 'నేను అంత చేతకాని వాణ్ని అవుతానా? నేను తక్కువేం కాదు. వాడితో సమాన పోటీ ఉంటాను కదా' అని రాయితో కాలిమీద వేశాడు. కుడికాలి నొప్పితో విలవిల్లాడిపోయాడు. 'మీ పోటీ నా చావుకు వచ్చింది కదరా..' అని వారిని తరిమేశాడు అక్కడనుంచి. మూర్ఖులు పోటాపోటీగా పరిగెత్తుతూ వెళ్లిపోయారు. 'ఎవడిపాణం పోతుందో వీళ్ల వల్ల ' అనుకున్నాడు గురువు తన మనసులో!

ఎన్ని జంతువులు ఉన్నాయి



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 248

9			5				8	3
6	5		3					
				4	1			
		6		1	2			
	4						6	
			6	9		1		
			9	3				
					4		1	7
3	2				6			8

సుడోకు - 247 సమాధానం

2	5	4	7	6	1	3	8	9
1	3	9	5	8	2	6	4	7
7	6	8	3	9	4	1	5	2
9	4	1	8	7	3	2	6	5
3	8	5	4	2	6	9	7	1
6	7	2	1	5	9	4	3	8
5	9	3	2	4	8	7	1	6
4	2	7	6	1	5	8	9	3
8	1	6	9	3	7	5	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.